9

# క్రీస్తు సర్వసంపూర్ణత గూర్చిన పౌలు చిత్రీకరణము, 2

## కొలొస్సయులకు 2:10-15

### క్రీస్తులో సర్వసంపూర్ణత (2:10, 11)

**[10]మరియు ఆయనయందు మీరును సంపూర్ణులైయున్నారు. ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సై యున్నాడు; [11]మీరును, క్రీస్తు సున్నతియందు, శరీరేచ్ఛలతోకూడిన స్వభావమును విసర్జించి ఆయనయందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి.**

**"మరియు ఆయనయందు మీరును సంపూర్ణులై యున్నారు" (2:10ఎ)**

సంపూర్ణత అనునది గ్రీకు *peplērōmenoi* అను పదమునకు అనువాదమై యున్నది. ఈ పదము లోపసహితమైన నిశ్చేష్ట అసమాపక క్రియా పదమై యున్నది గనుక, క్రైస్తవులు సంపూర్ణులుగా చేయబడియున్నారనియు, వారు యేసుక్రీస్తునందు సంపూర్ణులుగా చేయబడుట కొనసాగుచున్నదనియు అర్థమిచ్చుచున్నది. 9వ వచనంలోని "సర్వసంపూర్ణత" ప్రవచనమును "నెరవేర్చుటకు" అని అర్థమిచ్చు అదే పదములో నుండి వచ్చినది, కానీ ఇక్కడ అది కొలొస్సీ పట్టణములోని క్రైస్తవులు వారి అనేక అవసరములలో కొరత లేనివారై యుండిరని అర్థమిచ్చుచున్నది. దేవుని దైవికమైన స్వభావము యొక్క "సర్వసంపూర్ణత"కు – మొత్తానికే – యేసు రూపమిచ్చుచున్నందునుబట్టి, ఆయన తన అనుచరులను "సంపూర్ణులు"గా చేయగలుగుచున్నాడు. "ఆయన పరిపూర్ణతలో నుండి మనమందరము కృప వెంబడి కృపను పొందితిమి" (యోహాను 1:16).

**ఆయన యందు** అను పదజాలము క్రైస్తవులు సంపూర్ణులుగా చేయబడుటకు అవసరమైయున్న ఆధ్యాత్మిక సంబంధమును సూచించుచున్నది. దేవునితో కలిగియుండవలసిన సంబంధము నిమిత్తము అవసరమైయున్న ప్రతి అంశము క్రీస్తునందున్న వారికి మాత్రమే అందుబాటులో ఉన్నది. ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము ఆయనయందే ఉన్నది (ఎఫెసీయులకు 1:3). విమోచనము, కృప, నూతన సృష్టియై యుండుట, సమాధానపర్చబడుట, దేవుని నీతి, ఆయన రక్తము వలని ప్రయోజనము, పాపక్షమాపణ, రక్షణ, మరియు నిత్యజీవము ఈ ఆశీర్వాదములలో కలుపుకొనబడి యున్నవి![1] క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినవారు మాత్రమే ఆయనయందున్నారు (రోమీయులకు 6:3; గలతీయులకు 3:27).

క్రీస్తునకు వెలుపల ఉన్నవారు "ఇశ్రాయేలుతో సహపౌరులుకాక, పరదేశులను, వాగ్దాన నిబంధనలు లేని పరజనులును, నిరీక్షణలేనివారును, లోకమందు దేవుడులేనివారునై యుండి, క్రీస్తుకు దూరస్థులై యున్నారు" (ఎఫెసీయులకు 2:12). యేసుకు వెలుపల,

మానవులు అసంపూర్ణులును "దూరస్థులు"నై యున్నారు. "ఆయన యందు," ఈ పరిస్థితి మారిపోతుంది. "అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తుయేసునందు క్రీస్తు రక్తమువలన సమీపస్థులై యున్నారు" (ఎఫెసీయులకు 2:13).

"క్రీస్తునందుండియు" ఫలించనివారు మరియు యేసు నందు నిలిచియుండనివారు తీసి పారవేయబడి, కాల్చివేయబడుదురు (యోహాను 15:2, 6). యేసుతో వానికి గల సంబంధమును క్రైస్తవుడు తెంచుకొన్నట్లయితే, వాడు నిత్యజీవమను దేవుని కృపావరమును పోగొట్టుకొనును. క్రీస్తునందుండు ప్రతివాడు సంపూర్ణుడుగా చేయబడియున్నాడు, కానీ ఆయన లేకుండా ఒకడు ఏమియు చేయలేడు (యోహాను 14:5బి). క్రీస్తునందు నిలిచియుండగోరువాడు ఆయన ఆజ్ఞలను గైకొనవలెను (1 యోహాను 2:3-5).

ఒకడు ఆధ్యాత్మిక జీవితము కలిగియుండి దేవునికి అంగీకారమైన విధంగా ఆయనను సేవించునట్లు యేసు వానికి అవసరమైయున్న ప్రతి విషయమును సమకూర్చును. యేసు తప్ప మరొక బోధకుడు లేదా బోధలపై స్థాపింపబడు ఏ మతమైనను అది తప్పుడు పునాదిపై కట్టబడుచున్నదౌతుంది. యేసే నిజమైన పునాదియై యున్నాడు (1 కొరింథీయులకు 3:11). యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు (యోహాను 14:6). యేసు నామములో తప్ప ఇతరమైన మరి యే నామములోనైనను రక్షణ లేదు (అపొస్తలుల కార్యములు 4:12).

యేసు పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులకును ప్రవక్తలకును బయలుపర్చిన నూతన ఒడంబడిక సంబంధమైన సకల సత్యము క్రొత్త నిబంధనలో కలదు (యోహాను 16:13; ఎఫెసీయులకు 3:5). ఆకాశము భూమియు గతించును గాని ఆయన మాటలు గతించవని యేసు స్పష్టంగా తెలియజెప్పాడు (మత్తయి 24:35). దేవుని వాక్యము నిరంతరము నిలిచియుండునని పేతురు రచించాడు (1 పేతురు 1:23, 25). అది ఒకే విధముగా - ఏ మార్పైనను లేకుండా, దానిలో నుండి ఏదియు తీసివేయబడకుండా లేదా దానికి ఏదియు కలుపబడకుండా - ఉండును. దేవుని ప్రత్యక్షత సంపూర్ణమైనదై యున్నది కాబట్టి దానికి విధేయతతో లోబడువారిని అది సంపూర్ణులనుగా చేయును. మనము దేవుని సేవించుటకు అవసరమైయున్న ప్రతి అంశమును మొదటి శతాబ్దములో పూర్తిచేయబడిన లేఖనములు మనకు సమకూర్చుచున్నవి (2 తిమోతి 3:16, 17).

"కడవరి దినములు పరిశుద్ధులైన యేసు క్రీస్తు సంఘము" (మార్మొనులు) యొక్క రచనలు, బైబిలు సంపూర్ణమైనది కాదనుచున్నవి. ఈ విధంగా వారు యేసు యొక్క ఉపదేశముల సంపూర్ణతను తృణీకరించుచున్నారు. ఉదా॥ "ఏలయనగా, మీకు బైబిల్ ఉన్నది కాబట్టి అందులో నా మాటలన్నియు ఉన్నవని మీరనుకొనవద్దు సరికదా, ఇంకా కొన్ని విషయములు రచింపబడునట్లు నేను చేయలేదని కూడా మీరనుకొనవద్దు" అని బుక్ ఆఫ్ మార్మొన్స్ చెప్పుచున్నది (2 నెఫి 29:10). ఇది యేసు బోధలకు వ్యతిరేకముగా నున్నది.

మహమ్మదు సహితము అదనపు సత్యము తీసికొనిరాలేకపోయాడు. పరిశుద్ధాత్మను, అనగా ఆదరణకర్తను పంపుతానని యేసు అపొస్తలులకు వాగ్దానం చేసాడు. మహమ్మదు జీవించుటకు ఆరువందల సంవత్సరములకు పూర్వమే అపొస్తలులు మరణించారు. ఖురాన్ ద్వారా తెలియుచుండు మహమ్మదు బోధలలో అంతక మునుపు బయలుపర్చబడని సత్యము లేదు. మానవాళికి అవసరమైయున్న దేవుని సత్యమంతయును పరిశుద్ధ బైబిల్‌లో ఉన్నది.

క్రైస్తవుల క్రీస్తునందు సంపూర్ణులై యున్నారు గనుక వారు ఇతరమైన ఏ విశ్వాస సూత్రములకు, చేతిపుస్తకములకు, క్రమశిక్షణలకు, కడవరి దినముల ప్రత్యక్షతలు అని పిలువబడు విషయములకు, లేదా దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన ధర్మశాస్త్రమునకు సహితము లోబడవలసిన అవసరము లేదు. అపొస్తలులకు బయలుపర్చబడినవి, సత్యమునకు సంబంధించిన యేసు మాటలు గతించిపోలేదు. ఈ అంత్య దినములలో జీవించుచున్నవారికి దేవుడు యేసు క్రీస్తు ద్వారా బయలుపరచినవన్నియు క్రొత్త నిబంధనలో కలవు (హెబ్రీయులకు 1:1, 2). క్రొత్త నిబంధనలో గల మాటలు, అటుతరువాత వచ్చిన ఏ పుస్తకములోని మాట లైనను కాదు, క్రైస్తవ యుగములో జీవించుచున్నవారికి తీర్చబడు తీర్పుకు ఆధారమై యుండును (యోహాను 12:48).

**"ఆయన సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు" (2:10బి)**

దైవత్వము యొక్క సర్వసంపూర్ణతకు యేసు రూపము నిచ్చుచున్నాడనునదొక వాస్తవము గనుక, ఆయన దేవత్వమునకు గల అధికారమును కలిగియున్నాడు. ఈ అధికారము ఒక బహుమానమై యున్నది, ఒక అదృష్టము కాదు. అది వాస్తవము. ఆయనకు భూమి మీదను పరలోకమందును సర్వాధికారమున్నది (మత్తయి 28:18), ఆయన దేవుని కుడిపార్శ్వమునకు ఆరోహణుడై వెళ్లినప్పుడు ఆయన దానిని పొందుకొన్నాడు (ఎఫెసీయులకు 1:20–23; 1 పేతురు 3:22). సమస్తమును, సకల జీవులును, తండ్రి తప్ప, ఆయన అధికారము క్రింద ఉన్నారు (1 కొరింథీయులకు 15:27; 1 పేతురు 3:22).

"శిరస్సు" (*kephalē*)[2] అను పదము నియంత్రణ మరియు సర్వాధిపత్యమును సూచించుచున్నది. క్రీస్తు సమస్త ప్రధానులకును అధికారులకును శిరస్సైయున్నాడు అనగా, విశ్వమందలి ప్రతి అధికారము, పరలోకమందును భూమిమీదను, ఆయన అధికారము క్రింద ఉన్నదని అర్థము. ఈ హేతువునుబట్టియే, కొలొస్సయులు ఇతర ప్రజలకు భయపడాల్సిన అవసరంలేదు లేదా యేసు మరియు యేసు బోధలకు వ్యతిరేకమైన ఇతర అధికారములకు లోబడనవసరంలేదు.

ప్రస్తుతము, యేసే ఈ విశాల విశ్వమంతటికి సర్వాధికారియై యున్నాడు (మత్తయి 28:18). ఆయన ఇహమునకు రాక పూర్వము, అధికారమును తండ్రితో కూడ పంచుకొనుచుండెను (యోహాను 17:5). ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఆయన సమస్త ఏలుబడి అంతమగును (1 కొరింథీయులకు 15:24). రాజ్యము తిరిగి తండ్రికి, అనగా యేసు ఆయనకు లోబడుచున్నవాడైన తండ్రికి అప్పగింపబడును (1 కొరింథీయులకు 15:28). భవిష్యత్తులో యేసు ఇహలోక సంబంధమైన రాజ్యమును ఏలనైయున్నాడను సిద్ధాంతము 1 కొరింథీయులకు 15:24–28లో గల వాక్యభాగమునకును బైబిలులోని అనేక ఇతర భాగములకును వ్యతిరేకముగా నున్నది.

యేసు ఇప్పుడు సమస్త ప్రధానులను మరియు అధికారులను ఏలుచున్నాడు. ఈనాడు ఆయన రాజ్యము దాని ఉనికిని కలిగియున్నది, గనుక క్రైస్తవులు దానిలో పౌరులైయున్నారు (ఎఫెసీయులకు 2:19; కొలొస్సయులకు 1:13). ఆయన అధికారమునకు లోబడువారు సంపూర్ణులుగా చేయబడుదురు.

**“మీరును క్రీస్తు సున్నతియందు శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి ఆయనయందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి” (2:11ఎ)**

క్రైస్తవులు క్రీస్తునందు సంపూర్ణులై యున్నారని 10వ వచనంలో చూపించిన తరువాత, మనము ఆయన యందు కలిగియున్న కొన్ని నిర్దిష్టమైన ఆశీర్వాదములను పౌలు ప్రస్తావించుచున్నాడు. ఈ విభాగములో పేర్కొనబడిన మొదటిది **చేతులతో చేయబడిన సున్నతియై యున్నది.**

దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానమునుబట్టి సున్నతికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడినది. సున్నతి పొందినవారికి ఆయన దేవుడై యుండునని దేవుడు సెలవిచ్చాడు (ఆదికాండము 17:7-13). ఈ వాగ్దానము సున్నతి పొందని హెబ్రీ పిల్లలకు లేక సున్నతి పొందని అన్యజనులకు వర్తింపబడజేయలేదు; వాగ్దాన ఒడంబడికల నుండి వారు మినహాయింపబడిరి (ఎఫెసీయులకు 2:11-13). సున్నతి పొందని హెబ్రీ ప్రజలందరును ఇశ్రాయేలీయులలో నుండి తొలగింపబడవలసినవారై యుండిరి (ఆదికాండము 17:14). క్రొత్త నిబంధన క్రింద, దేవుడు బాప్తిస్మమును ఆధ్యాత్మిక సున్నతి పొందినవారికి దేవుడై యున్నాడు. మనము బాప్తిస్మము పొందినప్పుడు, మనము ఆయన పిల్లలమగుదుము మరియు ఆయన అబ్రాహాముకు చేసిన వాగ్దానమునకు వారసులముగా చేయబడుదుము (గలతీయులకు 3:26-29).

11-13 వచనములలో శారీరక సున్నతి మరియు ఆధ్యాత్మిక సున్నతి యను రెండు సున్నతులు పోల్చబడినవి. మొదటిది. *పౌలు శారీరక సున్నతిని ఆధ్యాత్మిక సున్నతితో పోల్చుచున్నాడు.*

క్రీస్తునందుండిన కొలొస్సయులు క్రీస్తు సున్నతియందు, “శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి” “చేతులతో చేయబడని” క్రీస్తునందలి ఆధ్యాత్మిక సున్నతి చేయబడిరి. ఈ సున్నతి భౌతికంగా యూదులకు మానవ హస్తములతో చేయబడుచుండిన సున్నతికి భిన్నమైనదై యున్నది. కొలొస్సీలో క్రీస్తునంగీకరించినవారికి మానవ హస్తములు బాప్తిస్మమియ్యలేదని పౌలు బోధించుటలేదు; విశేషంగా, మానవ హస్తముల జోక్యము లేకుండా “శరీరేచ్ఛలతో కూడిన స్వభావము” వారిలో నుండి తొలగింపబడినదని ఆయన ప్రకటించుచుండెను. కొలొస్సయులు బాప్తిస్మము పొందుట ద్వారా క్రీస్తునందు పాతిపెట్టబడి, క్రీస్తునందు లేపబడుట ద్వారా వారి వంతుకు వారు చేయవలసినది చేసినప్పుడు దేవుడు శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును వారిలో నుండి తొలగించుట ద్వారా ఆయన చేయవలసినది ఆయన చేసాడు. (“కొలొస్సయులకు 2:11-16లో బాప్తిస్మము, సున్నతికి సంపూర్తిగా సమానాంతరమైనదై యున్నదా?” అనే అంశాన్ని ఈ పాఠంలోని “అదనపు అధ్యయనము”లో చూడుము.)

నేడు యూదులు ఆచరించు సున్నతి నేడు అనావశ్యకమైనదై యుండినది, ఏలయనగా కొలొస్సయులు క్రీస్తునందు సంపూర్ణులుగా చేయబడి యుండిరి. దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చిన ధర్మశాస్త్రము వీరికి ఇంత కంటె ఎక్కువ ఏమియు ఇవ్వలేకపోయినది. యేసు, తన జీవితము మరియు బోధల ద్వారా, పౌలు తన పత్రికలో ఇదివరకే తెలియజెప్పినట్లుగా (1:14; 2:10ఎ), వారి సకల అవసరములను తీర్చాడు.

యూదీయ సున్నతి ప్రకారము ముందోలును కొంత కోసివేయుట ద్వారా భౌతికంగా

శరీరములోని కొంత మాంసము తీసివేయబడవలసి యుండినది, అలాగే క్రీస్తునందలి సున్నతిలో, అనగా బాప్తిస్మములో, పాప దోషము తొలగింపబడినది. “అది [ఆధ్యాత్మిక సున్నతి] బాప్తిస్మము ద్వారా అనుభవింపబడు, దేవుని పనియై యున్నదని పౌలు నొక్కివక్కాణించుచున్నాడు.”[3]

కొలొస్సయుల తొల్లిటి పరిస్థితులను మూడింటిని పేర్కొనుచు, వాటిని దేవుడు ఎలా సరిదిద్దాడో పౌలు నివేదించుచున్నాడు:

*పరిస్థితి 1* – కొలొస్సయులు వారి శరీరేచ్ఛలలో అధ్యాత్మికముగా సున్నతి చేయబడలేదు గనుక వారి శరీరేచ్ఛలనుబట్టి వారు మలినమైనవారై యుండిరి.

*దిద్దుబాటు* – బాప్తిస్మము ద్వారా వారు సున్నతి చేయబడిరి గనుక వారి శరీరేచ్ఛలు తొలగింపబడినవి.

*పరిస్థితి 2* – వారు ఆధ్యాత్మికముగా చచ్చినవారై యుండిరి.

*దిద్దుబాటు* – కార్యసిద్ధి కలుగజేయు దేవుని యుందలి విశ్వాసమునుబట్టి బాప్తిస్మము పొందినప్పుడు భౌతికముగా యేసు సమాధిలోను పునరుత్థానములోను పాల్గొనుట ద్వారా వారు యేసుతో కూడ ఒక నూతన ఆధ్యాత్మిక జీవితమునకు లేపబడిరి.

*పరిస్థితి 3* – వారు పాపములో చచ్చినవారై యుండిరి.

*దిద్దుబాటు* – బాప్తిస్మము పొందుట ద్వారా వారు సజీవులుగా చేయబడి వారి సమస్త అతిక్రమములలో నుండి క్షమింపబడిరి.

| కొలొస్సీ క్రైస్తవుల పరిస్థితులు (2:11–13) | | |
|---|---|---|
| **గతించిన పరిస్థితి 1** | **మార్పుకు కారణము 2** | **ఫలితము 3** |
| ఆధ్యాత్మికముగా శరీరములో (శరీరేచ్ఛలలో; వచనం 13 సున్నతి చేయబడలేదు). | శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి, క్రీస్తుతో కూడా బాప్తిస్మమందు పాతిపెట్టబడి, తిరిగి లేచిరి (వచనాలు 11, 12). | బాప్తిస్మము పొంది శరీరేచ్ఛలు తొలగింపబడినప్పుడు ఆధ్యాత్మికముగా సున్నతి చేయబడిరి (వచనం 11). |
| ఆధ్యాత్మికముగా చచ్చినవారై యుండిరి (వచనం 13). | బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ లేపబడిరి (వచనం 12). | కార్యసిద్ధికలుగజేయు దేవునియందలి విశ్వాసము ద్వారా క్రీస్తుతో కూడ సజీవులుగా చేయబడిరి (వచనాలు 12, 13). |
| అపరాధములలో చచ్చినవారై యుండిరి (వచనం 13). | బాప్తిస్మము పొందిరి (వచనం 11). | సమస్త అపరాధములు క్షమింపబడినవి (వచనం 13). |

**"క్రీస్తు సున్నతియందు శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి" (2:11బి)**

గ్రీకు నామవాచకము *apekdusis* (తొలగించుట అని అనువదింపబడినది) ఇచ్చట మాత్రమే కనిపించును. ఇదే పదము యొక్క క్రియా రూపము, పౌలు చేత మాత్రమే మరొక చోట వాడబడినది, "నిరాయుధులుగా చేయబడిన" (2:15) మరియు "పరిత్యజించి" (3:9, 10) అని అనువదింపబడినది. "ఈ రూపకాలంకారము ఆమోదింపబడని వస్త్రములు తీసివేయుట మరియు పూర్తిగా దిగంబరులను చేయుటకు చెందినదైనప్పటికిని, అది గత జీవితము నుండి సంపూర్తిగా తెగతెంపులు చేసికొనుటను సూచించుచున్నది."[4] క్రీస్తు సున్నతియందు ప్రజలను వాటి ఆధీనములో ఉంచుకొనుచు వారు పాపము చేయునట్లు ప్రేరేపించు "శరీరేచ్ఛలను" తొలగించుట, వాటిని పరిత్యజించుట యను ప్రక్రియ చేరియున్నది.

KJV మరియు NKJV అనువాదములలో, అటుతరువాత వచ్చిన ఏ అనువాదములోను లేదు, "శరీరేచ్ఛలతో కూడిన స్వభావము" అని వ్రాయబడియున్నది. "పాపముల యొక్క" అను పదజాలము పాతకాలంనాటి చేతివ్రాత ప్రతులలో లేదని NKJVకి సంబంధించిన కొన్ని ముద్రణలలోని సూచికలో తెలుపబడియున్నది.

శరీరము (*sōma*), దాని అక్షరార్థము ప్రకారము భౌతిక దేహమును సూచించుట లేదు, ఏలయనగా బాప్తిస్మమందు భౌతిక దేహము తీసివేయబడలేదు. ఈ క్రమము చొప్పున, "శరీరము" అనగా రోమీయులకు 6:6లోను ("పాపశరీరము") మరియు 7:24లో (రూపము దాల్చిన "మరణమునకు లోనగు శరీరము") అని చెప్పబడినట్లుగా "పదార్థము" అను అర్థము నిచ్చును. ఇదే అర్థము కొలొస్సయులకు 2:17లో కనబడును. పదార్థము, శరీరేచ్ఛల రూపము, సున్నతి చేయబడినదని పౌలు మనకు బోధించుచున్నాడు. అనగా, క్రీస్తుయందలి సున్నతి ద్వారా కొలొస్సయుల లౌకిక వాంఛలు తొలగింపబడినవని మరొక మాటలో చెప్పుకొనవచ్చును.

రక్తమాంసము (*sarx*) అను పదము క్రొత్త నిబంధనలో వెవ్వేరు విధములుగా వాడబడినది (" 'రక్తమాంసము' [*sarx*] అనగా 'పాపిష్ఠి స్వభావము' అని అర్థమా?" ఆంశాన్ని ఈ పాఠంలోని "అదనపు అధ్యయనము"లో చూడుము). ఈ పదమును ఆంగ్లములోనికి అనువదించుటకు అప్పుడప్పుడు కష్టముగా నుండును. *Sarx* అను పదమునకు, అనేక అనువాదములలో ఉన్నట్లుగానే,[5] "రక్తమాంసము" అను పదమును వాడుట, ఈ వాక్యభాగము మరియు ఇతర వాక్యభాగములలోను "పాపిష్ఠి స్వభావము" (NIV) అని వ్యాఖ్యానించుట కంటె తక్కువగా అపార్థమునిచ్చును (NIVలో "శరీరము"/"రక్తమాంసము" NIV చార్టును ఈ పాఠం ఆఖరిలో చూడుము). సందర్భమును దృష్టిలో ఉంచుకొనుచు, దీని అర్థమును పాఠకులు నిర్ధారించుకొనవచ్చును. దీనికి ఈ క్రింది అర్థములుండవచ్చును ...

1. శరీరము, దేహములోని మాంసము (లూకా 24:39; 1 కొరింథీయులకు 15:39).
2. ఒక ప్రాణి యొక్క దేహము (అపొస్తలుల కార్యములు 2:31), దీనిలో శారీరక బలహీనతలు కలిసియున్నవి (మత్తయి 26:41).
3. మొత్తం మానవాళి, మానవులు (మత్తయి 16:17; లూకా 3:6; యోహాను 17:2; అపొస్తలుల కార్యములు 2:17).

4. మానవ సంతతి (రోమీయులకు 1:3; 11:13, 14; అపొస్తలుల కార్యములు 2:30; గలతీయులకు 4:23).
5. మానవ దేహమునకు పరిమితమైనది, జీవితము (రోమీయులకు 8:3, 4).
6. లౌకిక ప్రమాణముల ఆధారంగా గల నియమములు (1 కొరింథీయులకు 1:26).
7. మానవత్వమునకు సంబంధించిన శరీరేచ్ఛలు (రోమీయులకు 7:5).

ప్రాచీన స్వభావం, ఒకడు క్రీస్తునందు నూతన సృష్టిగా (2 కొరింథీయులకు 5:17) చేయబడక మునుపు అతనిలో ఉండిన శరిరేచ్ఛలకు (రోమీయులకు 6:6; కొలొస్సయులకు 3:9బి) సమానమైనదని ఎంచవచ్చును. గతంలో, వారి దుర్మార్గపు క్రియలనుబట్టి (కొలొస్సయులకు 1:21). వారి మనస్సుల్లో కొలొస్సయులు దేవునికి శత్రువులై యుండిరి. ఎఫెసీయులకు వలెనే, కఠినమై యుండిన వారి హృదయములనుబట్టి (ఎఫెసీయులకు 4:18 చూడుము) వారు అజ్ఞానులై యుండిరి. వారి అంతఃకరణము యొక్క అవస్థకు ఫలితం, వారి దుర్మార్గము; వారు స్వభావ సిద్ధంగా చెడ్డవారు కాదు లేక ఒక పాపిష్ఠి స్వభావము చేత వారి ఇష్టమునకు వ్యతిరేకముగా నియంత్రింపబడుచుండినవారు కాదు.

క్రీస్తుయందలి సున్నతి "పాపిష్ఠి స్వభావమును" తొలగించినట్లయితే, ఈ బాప్తిస్మము పొందుకొన్నవారిలో పాపిష్ఠి స్వభావము యికను ఉండదు గనుక వారు యికను పాపము చేయరు. ఆదాము మరియు హవ్వలు నిషేధింపబడిన ఫలమును భుజించిన తరువాత వారి స్వభావము పాపిష్ఠి స్వభావముగా మారియున్నట్లయితే, ఆ స్వభావము యొక్క తొలగింపు ప్రజల్లో ఆదాము మరియు హవ్వ ఆ పండును తినకముందు కలిగియుండిన అదే అమాయకత్వమును పునరుద్ధరించును. అప్పుడు వారు దిగంబరత్వమంటే ఏమిటో ఎరుగరు, వారికి సిగ్గు అనగానేమిటో తెలియదు. ("మనలో పాపిష్ఠి స్వభావమున్నదా?" అనే అంశాన్ని ఈ పాఠంలోని "అదనపు అధ్యయనము"లో చూడుము.)

*11-15 వచనాల్లో శారీరక మరియు ఆధ్యాత్మికము మధ్య ఉపయోగింపబడిన రెండవ పోలిక, యేసు క్రీస్తు సిలువవేయబడిన తరువాత నూతన జీవితమునకును ఒక క్రైస్తవుడు బాప్తిస్మము పొందిన తరువాత నూతన జీవితముకును సంబంధించినదై యున్నది.* యేసు మరణించిన తరువాత, ఆయన సమాధి చేయబడి అటుతరువాత నిర్ణీత కాలములో నూతన భౌతిక దేహముతో మరలా లేపబడినాడు. అలాగే, పాపములలో చచ్చిపోయిన ఒకరు, బాప్తిస్మము ద్వారా నీటిలో పాతిపెట్టబడి ఒక నూతన ఆధ్యాత్మిక జీవమునకు తిరిగి లేపబడుదురు.

బాప్తిస్మమును, సున్నతి వలెనే అది ఏదో ఒక సామాన్య శారీరక సంస్కారవిధియని సున్నతితో సమానంగా ఎంచకూడదు. ధర్మశాస్త్రము ప్రకారము సున్నతి చేయబడినవారు, వారికి సున్నతి చేయబడినప్పుడు వారు అంతరంగములో ప్రతిస్పందించాల్సిన అవసరం లేకుండినది. వారిని పవిత్రులను చేయు మరొకరి రక్తములో విశ్వాసముంచవలెనంటూ ఒక ఆజ్ఞ లేదు, వారి జీవితములో మార్పు రావలసిన అవసరం కూడా లేదు. నిస్సందేహంగా, ఇదే విధమైన విలువలేని సంస్కార నియమమును ఒక నిర్బంధముగా పౌలు కొలొస్సయులకు

నియమించలేదు. "బాప్తిస్మము విశ్వాస సంబంధమైన పవిత్ర సంస్కారమై యున్నది, గనుక అది ఎన్నడును, సూత్రప్రాయంగానైతేనేమి అభిప్రాయరీత్యానైతేనేమి, **సంబంధిత అసలు విషయము** నిజముగా లేనప్పుడు 'దాని పని ఏదో చేయబడిందిలే' అని **దాని అసలు విషయము** ... నుండి సంబంధ రాహిత్యం చేయబడకూడదు."[6]

కార్యసిద్ధి కలుగజేయు దేవుని యందలి విశ్వాసమునుబట్టి, బాప్తిస్మము ద్వారా క్రీస్తునందు ప్రవేశించినవారై, కొలొస్సయులు ఆధ్యాత్మికముగా సున్నతి చేయబడిరి గనుక వారు ఆధ్యాత్మికముగా సజీవులుగా చేయబడియుండిరి. "నీవు 'క్రీస్తు లోనికి' ప్రవేశించినప్పుడు, *సున్నతి చేయబడిరి* అని చెప్పుకొనుట ఉత్తమము. వారు దైవికమైన ఆ వాస్తవమును అదివరకే కలిగియుండిరి" అని చెప్పుచూ, వారు ఆధ్యాత్మికముగా ఎప్పుడు సున్నతి చేయబడినవారయ్యారో ఎచ్. సి. జి. మౌలే, సరిగ్గా గమనించాడు.[7]

మరొక చోట, క్రీస్తుయందలి సున్నతి గత పాపములను కొలొస్సయుల శరీర రక్తమాంసముల నుండి తొలగించినదని పౌలు ప్రస్తావించుచున్నాడు. బాప్తిస్మము ద్వారా పాపములు తీసివేయబడినప్పటికిని, బాప్తిస్మము పొందినవారు పాపిష్ఠి అలవాట్లను అభ్యాసములను మానివేయవలసినదే (కొలొస్సయులకు 3:8, 9; 2 కొరింథీయులకు 7:1).

వారు బాప్తిస్మము పొందుచుండినప్పుడు, దేవుడు చేయుచుండిన కార్యములో, ఆయన వారిని సజీవులనుగా చేయుచు వారి అతిక్రమములను తొలగించుట ద్వారా వారికి ఆధ్యాత్మిక సున్నతి చేయుచున్నాడను వాస్తవములో, కొలొస్సయులు విశ్వాసముంచుచుండిరి.

ఆయన ఆశించుచుండిన ఫలితమును వారిలో కలుగజేయుటకు దేవుడు వారిలో చేయుచుండిన కార్యమునందు సహోదరులు విశ్వసించనట్లయితే వారి విశ్వాసమునకు విలువలేకుండాపోయేదే. ఈ ఫలితములలో ఆధ్యాత్మిక సున్నతి ద్వారా శరీరేచ్ఛల తొలగింపు, యేసుతో కూడ నుండు నూతన జీవములోనికి పునరుత్థానము, మరియు పాపక్షమాపణ కూడా ఉండినవి.

యూదీయ సున్నతి వారి భౌతిక శరీరములోని ఒక అత్యల్ప భాగమును మాత్రమే తొలగించినది, కానీ క్రీస్తుయందలి సున్నతి ద్వారా పాపిష్ఠి స్వయం మొత్తానికే తొలగింపబడుతుంది. దాని ఫలితము కేవలము ఒక శారీరక చర్య ద్వారా కలుగజేయబడలేదు; విశేషంగా, దానికి హృదయాంతరాళములో నుండి ఒక భౌతిక చర్యకు లోబడుచుండు ఆధ్యాత్మిక సాంగత్యము అవసరమై యున్నది (రోమీయులకు 6:17, 18). అది హృదయములో సంభవించు సున్నతియైయున్నది (రోమీయులకు 2:28, 29). ఒకడు నూతన సృష్టియగునట్లు వాడు శరీరేచ్ఛలు, ప్రాచీన స్వభావము నుండి విడిపింపబడినప్పుడు వానికి క్రీస్తుయందలి సున్నతి చేయబడును (రోమీయులకు 6:6). ఆధ్యాత్మిక సున్నతి చేసేది దేవుడే (కొలొస్సయులకు 2:12).

మనము మన హృదయమునకు సున్నతి చేసికొనవలెననే దేవుడు ఎల్లప్పుడు కోరుచున్నాడు. మోషే ద్వారా, వారు తమ హృదయములకు సున్నతి చేసికొనవలెనని దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు తెలియజెప్పాడు (ద్వితియోపదేశకాండము 10:16). ఇశ్రాయేలు ప్రజలకు యిర్మీయా చేసిన వినతి కూడ యిదే (యిర్మీయా 4:4; 9:25, 26). హృదయమునకు సున్నతి చేయబడనివారిని దేవుడు అంగీకరించడని యెహెజ్కేలు ప్రవక్త పలికాడు (యెహెజ్కేలు 44:7, 9).

ఆధ్యాత్మిక సున్నతి గూర్చి పౌలు తన చర్చను కొనసాగించుచు, తత్ఫలితంగా కలుగు నూతన జీవము, క్షమాపణ, మరియు క్రైస్తవ స్వాతంత్ర్యముతో పాటు, అనేక ఆశీర్వాదములను పేర్కొన్నాడు.

## క్రీస్తునందలి జీవితము మరియు క్షమాపణ (2:12, 13-15)

**[12]మీరు బాప్తిస్మమందు ఆయనతోకూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవునిప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి. [13-15]మరియు అపరాధముల వలనను, శరీరమందు సున్నతిపొందక యుండుటవలనను, మీరు మృతులై యుండగా, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దానిమీది చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను. ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను.**

మనము బాప్తిస్మమందు క్రీస్తుతో కూడ పాతిపెట్టబడినప్పుడు ఆధ్యాత్మికముగా సున్నతి చేయబడుదుము (కొలొస్సయులకు 2:11-13). బాప్తిస్మములో గల ఆధ్యాత్మిక వాస్తవములతో, రచయిత రెండు భౌతిక చర్యలను – సున్నతి మరియు నీటిలో ముంచబడుట – పోల్చుచున్నాడు. బాప్తిస్మములో ఒకరు యేసుతో పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములో పంచుకొనుట ద్వారా వాడు సజీవుడు గావింపబడును. బాప్తిస్మములో, పాపములో చచ్చియుండినవాడు వాని పాపములు క్షమింపబడినవాడై ఆధ్యాత్మికముగా సజీవుడు చేయబడుచున్నాడని పౌలు వివరించాడు. ఈ మార్పులు కలుగు సమయమే బాప్తిస్మమని ప్రత్యేకముగా తెలియజెప్పబడినది. ఆర్. సి. లూకాస్ ఇలా వ్రాయుచున్నాడు, "క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందుట అనగా ఆయన మరణము మరియు పునరుత్థానము వలని ప్రయోజనములలో పాలు పంచుకొనుట యని అర్థము."[8]

పౌలు నానావిధ ఆధ్యాత్మిక నైజములను శారీరకంగా ముంచబడుట యను చర్యతో ముడిపెట్టాడు. ప్రభువు భోజనము గూర్చి కూడ పౌలు ఇదే విధమైన దృక్పథమును కనుపర్చుచున్నాడు. రొట్టె మరియు ద్రాక్షరసమును సూచించుటకు ఉపయోగింపబడు భౌతిక పదార్థములు క్రైస్తవుడు యేసు శరీరము మరియు రక్తముతో ఆధ్యాత్మికముగా కలిగియున్న సత్సంబంధముతో ముడిపడియున్నవి (1 కొరింథీయులకు 10:16). బాప్తిస్మము న్యాయసమ్మతముగా క్రమబద్ధమైనదై యుండుటకు, దానిలో యేసు పాతిపెట్టబడుట మరియు పునరుత్థానముతో సంబంధము కలిగియుండవలసిన ఆధ్యాత్మిక నైజములు కలిసియుండవలెను, తద్వారా ప్రాచీన స్వభావముపాతిపెట్టబడి నూతన స్వభావము పునరుత్థానమగును. హే ఇలా చెప్పుచున్నాడు,

> బాప్తిస్మములో కొలొస్సయులు మరియు ఇతర విశ్వాసులు పూర్తిగా తీసివేయు చర్యను, అనగా అక్షరాలా పాత బట్టలు తీసివేసి అలంకారికంగా "శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును" (2:11), వారి "ప్రాచీన పురుషుని" (3:9) విడిచిపెట్టుట యను సన్నివేశమును పునఃఅభినయిస్తారు.

ప్రాచీన స్వభావమును విసర్జించుట ద్వారా వారిని అదివరకు నియంత్రించుచుండిన లేక పాపిష్ఠి అలవాట్లు, పాపిష్ఠి అభ్యాసములలోనికి వారిక శోధించుచుండిన శరీరము, ఆధ్యాత్మిక ప్రధానులు మరియు అధికారుల నుండి వారు స్వతంత్రులగుచున్నారు.[9]

బాప్తిస్మములో యేసుతో కూడ కేవలము పాతిపెట్టబడి పునరుత్థానమగుట వలన మంత్రముగ్ధ ప్రభావముగల సంస్కరణ ఏదైనను సంభవింపదు. దాని ఫలితంగా కలుగు నూతన జీవము హృదయపూర్వకమైన విధేయత వలన వచ్చును (రోమీయులకు 6:4, 17, 18). బాప్తిస్మము పొందినవాడు యేసుతో కూడ పాతిపెట్టబడి, తిరిగి లేచుట ద్వారా ఆయనతో గుర్తించుకొనును. శరీరము నీటిలో పాతిపెట్టబడుట మరియు శరీరము నీటిలో నుండి లేచుటలో శరీరమేగాక హృదయము సహితము కలిసియుండవలెను. "కానీ సమూలమైన ఈ పరివర్తనము ఏ మానవ శక్తి లేక సూక్తి వలన కలిగినది కాదు. దానికి మృతులలో నుండి క్రీస్తును లేపుట ద్వారా ఆయన అధికారమును మరియు శక్తిని ప్రకటించిన దేవుని యందలి విశ్వాసము ద్వారా కార్యసిద్ధి కలిగినది."[10]

**"బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారు" (2:12ఎ)**

ఆయనతో కూడ పాతిపెట్టబడి అని అనువదింపబడిన పదము (*suntaphentes*) నిర్ణీతంకాని (కాలము) నిశ్చేష్ట అసమాపక క్రియా పదమై యున్నది, మరియు ఇదే వచనంలో తరువాత వ్రాయబడియున్న ముఖ్య క్రియకు, "లేపబడుటకు" మునుపే చర్య పూర్తిచేయబడినదని అర్థమిచ్చుచున్నది. అది మరొక చోట రోమీయులకు 6:4లో మాత్రమే అగుపించును. *Sun* ("తో") మరియు *thaptō* ("పాతిపెట్టుట") అను పదములను కలుపుచు, ఇదొక మిశ్రమ క్రియయై యున్నది. *Sun* అను విభక్తి ప్రత్యయముతో మొదలయ్యే మిశ్రమ క్రియలను పౌలు తరుచుగా ఉపయోగించాడు. 12 మరియు 13 వచనములలో ఇటువంటివి మూడు పదములు ఉపయోగింపబడినవి.[11] బాప్తిస్మములో కొలొస్సయులు తోటి–పాతిపెట్టబడిరి, కలిపి పాతిపెట్టబడిరి, "ఆయనతో"; తోటి–లేపబడిరి, కలిపి లేపబడిరి, "ఆయనతో"; గనుక, తత్ఫలితంగా, తోటి–చేయబడిరి "సజీవులు"గా, కలిపి సజీవులుగా చేయబడిరి, "ఆయనతో."

మరొకడు తన శరీరమును నీటిలో పాతిపెట్టి అటుతరువాత దానిని లేపుటకు ఒకడు ఆ మరొకనిని అనుమతించుటనుబట్టి బాప్తిస్మము ఇయ్యబడవలెను. ఈ విధముగా, బాప్తిస్మము తీసికొనువాడు యేసుతో కూడ ఆయన పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములో పాలు పంచుకొనును. యేసు మానవుల చేత సిలువవేయబడి, పాతిపెట్టబడి, ఆ తరువాత దేవుని చేత లేపబడినట్లుగానే (వచనం 12), బాప్తిస్మము పొందుకొనువారు తమ్మునుతాము ఇతరుల చర్యలకు వశముచేసికొందురు. యేసు సిలువను చేసికొనలేదు, తనను తానే మేకులతో సిలువకు కొట్టుకొనలేదు లేక తను తానే సిలువపైకి ఎత్తికొనలేదు. ఇదంతా కూడ మానవులను రక్షింపవలెనను ధృఢ సంకల్పముతో యేసు సహించినవాడై యున్నప్పటికిని, సిలువవేయబడుట ఆయన తనకు తానే చేసిన ఒక పని కాదు. అదేవిధంగా, బాప్తిస్మము పొందుకొనువాడు తనను తానే పాతిపెట్టుకొనడు, తనను తానే లేపుకొనడు. గనుక ఒకడు బాప్తిస్మము ద్వారా రక్షింపబడినప్పుడు వాడు ఏదైన ఒక కార్యము చేయడని చెప్పుకొనుట సముచితమైనదగును (మార్కు 16:16; 1 పేతురు 3:21). "మనము నీతిని అనుసరించి

చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను, మనలను రక్షించెను" (తీతు 3:5; ఎఫెసీయులకు 2:8, 9 చూడుము).

బాప్తిస్మము పొందుకొనువానిని మరొకని చేతులు నీటిలో పాతిపెట్టి వానిని నీటిలో నుండి బయటికి లేపినట్లుగానే, ఆధ్యాత్మిక సున్నతిని యేసు, చేతులు లేకుండా నిర్వహించును.

> ఈ ప్రకారము బాప్తిస్మమిచ్చుట ఒకరికి చేయబడిన ఒక విషయమై/పనియై యున్నది. నోవాహు మందసమును కట్టుచుండగా, దేవుడు దానిని నీళ్ల (జలప్రళయము) గుండా క్షేమంగా తీసికొనివచ్చాడు; మోషే మరియు యెహోషువా ఇశ్రాయేలు ప్రజలను నీళ్ల గుండా నడిపించారు. క్రైస్తవ బాప్తిస్మము "మిమ్మును కడుగుగొనుడి, శుద్ధిచేసికొనుడి" అని యెషయా చెప్పినట్లు కాదు, యూదుల శుద్ధీకరణాచారకాండ వంటిది కాదు, కుమ్రాన్ ప్రోక్షణములు కాదు, లేక అన్యమతావలంభికులకు ఇయ్యబడిన యూదీయ బాప్తిస్మము కాదు ఏలయనగా, యోహాను బాప్తిస్మమిచ్చిన నాటి నుండి (యేసు సహితము యోహాను చేత బాప్తిస్మము పొందాడు), అది ఎల్లప్పుడు, ఎల్లచోట్ల, మరియు ఎల్లరికి, ఎవరికో చేయబడిన ఏదో ఒకటై యున్నది.[12]

బాప్తిస్మము పొందుకొనువాడు, మరొకడు వానిని నీటిలో ముంచి మరలా విజయవంతముగా బయటికి తెచ్చునట్లు వాని మీద ఆధారపడుచు, తనను తాను ఆ మరొకనికి అప్పగించుకొనును. ఏదిఏమైనా, వాడు పాపక్షమాపణ మరియు రక్షణ పొందుకొనునను విశ్వాసము, వానికి బాప్తిస్మమిచ్చువానిలో ఉంచబడదు. విశేషంగా, వాని విశ్వాసము, "ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు" ఉండును (వచనం 12).

ఈ వచనము నీటిలో ముంచుట యను భావమును తెలియజేయాల్సిన అవసరంలేదని కొందరు తర్కించుచుందురు. విల్యమ్ హెండ్రిక్సన్ తన ఆక్షేపణను ఇలా వ్యక్తము చేయుచున్నాడు:

> బాప్తిస్మము ఇయ్యబడు పద్ధతికి సంబంధించినంత వరకు ఏమియు చెప్పనట్లయితే ఈ చర్చ పూర్తి కాదు, ఎందుచేతనంటే ప్రత్యేకముగా ఇటువంటి వాక్యభాగముల ఆధారంగానే "ముంచడము బాప్తిస్మము" మాత్రమే న్యాయసమ్మతముగా క్రమబద్ధమైన బాప్తిస్మమని నీటిలో ముంచుచు బాప్తిస్మమిచ్చువారు స్వాధికారస్వరంతో చెప్పుచుందురు. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై" అను మాటల్లో వారు నీటిలో ముంచుట గూర్చిన ఆమోదముద్రను చూచుచున్నారు; "ఆయనతో కూడ లేచితిరి" అను మాటల్లో బయటికి వచ్చుట గూర్చిన గట్టి ఆధారమును చూచుచున్నారు. ఏదిఏమైనా, క్రీస్తునందు మన సహోదరుల యెడల సంపూర్ణమైన ప్రేమ మరియు గౌరవముతో నేను ఈ క్రింది విధముగా తెలియజెప్పుటకు సాహసించుచున్నాను – బాప్తిస్మము విషయములో లేఖనములు ఇతర అభివ్యక్తములను కూడ ఉపయోగించుచున్నవి, మరియు ఇటువంటి హేతువాదములనుబట్టి, అవి కూడా బాప్తిస్మము గూర్చిన సరైన పద్ధతిని ప్రస్తావించుచున్నవని పరిగణించవలసి వచ్చుచున్నది. *క్రీస్తుతో కూడ పాతిపెట్టబడినవారై* (కొలొస్సయులకు 2:11, 12; రోమీయులకు 6:4) అను మాటలు *ముంచడము ద్వారానే బాప్తిస్మమియ్యబడవలెను* అని సూచించుచున్నట్లయితే, *క్రీస్తుతో కూడ సిలువవేయబడినవారై* (రోమీయులకు 6:6) అను మాటలు, సిలువవేయబడుట ద్వారా బాప్తిస్మము ఇయ్యబడవలెననియు, *ఆయనతో నాటబడినవారమై* (రోమీయులకు 6:6) అను మాటలు, సిలువవేయబడుట ద్వారా బాప్తిస్మము ఇయ్యబడవలెనినయు, *ఆయనతో నాటబడినవారమై* (రోమీయులకు 6:5 – ఆథరైజ్డ్ వర్షన్

మరియు మూల గ్రంథము) అను మాటలు, నాటబడుట ద్వారా బాప్తిస్మమియ్యవలెననియు, *క్రీస్తును ధరించుకొని యున్నారు* అను మాటలు (గలతీయులకు 3:27) సందర్భయుక్తమైన దుస్తులు ధరించుట అని ఎందుకు సూచించకూడదు?[13]

హెండ్రిక్సన్ గారి తర్కము బలహీనపర్చమైనది ఏలయనగా *baptizō* అను గ్రీకు పదము (ఆంగ్లములో *baptize*) యొక్క మూలార్థము "నీటిలో ముంచుట"యై యున్నది. యేసు పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములో బాప్తిస్మము ద్వారా పాలుపంచుకొనుట గూర్చి పౌలు పంచుకొనుచున్న రూపకాలంకారము, బాప్తిస్మము నీటిలో ముంచుట ద్వారానే యను నిదర్శనమునకు మరింత బలమును చేకూర్చుచున్నది.

అనేక మంది అధికారులు, మతపరమైన అధికారులు/నాయకులు కానివారు సహితము, ఈ పదమునకు ఇదే సరైన అర్థమని వారి ఆమోదమును తెలుపుచున్నారు. ఆంగ్ల *baptize* అను పదమునకు "గ్రీకులో *baptein*, అనగా నీట ముంచుట" అని అర్థమని *The American Heritage Dictionary* (మాటల) ఉత్పత్తి చరిత్ర శాస్త్రమును ఆధారం చేసికొని తెలియజెప్పుచున్నది.[14] మతపరమైనది కానిది మరియు ఏ ఒక్క పక్షమును సమర్థించనిదైన, మరొక మూలాధారము బాప్తిస్మమునకు ఈ క్రింది నిర్వచనమును ఇచ్చుచున్నది: "ఫ్రెంచి గ్రీకు బాప్తిస్మ (*baptisma*), అను పదమునకు 'నీటిలో ముంచుట' అని అర్థము ... . ఈ అర్థమును అభివృద్ధి చేసికొనుటకు బాప్తిస్మము (మౌలికంగా) ముంచుటయై యుండినదని మనస్సులో ఉంచకొనవలెను."[15] ఇతర మూలాధారములు ఇలా చెప్పుచున్నవి,

> *Baptize* అను పదముకు గ్రీకు క్రియాపదము *baptizein* అయియున్నది. ఈ క్రియాపదము "నీటిలో ముంచు" మరియు "తరుచుగా లేక తీవ్రముగా నీటిలో ముంచు, నీటిలో మునుగుము/నీటిలో ముంచుము" అని అర్థమిచ్చు *baptein* నుండి ఉత్పన్నమయ్యింది.[16]

> బాప్తిస్మములిచ్చుటకు ప్రాచీన దేవాలయములలో ఉపయోగింపబడిన కట్టడములు లేక ఆలయములోని భాగములు చూపించుచున్నట్లుగా, ప్రాచీన కాలములోని సాధారణమైన పద్ధతి, నీటిలో ముంచుటయై యుండినది.[17]

> ... బాప్తిస్మము యొక్క ప్రతిరూపమును, అనగా 'చిలుకరింపు'/'నీటి ప్రోక్షణము' ద్వారా నిర్వహింపబడుచున్న మన ప్రస్తుత బాప్తిస్మ పద్ధతులలో కనుమరుగౌచున్న సమాంతరత్వమును, గుర్తుచేసికొనునట్లు "చచ్చినవారై" అని చెప్పుటకు బదులుగా, అపొస్తలుడు "పాతిపెట్టబడినవారై" అను పదజాలమును పరిచయము చేయుచున్నాడు.[18]

> "పాతి పెట్టబడుట" అనునది ఒకడు నీటిలోనికి ముంచబడుచుండగా జరిగినది, మరియు దానితోపాటుగానే అతడు/ఆమె నీటిలో నుండి బయటికి/పైకి తేబడినప్పుడు "పునరుత్థానము" కూడా జరిగినది.[19]

బాప్తిస్మములో వ్యక్తి మొత్తంగా కలిసియుండును, అనగా వాని శరీరము మరియు ఆత్మ కలిసియుండును. ఈ రెండింటిలో ఏ ఒక్కటైనను నిలవరింపబడకూడదు. ప్రాచీన స్వభావమును విసర్జించి నూతన జీవములోనికి ప్రవేశించుట వలన కలుగు విశ్వాసము ద్వారా, అతడు వాని ఆత్మను సంపూర్ణముగా యేసుకు సమర్పించుకొనవలెను. ఈ విధంగా బాప్తిస్మము పొందువాడు మృతులలో నుండి ఆధ్యాత్మికముగా సజీవుడుగా చేయబడును. శరీరం మొత్తం కూడ, నీటిలో ము(ఉ)ంచబడుట ద్వారా, బాప్తిస్మములో చేరియుండును.

అయితే నొసలు/తలపై/దేహముపై నీటిని చిలుకరించుట చేత వాని శరీరమంతా యేసు యొక్క పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములో పాలుపంచుకొనుచున్నదను అభిప్రాయమును నెరవేర్చదు. ఈ ముంచడము ప్రక్రియ ద్వారా బాప్తిస్మము పొందుకొనువాడు సంపూర్ణముగా క్రీస్తుకు సమర్పించుకొనినవాడగును.

పాపక్షమాపణ, రక్షణ, మరియు నూతన జీవము నిమిత్తమైన బాప్తిస్మము యొక్క అవసరము నుండి తప్పించుకొనునట్లు నానావిధమైన తర్కములు చేయబడుచున్నవి. ఈ వాదనలు బాప్తిస్మము యొక్క అవసరతను ప్రబోధించు లేఖనములను వ్యతిరేకించుచున్నవి (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38; 22:16; 1 పేతురు 3:21). వారెన్ డబ్ల్యు. వియర్స్‌బి ఇలా చెప్పుచున్నాడు,

> ... క్రొత్త నిబంధనలో, *baptize* అను పదమునకు అక్షరార్థము మరియు అలంకారార్థము కూడ ఉన్నది. అక్షరార్థము, "(నీటిలో) ముంచుట, సంపూర్తిగా నీటిలో ముంచుట." అలంకారార్థము, "(ఒకరి/ఒకదాని) '... తో గుర్తించుకొనుట.' ఉదా॥ యూదీయ జనాంగము ఎఱ్ఱ సముద్రము గుండా నడిచివెళ్లినప్పుడు "మోషేనుబట్టి ... బాప్తిస్మము పొందిరి" (1 కొరింథీయులకు 10:1, 2). ఈ బాప్తిస్మములో నీళ్ల ప్రమేయము లేదు, ఏలయనగా వారు ఆరిన నేల మీద నడిచివెళ్లారు. ఈ అనుభవములో, ఇశ్రాయేలు జనాంగము మోషేతో గుర్తింపబడినది.[20]

ఇశ్రాయేలు ప్రజలు బాప్తిస్మము పొందిన మూలపదార్థము మోషే కాదనునది ఈ ప్రకటనలో గల సమస్య యని స్పష్టమగుచున్నది. సముద్రము గుండా నడిచివెళ్లినప్పుడు వారు బాప్తిస్మము పొందారు, సముద్రములోను మేఘధూమములోను ముంచెత్తబడినారు (యెషయా 4:5). వారు ఆరిన నేలను అవతలి ఒడ్డు వరకు దాటుట, నీటిలోనికి మునిగిపోలేదని నిశ్చయముగా సూచించుచున్న విషయము, వారు బాప్తిస్మము పొందుచుండిరనుటకు, చుట్టుముట్టబడియుండిరనుటకు, లేక మేఘధూమములోను సముద్రములోను మునిగిపోయారనుటకు వ్యతిరేకమైన తార్కికహేతువు కాదు. సముద్రము వారికి యిరువైపులను గోడవలె నుండెను; వారు సముద్రములోను మేఘధూమములోను ముంచెత్తబడిరి – బాప్తిస్మముపొందిరి.

"దానిలో బహుశా అన్యమత ప్రవేశము ('మీరు సున్నతి పొందితిరి,' నిర్ణీతం [కాలం] కాని కాలమును దెలుపుచున్న క్రియాపదము), పరిశుద్ధాత్మ చేత హృదయమునకు చేయబడు సున్నతి గూర్చిన ప్రస్తావన ఉండవచ్చును ..."[21] అని చెప్పుచు, నీటిలో ముంచుట ద్వారా ఇవ్వబడు బాప్తిస్మము క్రీస్తు యందలి సున్నతి యని బోధించుటకు వచనం 11 ఉపయోగింపబడకూడదని ఇతరులు ఆక్షేపించుచున్నారు. అలాగైతే 12వ వచనంలో ప్రస్తావింపబడిన బాప్తిస్మము పరిశుద్ధాత్మ బాప్తిస్మమనునది తుది అభిప్రాయమై యున్నది ఏలయనగా ఆయనయందు "చేతులతో చేయబడని సున్నతి"ని పౌలు పేర్కొనుచున్నాడు (వచనం 11).

కొలొస్సీ సంఘము సమస్త జనముల కొరకు ఉద్దేశింపబడిన (మత్తయి 28:19; మార్కు 16:15, 16) బాప్తిస్మము పొందుకొన్నది, అది పరిమితమై యుండిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము, అనగా అపొస్తలులకు వాగ్దానము చేయబడి వారి చేత పొందుకొనబడిన బాప్తిస్మము (అపొస్తలుల కార్యములు 1:2–5; 2:4), అటుతరువాత కొర్నేలీ చేత పొందుకొనబడినది

(అపొస్తలుల కార్యములు 11:15, 16) కాదు. యేసు యొక్క ఆధ్యాత్మిక సున్నతి హస్తముల ప్రమేయము లేకుండా చేయబడినదను వాస్తవము, వారి పాపములు మానవ హస్తముల చేత కాదు కానీ దేవుని శక్తివంతమైన కార్యము చేతనే తీసివేయబడినవని సూచించుచున్నది. ఇది జరిగిన సందర్భము – బాప్తిస్మము. ఆల్‌బ్రెక్ ఓయప్‌కే దీని గూర్చిన సరైన వివరమును ఇలా చెప్పుచున్నాడు,

> బాప్తిస్మము గూర్చి క్రొత్త నిబంధనలో గల ప్రస్తావనలు, వాటి సందర్భము వేరు విధమైన అర్థమును తెలియజేస్తే తప్ప, అవి సామాన్యంగా నీటిలో ముంచుట ద్వారా ఇయ్యబడు బాప్తిస్మమును సూచించుచున్నవని భావించవలెను. బాప్తిస్మమునకు సాంకేతికపరమైన అర్థము, "నీటిలో బాప్తిస్మమిచ్చుట." అందువలన దాని మాధ్యమమును నిర్దిష్టముగా పేర్కొనుట అనావశ్యకమై యున్నది.[22]

సందర్భములోని ఏదియు కూడ పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఉద్దేశింపబడినదని నొక్కి చెప్పుటలేదు, గనుక పౌలు మనస్సులో నీటి బాప్తిస్మము గూర్చిన ఆలోచన ఉండినదని భావింపవలెను.

### "ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" (2:12బి)

బాప్తిస్మములో కొలొస్సీ సహోదరులు యేసుతో పాతిపెట్టబడి తిరిగి ఆయనతో లేచిరి. "ఆయనతో లేచిరి" అని అనువదింపబడిన పదము (*suēgerthēte*), ఒక నిర్ణీతతంకాని (కాలము) నిశ్చేష్ట సూచన, పూర్తిచేయబడిన కార్యమును సూచించుచున్నది. ఇదే పదము 3:1 మరియు ఎఫెసీయులకు 2:6లోను కనబడును. వారు బాప్తిస్మము ద్వారా యేసు యొక్క పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములోను పాలుపంచుకొన్నారు గనుక, ఈ సహోదరులు ఆయన ద్వారా నూతన జీవమును కూడ పంచుకొన్నారు మరియు పొందుకొన్నారు.

వారి విశ్వాసమునుబట్టి (*pistis*) ఇది సాధ్యమయ్యింది. కొలొస్సీ పత్రికలో "విశ్వాసము" అను పదమును పౌలు ఉపయోగించుట ఇదే చివరిసారి. (ఈ పదము 1:4, 23; 2:5–7లో కూడ కనబడును.) ఇచ్చట విశ్వాసమునకు సంబంధించి పేర్కొనబడిన అనేక ప్రశ్నలను చర్చించవలసిన అవసరమున్నది.

(1) దేవుని ప్రభావమందలి విశ్వాసము అను పదజాలములో, *pistis* అను పదము "విశ్వాసము"నకు బదులుగా దేవుని ప్రభావమందలి "విశ్వసనీయత" అని అనువదింపబడవలెనా? *Pistis* అను పదము "విశ్వసనీయత" అని దాదాపుగా ఎన్నడూ అనువదింపబడలేదు. KJVలో అది "విశ్వాసము" అని 239 సార్లు మరియు, "హామీ," "విశ్వాసపాత్రము," మరియు "నమ్మకము" అని ఒక్కొక్కసారి అనువదింపబడినది – కానీ ఎన్నడును "విశ్వాసనీయత" అని అనువదింపబడలేదు. NASBలో "విశ్వాసము" అని 238 సార్లు, "ఋజువు" ఒక్కసారి, మరియు "విశ్వసనీయత" మూడుసార్లు – మత్తయి 23:23; రోమీయులకు 3:3; గలతీయులకు 5:22 – అనువదింపబడినది. మత్తయి 23:23 మరియు గలతీయులకు 5:22లో "విశ్వాసము"నకు బదులుగా "విశ్వసనీయ" అని అనువదించుట ఉత్తమమని ఎందుకు ఎంచబడుచున్నది? ఈ వాక్యభాగములలో పేర్కొనబడిన "విశ్వాసము" 2 పేతురు 1:5లో వలెనే ఒక క్రైస్తవ సద్గుణము కాదా?

ఇప్పుడు రోమీయులకు 3:3 చూద్దాము: "కొందరు అవిశ్వాసులైన నేమి? వారు

అవిశ్వాసులైనందున, దేవుడు నమ్మతగినవాడు కాకపోవునా?" ఈ వచనములో గ్రీకు పదము, "విశ్వసనీయత" అని సమర్థనీయముగా అనువదింపబడినది; ఏదిఏమైనా, ఇచ్చట కూడ దాని అర్థము "విశ్వాసము" అని చెప్పుకొనవలసినది ఎంతో ఉన్నది. బార్క్లే ఎమ్. న్యూమాన్ మరియు యూజిన్ ఏ. నిడా ఇలా వ్రాయుచున్నారు, "ఈ ప్రశ్న యొక్క అర్థము, 'ఈ హేతువునుబట్టి దేవుని యొక్క విశ్వాసము నిష్ప్రయోజనమైనదని దీని అర్థమా?' అని భావించుట సాధ్యమే, కానీ పౌలు ప్రశ్నను ఆధునిక అనువాదములలో ఏదియును ఈ విధంగా భావించుటలేదు."[23] బహుశా, న్యూమాన్ మరియు నిడా 1973లో రచించినప్పుడు, రోమీయులకు 3:3 గూర్చి, "వారు నమ్మనంత మాత్రాన దేవుని యొక్క విశ్వాసము నిరర్థకమైనదౌతుందా?" (LB) అని వ్యాఖ్యానింపబడిన 1971 నాటి అనువాదమునకు వారు సుపరిచితులై యుండకపోవచ్చును.

రోమీయులకు 3:3లో "విశ్వసనీయత" అను అనువాదము ఉత్తమమైనది కాదు. "... యొక్క విశ్వాసము" వస్తుగత షష్ఠి విభక్తియై (సంబంధమును తెలుపునదై) యున్నది, గనుక అప్పుడది "... లో విశ్వాసము" అని అనువదింపబడవలెను. "ఈ హేతువునుబట్టి దేవుని యందలి విశ్వాసము నిరర్థకమైనదని దీని అర్థమా?" అను అనువాదమును మించి, వాక్యములోని ఏదియు అనువాదము భిన్నముగా చేయబడవలెనని కచ్చితంగా కోరుటలేదు. కొందరి అల్పవిశ్వాసము ఇతరులు దేవునియందుంచు విశ్వాసమును విలువలేనిదానిగా చేయదని పౌలు చెప్పుచున్నాడు.

సాధారణ నియమము ప్రకారము, సందర్భమునుబట్టి మినహాయింపవలసి యుంటే తప్ప, అనువాదములో ఒక మాట యొక్క మాములు అర్థము ఉన్నది ఉన్నట్టుగా ఉంచబడవలెను. *Pistis* అను పదము "విశ్వాసము" అని గాక మరి ఏవిధంగానైనను అనువదింపబడవలెనని ఏ వాక్యభాగమైనను కోరుటలేదు. *Pistis* "విశ్వసనీయత" అని అనువదింపబడవలెనని 2:12 సందర్భములో ఏదియును నొక్కివక్కాణించుట లేదు. కాబట్టి, "దేవుని ప్రభావమందలి విశ్వాసము" అనియే ఉంచవలెను. ఒక వేళ ఏ అనువాదములైనా ఉన్నట్లయితే, కొన్ని ప్రాచీన లేదా అధునాతన భాషారూపములు 12వ వచనంలో *pistis* అను పదమును "విశ్వాసనీయత"యని అనువదించుచున్నవి.

(2) యేసు పునరుత్థానము (ఒక దానిని పునరుక్తము చేయుచు లేక మరొక దానిని నిర్వచించుచు) "దేవుని ప్రభావము"ను యుక్తముగా విశదీకరించుచున్నదా? అలాగైతే విశ్వాసము, దేవుని శక్తివంతమైన ప్రభావములో ఉంచబడుటకు బదులుగా, యేసు పునరుత్థానములో ఉంచబడవలెనని దీని అర్థము. ఏ. ఎస్. పీక్ ఇలా చెప్పుచున్నాడు,

> ... మరొక చోట *pistis* తరువాత నున్న వస్తుగతమైన విషయము, నమ్మకముంచుచున్న వ్యక్తిని సూచిస్తే తప్ప, అది విశ్వాసము యొక్క వస్తువును అభివ్యక్తము చేయుచున్నది. హొఫ్‌మన్ యొక్క దృక్పథము *t. ener.* అను పదము సంబంధము తెలుపుచున్నదానికి ఒక అన్వయమై యున్నదనియు, "విశ్వాసము, అన్నప్పుడు అది దేవుని యందలి ప్రభావము," అని అర్థమిచ్చుచున్నదనియు గల దృక్పథము, ప్రస్తుత సందర్భములో బొత్తిగా ప్రసక్తిలోనే లేని విషయమై యున్నది. ఏలయనగా, విశ్వాసము మృతులలో నుండి క్రీస్తును లేపిన దేవుని ప్రభావము వైపు దృష్టిసారించును, రోమీయులకు 4:24తో పోల్చుము. క్రీస్తును మృతులలో నుండి లేపిన ఆయన ప్రభావము మన సొంత ఆధ్యాత్మిక అనుభవములో సహితము

కార్యసార్థకమైనదై యుండును, అందువలననే దేవుడు ఈ విధంగా వర్ణింపబడియున్నాడు. కాబట్టి మనము పొందుకొను బాప్తిస్మము దేనినీ సూచింపని ఒక శూన్య సంకేతము కాదు, కానీ క్రీస్తుతో కూడ నిజమైన ఆధ్యాత్మిక పాతిపెట్టబడుట మరియు లేపబడుటయై యున్నది.[24]

పీక్ అభిప్రాయము ప్రకారము, 12వ వచనం, "విశ్వాసము" మరియు "దేవుని ప్రభావము" ఒకటే అయియున్నవని నివేదించుట లేదు, దానికి బదులుగా, "విశ్వాసము దాని దృష్టిని క్రీస్తును మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావము దిశగా మళ్లించినదని" నివేదించుచున్నది. ఈ విశ్వాసము దేవుని ప్రభావమందు ఉంచబడి యున్నది "ఏలయనగా క్రీస్తును మృతులలో నుండి లేపిన ఆయన ప్రభావము మన సొంత ఆధ్యాత్మిక అనుభవములో సహితము కార్యసార్థకమగును."

(3) *Tēs pisteōs* అను పదజాలము, "... యొక్క విశ్వాసము" లేక "... లో విశ్వాసము" అని అనువదింపబడవలెనా? థాయెర్ 2:12ను వస్తుగత సంబంధమును తెలుపుచున్నదానికి, "gen[itive] of the object [... లో విశ్వాసము]నకు" ఒక ఉదాహరణంగా చేర్చాడు.[25]

పౌలు ప్రయోగించిన పదజాలమును ఎఫ్. విల్బర్ జింగ్‌రిచ్ మరియు ఫ్రెడెరిక్ డబ్ల్యు. డేంకర్, "*దేవుని యందలి విశ్వాసము, నమ్మకము, ధీమా*" అని అనువదించారు. ఆ తరువాత, ఈ పదముల ప్రయోగం కనిపించు వాక్యభాగములను (ఉదా॥ మార్కు 11:22) ఉదహరించి చెప్పుచు, కొలొస్సయులకు 2:12ను: *"... ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందలి విశ్వాసము" అని అనువదించారు.*[26] 2000 నాటి సవరింపులో, డేంకర్ ఇదే వచనమును అనన్యమైన రీతిలో అనువదించాడు.[27]

అధిక సంఖ్యాకులైన వ్యాఖ్యానకర్తలు *dia tēs pisteōs* అను పదజాలమును ఒక వస్తుగత సంబంధమును తెలుపు పదజాలముగా ఎంచుదురు.[28] ఈ విధంగా, ఈ పదజాలము, అందలి విశ్వాసము మూలముగా అనువదింపబడవలెను.

(4) వారు బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు చేయు కార్యములో ప్రజలు విశ్వాసముంచవలెనా? ఔను, ఉంచవలెను. దేవుని యందలి శక్తివంతమైన ప్రభావము – యేసును మృతులలో నుండి లేపిన అదే శక్తి – వానికి నూతన ఆధ్యాత్మిక జీవమునిచ్చునను విశ్వాసము బాప్తిస్మము పొందుకొనువాడు కలిగియుండవలెను. బాప్తిస్మములో, ఒకడు యేసు యొక్క పాతిపెట్టబడుట మరియు లేపబడుటలో పాలుపంచుకొనునప్పుడు వానికి నూతన జీవమియ్యబడును. బాప్తిస్మము పొందుకొనువాడు దేవుడు వానికి ఆధ్యాత్మికముగా సున్నతిచేసి వానిని ఆధ్యాత్మికముగా సజీవునిచేయు కార్యకలాపమునందు విశ్వాసము కలిగియున్నప్పుడు మాత్రమే ఈ కార్యము జరుగును. దేవుడు ఈ కార్యము చేయగలడను (ఆత్మ) విశ్వాసము యేసును మృతులలో నుండిన లేపిన ఆయన శక్తివంతమైన కార్యముపై ఆధారపడియున్నది. మార్విన్ విన్సెంట్ "దేవుడు చేయు కార్యమునకు సంబంధించిన విశ్వాసమును అనగా, 'దేవుడు చేయు విశ్వాసము కాదు,' కానీ క్రీస్తు పునరుత్థానములో ప్రదర్శింపబడినట్లుగా ... దేవుడు చేయు కార్యమునందున్న నీ విశ్వాసము"ను ప్రస్తావించాడు.[29]

బాప్తిస్మము పొందుకొనుచున్నవాడు NIVలో అనువదింపబడినట్లుగా, దేవుని "శక్తి"లో మాత్రమే విశ్వాసము కలిగియుండడు, కానీ దేవుని "ప్రభావము" (*energeia*)లో కూడ కలిగియుండును.[30] "శక్తి" అని పౌలు అర్థమైయుండినట్లయితే, ఆయన గ్రీకు పదము

*exousia*ను ("కార్యము చేయుటకు గల హక్కు లేక అధికారము"ను) లేక *dunamis* ను ("కార్యమును చేయుటకు శక్తి లేక సామర్థ్యము"ను) ఉపయోగించేవాడే. కానీ దానికి బదులుగా, ఆయన *energeia* అను పదమును, అనగా కార్యములో గల శక్తి అని అర్థము మరియు అత్యధిక సందర్భములలో "ప్రభావము" అని అనువదింపబడిన పదమును ఉపయోగించాడు. జే. ఐథేల్ జోన్స్ ఇలా చెప్పాడు, " 'దేవుని ప్రభావమందలి విశ్వాసము ద్వారా' (RV) ఈ కార్యమునకు ఆ అర్థము మరియు క్రమబద్ధము వర్తింపచేయబడవచ్చును."[31] విల్యమ్ బార్క్లే ఇలా చెప్పుచున్నాడు: "ఒకడు దేవుని యొక్క సార్థకమైన కార్యములో అనగా యేసు క్రీస్తును మృతులలో నుండి లేపిన కార్యమునందు విశ్వసించినప్పుడే మరియు అదే కార్యమును దేవుడు వానిలో కూడ చేయగలడని విశ్వసించినప్పుడే అది జరుగును."[32]

హెర్బర్ట్ ఎమ్. కార్సన్ ఇలా వ్యాఖ్యానించాడు:

> యేసు క్రీస్తు పునరుత్థానములో అదివరకే ప్రదర్శింపబడిన దేవుని శక్తివంతమైన ప్రభావము విశ్వాసి కలిగియున్న (ఆత్మ) విశ్వాసము యొక్క వస్తువై యున్నది. అలాగైతే తర్కము ఈ క్రింది విధముగా కొనసాగును: యేసుక్రీస్తు పునరుత్థానమును గూర్చిన వాస్తవమును వారు అంగీకరించారు. ఇది దేవుని శక్తి యొక్క సంకేత సంబంధమైన ప్రదర్శనమైన పునరుత్థానమును అనుభవించియున్నారు.[33]

ఇతర వ్యాఖ్యానకర్తలు ఈ విధంగా ఏకీభవించుచున్నారు:

> క్రిసొస్తం ఇలా వ్యాఖ్యానించుచున్నాడు: "మిమ్మును లేపుటకు దేవుడు సమర్థుడని మీరు విశ్వసించారు, గనుక మీరు రక్షింపబడితిరి" … అది కేవలము దేవుడు యేసుక్రీస్తును మృతులలో నుండి లేపాడను విశ్వాసమే కాదు, కానీ మానవ స్వభావమును దేవుడు ప్రభావితము చేయుచు, మృతులలో నుండి ఆయన యేసుక్రీస్తును లేపి, క్రీస్తును లేపిన దానికి ఫలితంగా దానిని ఒక నూతన జీవమునకు లేపుచున్నాడను నమ్మకమై యున్నది.[34]
>
> గనుక క్రీస్తు విమోచనము సాధించిన ఆధ్యాత్మిక సున్నతికి ప్రయోజనము సిద్ధింపజేయు క్రైస్తవ బాప్తిస్మమునకు, బాప్తిస్మము పొందుకొనినవారి నుండి వ్యక్తిగత కృతజ్ఞతా నివేదనము మరియు అంగీకారము అవసరమై యున్నవి. అనగా, సాంప్రదాయ ఆచారము మీద గాక, "పరిశుద్ధ సంస్కారము" ద్వారా కార్యము చేయు దేవుని మీదికే మళ్లించబడు విశ్వాసము యొక్క అగత్యము, విశ్వాసులు మరణించి తిరిగి లేచిన క్రీస్తు మరణము మరియు పునరుత్థానములోగల రక్షణను సార్థకము చేయు సామర్థ్యమును అనువర్తించుచు, పాపము జయింపబడిన ఆ దైవికమైన జీవము పరిధిలో వారిని ఉంచునని ఇది అర్థమిచ్చుచున్నది (రోమీయులకు 6:7, 9-11).[35]
>
> "మీరు బాప్తిస్మము పొందినప్పుడు, ఆయన శక్తిచేతనైనట్టు, దేవుడు మిమ్ములను మరలా జీవింపజేసాడు. క్రీస్తుతో కూడ అయియున్నట్టుగా, ఆయన మిమ్ములను లేపాడు. మీరు దేవుని శక్తియందుంచిన (ఆత్మ) విశ్వాసమునకు ఫలితంగా ఇది జరిగినది" అని 12వ వచనమును వ్యాఖ్యానించవచ్చును.[36]
>
> విశ్వాసము యొక్క విధ్యుక్త కర్తవ్యము మానవుని వైఖరితో నిమిత్తములేకుండా కేవలము దేవుడు ప్రభావము చూపు బాప్తిస్మము కొరకు అడుగుట, లేక దేవుడు బాప్తిస్మములో చేయు కార్యమును గ్రహించుట, లేక బాప్తిస్మము పొందిన తదుపరి సందర్భోచితమైన ప్రతిస్పందన ప్రదర్శింపవలెనను తాత్పర్యమును ఋజువుచేయుట యని వర్ణించుట తప్పు.[37]

దేవుడు ఇలా చిత్రీకరింపబడియున్నాడు: యేసుక్రీస్తును మృతులలో నుండి లేపినవాడు, ఏలయనగా త్రిపాది తర్కము ఇలా కొనసాగుచున్నది: దేవుడు మృతులలో నుండి క్రీస్తును లేపాడు, గనుక ఆయన నన్ను కూడ నూతన జీవముగలవానిగా చేయగలడు (ఎఫెసీయులకు 1:17-21 పోల్చిచూడుము). అది సరిగ్గా ఇటువంటి "దేవుడు చేయు కార్యములో" ఉంచబడు విశ్వాసము ద్వారా అనుభవింపనగును.[38]

బాప్తిస్మము పొందినవాని విశ్వాసము దానిని నిర్వహించువానిలో, వాడు ముంచబడు నీళ్లలో, ఈ చర్యలోనే, లేదా ఏకంగా యేసు పునరుత్థానములోనే లేదు. దేవుని ప్రభావము నూతన క్రైస్తవుని జీవితము విషయములో వాగ్దానము చేయబడిన మార్పులను సార్థకము చేయునను (ఆత్మ) విశ్వాసంతో, దేవునియందు విశ్వాసముంచబడవలెను. దేవుడు ఈ కార్యమును చేయగలడు మరియు ఆయన చేస్తాడు అను విశ్వాసము యేసును మృతులలో నుండి లేపుట యను చర్యలో ప్రదర్శింపబడినట్లు, ఆయన యొక్క కార్యశీలకమైన శక్తిపై ఆధారపడి యున్నది. ఒకడు దేవుని యందు ఇటువంటి విశ్వాసము కలిగియుంటే తప్ప, ఆయన కార్యము చేయునని వాడు అపేక్షింపకూడదు.

దేవుని శక్తివంతమైన ప్రభావములో గల విశ్వాసమునుబట్టి యేసుతో పాతిపెట్టబడి, మరలా లేపబడుట మూడు ఫలితములు కలుగజేయును: సున్నతి, నూతన జీవము, మరియు క్షమాపణ. బాప్తిస్మము సమయంలో, సున్నతిపొందనివారు ఆధ్యాత్మికముగా సున్నతిచేయబడుదురు, పాపములో చచ్చినవారు సజీవులుగా చేయబడుదురు, లేపబడుదురు అతిక్రమములు క్షమింపబడును. 12-15 వచనములలోని ప్రగతిశీలమైన పౌలు ఆలోచనలకు సంబంధించినంత వరకు ఎడుఅర్డ్ స్క్వీజర్ సరిగా గమనించిన వివరము ఇలా ఉన్నది, "వారు అదివరకే పొందిన పునరుత్థాన జీవము యొక్క అసలు అర్థమేమిటో ఈ క్రింది వాక్యం వివరించుచున్నది: పాపక్షమాపణను ఆధారం చేసికొని సున్నతి పునరుత్థాన జీవము యొక్క అసలు అర్థమేమిటో ఈ క్రింది వాక్యం వివరించుచున్నది: పాపక్షమాపణను ఆధారం చేసికొని సున్నతి లేకుండుట వలన కలుగు దోషము నుండి విడుదల చేయబడినారని అది సూచించుచున్నది."[39]

## "అపరాధముల వలనను, శరీరమందు సున్నతిపొందక యుండుటవలనను మీరు మృతులై యుంటిరి ..." (2:13ఎ)

కొలొస్సయులు క్షమింపబడక మునుపు, వారు పాపములో చచ్చినవారై యుండిరి. "... పాపమునకు మరల జీవము వచ్చెను, నేనైతే చనిపోతిని ... పాపము ఆజ్ఞను హేతువు చేసుకొని నన్ను మోసపుచ్చి దాని చేత నన్ను చంపెను" అని పౌలు రోమీయులకు తెలియజెప్పాడు (రోమీయులకు 7:9బి, 11). "పాపము పరిపక్వమై మరణమును కనును" అని యాకోబు రచించాడు (యాకోబు 1:15బి). కొలొస్సయులు పాపములో చచ్చినవారై యుండిరి, ఏలయనగా అందరు పాపము చేసి మరణించినట్లే, వారు కూడ పాపము చేసియుండిరి (రోమీయులకు 3:23). అయితే, బాప్తిస్మము సమయములో, వారికి నూతన జీవము మరియు పాపక్షమాపణ అనుగ్రహింపబడునట్లు వారు దేవుని ప్రభావమందు విశ్వాసముంచినప్పుడు వారి పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

సహజంగానే, పౌలు భౌతిక మరణమును ప్రస్తావించలేదు. **అపరాధముల వలన**

**మృతులు** అని చెప్పుటనుబట్టి పాపము వలన కలుగు ఫలితంగా వారు క్రీస్తునందలి ఆధ్యాత్మిక జీవము నుండి వేరుచేయబడిరని ఆయన భావించుచుండెను (ఎఫెసీయులకు 4:18) ఆధ్యాత్మిక జీవమునకు మూలాధారము యేసు గనుక (1 యోహాను 5:12), ఆయనలో లేనివారు ఆధ్యాత్మికముగా మరణించినవారే. క్రీస్తునందలి జీవము పొందునట్లు (1 యోహాను 5:11), విశ్వాసి క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను (రోమీయులకు 6:4; గలతీయులకు 3:27). ఒకడు బాప్తిస్మము పొందుకొనినప్పుడు నూతన జీవము లోనికి ప్రవేశించుట ద్వారా నిర్జీవము నుండి తప్పించుకొనునను సత్యమును పౌలు 12 మరియు 13 వచనములలో బహు స్పష్టముగా బోధించాడు.

13 వచనం *kai humas* ("మరియు మీరు") అను మాటలతో 12వ వచనమునకు పొడిగింపుగా కొనసాగుచున్నది. చర్చింపబడుచున్న అంశము కొనసాగింపబడినప్పుడు మరొక పేరాగ్రాపు మొదలుపెట్టవలసిన అవసరంలేదు. NIV మరియు TNIV అనువాదములు 12వ వచనంతో వాక్యమును ముగించుచు పేరాగ్రాపును సమాప్తము చేయుచున్నందువలన, 12 వచనమును 13 వచనము నుండి వేరుచేయుచున్న రీతి సమర్థింపబడుటకు సమంజసమైనదిగా లేదు. ఇది భాషానువాద నిర్ణయమై యున్నది; ఇది ఈ వాక్యభాగములలో గల గ్రీకు వాక్య నిర్మాణముపై ఆధారపడి చేయబడిన అనువాదము కాదు. గ్రీకు గ్రంథపాఠములో, 12వ వచనం యొక్క ముగింపు వాక్యవిరామ చిహ్నము, గీతకు పైన ఉంచబడిన ఒక బిందువుతో చేయబడినది. "న్యూన బిందువు, గీతకు పైన పెట్టబడిన చుక్క ... ఆంగ్ల న్యూనబిందువు మరియు అర్థబిందువు స్థానాన్ని తీసికొనుచున్నది."[40]

మరొక పేరాగ్రాపుతో వచనములను వేరుచేయుట వలన, 12వ వచనంలోని పౌలు ఆలోచన 13వ వచనముతో కలిగియున్న సంబంధము తెంచివేయబడుచున్నది, తత్ఫలితంగా రెండు వాక్యములకు మధ్య గల సంబంధమును తెలియజేయుట లేదు. ఇతర అనువాదములు మరొక పేరాగ్రాపును మొదలుపెట్టుటతో ఈ వచనములను వేరుచేయుట లేదు (NASB; KJV; NKJV; ASV; NRSV చూడుము). "... దేవుడు ఆయనను మృతులలో నుండి లేపెను. మీరు సహితము పాపములో చచ్చినవారై యుంటిరి ..." అని అనువదించుట ద్వారా NAB అనువాదము ఈ రెండు వచనములకు మధ్య ఒక బలమైన సంబంధమును ఏర్పరచుచున్నది. NASB అనువాదము దాదాపుగా ఇట్లే నొక్కివక్కాణించుచున్నది: "... దేవుడు, ఆయనను మృతులలో నుండి లేపెను. మీరు మీ అపరాధములలో చచ్చినవారై యుంటిరి ... ."

"అతిక్రమములు" (*paraptō mata*) అను పదము యొక్క నానావిధ రూపములను యేసు ప్రభువు (మత్తయి 6:14, 15) మరియు పౌలు (రోమీయులకు 4:25) ఉపయోగించారు.[41] ఇదే పదము ఈ వాక్యభాగములలో, "అపరాధములు" (కొన్ని భాషారూపములలో, "పాపములు" లేక "నేరములు") అని అనువదింపబడి యున్నది. క్రొత్త నిబంధనకు వెలుపల, "ఒకడు వాని కాలు జారిపోవునట్లు తప్పటడుగు వేయుచున్న మనఃకల్పనలో" ఈ పదము ఉపయోగింపబడినది.[42] పౌలు "అతిక్రమములు" అను పదమును తరుచుగా బహువచనంలో ఉపయోగించాడు.

పౌలు 13వ వచనమును మీరు అను సర్వనామముతో మొదలుపెట్టి, "మన అపరాధములన్నిటిని క్షమించి" అని వ్రాస్తూ ముగించాడు. ఇవ్విధ పదజాలము ఉపయోగింపబడుట అనేక ప్రాచీన గ్రీకు చేతివ్రాత ప్రతుల చేత ధ్రువీకరింపబడినది. (KJV

మరియు NKJV అనువాదములలో "మీ సమస్త ఉల్లంఘనలు క్షమించాడు" అని వ్రాయబడి యున్నది.) "మన" అని ప్రథమ పురుష, బహువచన పదము వ్రాయుట ద్వారా, బాప్తిస్మములో ఆయన యేసు పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములో పాలుపంచుకొనినప్పుడు తన అతిక్రమములు క్షమింపబడినవని తనను సహితము రచయిత ఇతరులతో కలుపుకొనుచున్నాడు. పౌలు చేయవలసినదేమిటో (అపొస్తలుల కార్యములు 9:6) ఆయనకు తెలియజేప్పుటకు. యేసు పౌలు యొద్దకు అననీయను పంపించాడు; గనుక అననీయ, "నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి, బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" అని చెప్పాడు (అపొస్తలుల కార్యముల 22:16). ఇదే విధముగా పౌలు మరియు కొలొస్సయులు నూతన జీవము పొందుకొన్నారు మరియు వారి పాపములు క్షమింపబడినవి.

కొలొస్సయులు బాప్తిస్మము పొందినప్పుడు, అనగా ఆధ్యాత్మికముగా సున్నతి చేయబడినప్పుడు, ఆధ్యాత్మికముగా సజీవులు చేయబడినప్పుడు, వారి సమస్త అతిక్రమములు క్షమింపబడినప్పుడు, వారు యేసునందు సంపూర్ణులు గావింపబడిరి (2:10) వారు బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు ఈ కార్యమును చేయుచుండెనను వారి విశ్వాసము, దేవుడు యేసును మృతులలో నుండి లేపుటలో ప్రదర్శింపబడిన శక్తివంతముపై ఆధారపడి యుండినది. దేవుడు మృతిచెందిన యేసు దేహమునకు నూతన జీవము నివ్వగలిగినట్లయితే, ఆయన వారిని ఆధ్యాత్మిక మరణములో నుండి తప్పించి వారిని నూతన జీవములోనికి తీసికొనివెళ్లగలడను విశ్వాసము వారికుండినది. వారు బాప్తిస్మము ద్వారా ఆయన పాతిపెట్టబడుట మరియు పునరుత్థానములో పాలుపంచుకొనినప్పుడు జరిగినది ఇదే.

యూదీయ యుగములో, సున్నతిచేయబడని యూదులు మరియు అన్యజనులు దేవుని నుండి వేరుచేయబడినవారుగాను నిరీక్షణలేనివారుగాను పరిగణింపబడిరి (ఎఫెసీయులకు 2:11, 12). యూదులు వారిని దేవుని ప్రజలుగా అంగీకరించలేదు. క్రైస్తవ యుగములో, ఆధ్యాత్మికముగా సున్నతి చేయబడనివారు దేవుని ప్రజలు కాదు. ఆధ్యాత్మిక సున్నతి బాప్తిస్మము ద్వారా చేయబడును. గనుక ఒకని ఆధ్యాత్మిక పరిస్థితి మార్పుచెందు సమయము బాప్తిస్మమే. విశ్వాసము మరియు బాప్తిస్మము ద్వారా, ఒకడు దేవుని బిడ్డయగును (గలతీయులకు 3:26, 27).

### "మన అపరాధములన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపజేసెను" (2:13బి)

బాప్తిస్మము యొక్క న్యాయసమ్మతమైన క్రమబద్ధత దానిని పొందువాని విశ్వాసముపై ఆధారపడియున్నదని కొలొస్సయుల గూర్చి పౌలు చేయుచున్న ప్రకటన తెలియజేప్పుచున్నది. యేసును మృతులలో నుండి లేపుటలో ప్రదర్శింపబడిన దేవుని శక్తివంతమైన ప్రభావము వానికి కూడ నూతన జీవమునివ్వగలదనియు, వాని పాపములు క్షమింపబడుననియు వాడు నమ్మవలెను. యేసును లేపుట ద్వారా చేసిన, మరియు బాప్తిస్మము పొందువానికి ఆయన చేయగల కార్యములో విశ్వాసము లేకుండా, బాప్తిస్మమను భౌతిక చర్య శూన్యమైనదై, నిరర్థకమైన ఆచారకర్మ యగును. దేవుడు చేయుచున్న కార్యములో విశ్వాసముంచగలుగునట్లు, వాడు బాప్తిస్మము పొందినప్పుడు దేవుడు చేయు కార్యమును అర్థం చేసికొనవలెను. అలాగైతే

ఈ ప్రక్రియలో దేవుడు ఏంచేస్తాడు? **మన అపరాధములన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపజేసెను** అని అపొస్తలుడు విశదంగా వివరించాడు. శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును వానిలో నుండి తొలగించి, క్రీస్తుతో కూడ వానిని ఆధ్యాత్మికముగా సజీవుని చేసి, వాని పాపములు క్షమించుట ద్వారా దేవుడు బాప్తిస్మము పొందినవాని హృదయమునకే సున్నతి చేయును.

11–15 వరకు గల వచనములను గమనించినట్లయితే, కొలొస్సయుల జీవితములలో కలిగిన కొన్ని ముఖ్యమైన మార్పులు కనిపించును. ("పుటలోని 2:11–13లోని కొలొస్సీ క్రైస్తవుల పరిస్థితులు" చార్టు చూడుము.) దేవునియందలి ప్రభావము వలన యేసుక్రీస్తును మృతులలో నుండి లేపిన ఆయన శక్తి వారి శరీరేచ్ఛల స్వభావమును సహితము తొలగించి, వారిని సజీవులను చేసి, వారి పాపముల క్షమించగలదని కొలొస్సయులు కలిగియుండిన విశ్వాసమునుబట్టి ఈ మార్పులు కలిగినవి.

"ఆయనతో కూడ మిమ్మును జీవింపజేసెను" (*sunezōopoiēsen*) అను పదము "మరొకరితో కూడ సజీవులను చేయుట" అని అర్థమిచ్చు పదములో నుండి వచ్చినది.[43] ఈ పదము క్రొత్త నిబంధనలో వాడబడిన ఇతరమైన ఒకే సందర్భము ఎఫెసీయులకు 2:5లో నున్నది. ఈ ప్రత్యేక పదరూపమును ఉపయోగించుట ద్వారా పౌలు, సంపూర్తి చేయబడిన ఒక గత సంఘటనను ప్రస్తావించుచుండెను. పీటర్ టి. ఓ'బ్రయెన్ ఇలా వ్రాయుచున్నాడు,

> కొలొస్సయులు అదివరకే క్రీస్తుతో కూడ పునరుత్థానులయ్యారు: ఇదొక నిర్ణీతంకాని కాలము, *synēgerthēte* ("మీరు లేపబడితిరి") చేత వర్ణింపబడినది. అలాగని, కొలొస్సయుల మరణానంతర చరిత్ర సంపూర్ణంగా నెరవేరినదని ఇది ఆలోచన ఇచ్చుట లేదు ... ; అది మృతుల పునరుత్థానముగా గాక, ప్రస్తుతము క్రీస్తుతో కూడ దేవునియందు దాచబడియున్న ఆ జీవితము యొక్క ప్రత్యక్షతను (కొలొస్సయులకు 3:3, 4) దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తుకు సంబంధించిన అంశము పేర్కొనబడినది.[44]

12 మొదలు 13 వరకు గల వచనములలో, పౌలు *sun*తో ("... తో కూడా/కలిపి" అని అర్థమిచ్చు పదముతో) మొదలగుచున్న మూడు మిశ్రమ క్రియలను ఉపయోగించాడు. బాప్తిస్మములో కొలొస్సయులు "ఆయనతో కూడ" పాతిపెట్టబడి మరలా లేపబడిరి. ఇప్పుడు *sun* అనునది ఒక పూర్వప్రత్యయముగా ఉపయోగింపబడుచున్న మూడవ పదమును చూద్దాము. అది మొదటి రెండింటి నుండి వచ్చు లబ్ధియై యున్నది: వారు "ఆయనతో కూడ జీవింపజేయబడిరి." వారు బాప్తిస్మములో యేసుతో కూడ పాతిపెట్టబడుట మరియు పునరుత్థానులగుటలో భౌతికంగా పాలుపంచుకొన్నందునుబట్టి, – ఆధ్యాత్మిక దృక్పథంలో – నూతన జీవములో ఆయనతో కూడ పాలుపంచుకొన్నారు. వారు ఒకప్పుడు ఆధ్యాత్మికమూగా సున్నతిచేయబడినవారు కాదు, పాపములో చచ్చినవారై యుండిరి, మరియు దేవుని నుండి వేరుచేయబడినవారై యుండిరి; అయితే బాప్తిస్మము పొందిన తరువాత, వారి పాపములు క్షమింపబడుట ద్వారా వారు ఆధ్యాత్మికముగా సున్నతిచేయబడినవారయ్యారు. గనుక అదివరకు పాపము వలన దేవుని వేరుచేయబడి యుండిన పరిస్థితి ఇప్పుడు అంతమయ్యింది. "బైబిలు సంబంధమైన దృక్పథంలో, క్షమాపణ ప్రాథమికంగా మానవుని పాపము వలన తెగిపోయి, ఆయనకును మానవునికిని మధ్య నున్న సంబంధమును దేవుడు పునరుద్ధరించుట

గూర్చిన విషయమై యున్నది."[45]

ఇచ్చట పునరుత్థానము పేర్కొనబడినందంటే, అది భవిష్యత్ పునరుత్థానము యొక్క నిరీక్షణకు సంబంధించినది కాదు, కానీ అది కొలొస్సయులు బాప్తిస్మము ద్వారా యేసు పునరుత్థానములో పాలుపంచుకొనుటనుబట్టి పొందిన అనుభవము గూర్చిన ఒక ప్రస్తావనయై యున్నది. క్రీస్తుతో కూడ జీవింపజేయబడినవారగుటకై, వారు ఆయనతో కూడ పాతిపెట్టబడి లేపబడవలసిన అవసరముండినది. తద్వారా వారు ఆయనతో కూడ నూతన జీవములో పాలుపంచుకొనగలరు. యేసు మరణములో పాలుపంచుకొనుట ద్వారా పాపము యెడల ఆధ్యాత్మిక మరణమును మొదట అనుభవించకుండా, ఏ ఒక్కరైనను నూతన ఆధ్యాత్మిక జీవము లోనికి ప్రవేశింపలేరు (రోమీయులకు 6:3, 4). నూతన జీవము లోనికి ప్రవేశించునట్లు, బాప్తిస్మము పొందినవాడు, అంతరంగములో సంస్కరింపబడినవాడై (రోమీయులకు 6:4, 17, 18) హృదయపూర్వకంగా లోబడుట ద్వారా సహకరించవలసిన అవసరం కూడ ఉన్నది. ఒకడు బాప్తిస్మములో క్రీస్తుతో కూడ లేపబడినప్పుడు, నూతన జీవము ఒక వర్తమానకాల వాస్తవమౌతుంది.

బాప్తిస్మము మరియు పాపక్షమాపణకు గల సంబంధమును పౌలు 13 మొదలుకొని 15 వరకు గల వచనములలో స్పష్టముగా జోడించుచుండగా, కొందరు ఈ రెండింటిని వేరుచేయుటకు ప్రయత్నించారు. ఈ ప్రయాసములు సమర్థింపబడదగినవి కావు, ఏలయనగా బాప్తిస్మము మరియు పాపక్షమాపణ ఒక దాని నుండి మరొకటి వేరుచేయబడలేనివై యున్నవి. ఇట్టి సంబంధము ముఖ్యముగా, బాప్తిస్మము మీ పాపముల క్షమాపణ నిమిత్తము [*eis*] అని చెప్పబడిన అపొస్తలుల కార్యములు 2:38లో కనిపించును. అపొస్తలుల కార్యములు 2:38లోని, "... అందును బట్టి"/"ఎందుచేతననగా" అని అర్థమిచ్చుచున్నదని కొందరు తర్కించుచున్నారు. ఏది ఏమైనా, "*eis*" - ఇచ్చట, మరియు మార్కు 1:4లోను, లూకా 3:3-6లోను - సంకల్పమును సూచించుచున్నదని లేక్కలేనన్ని వ్యాకరణములు మరియు పదకోశములు ధృవీకరించుచున్నవి. ఫ్రెడెరిక్ విల్యమ్ డేంకర్ చేత గ్రంథస్థంచేయబడి ఇటీవల ప్రచురింపబడినదియు అత్యధికంగా ఆదరింపబడినదియునైన వాల్టర్ బాఎర్ పదకోశములోని సవరింపు, ... "ప్రభావశాలియైన/భావాలకు అందని/అనుగుణ్యముగా అను కోణములు, ... లోనికి, లోపలికి, కి/కు/తో ... పాపములు క్షమింపబడునట్లు మత్తయి 26:28; మార్కు 1:4; లూకా 3:3-6; పోల్చిచూడుము, కలిసియున్న లక్ష్యములకు గుర్తువేయునదని వర్ణించుచున్నది."[46]

నిర్వచనము ప్రకారము, గ్రీకు పదము *eis* బాప్తిస్మమునకు క్షమాపణతో సంబంధము కలుపుచున్న సందర్భములలో, "*eis* నట్లు," "ఇవ్వబడిన ఉద్దేశము ప్రకారము," లేక "పొందుటకు" అని అర్థమిచ్చుచున్నది. కాబట్టి వారి పాపములు క్షమింపబడునట్లు ప్రజలకు బాప్తిస్మము ఇయ్యబడవలెననునది ఒక స్పష్టమైన తుది అభిప్రాయమై యున్నది. రక్షణ పొందునట్లు బాప్తిస్మము అగత్యమైయున్నదని ఇతర వాక్యభాగములు ప్రబోధించుచున్నవి (మార్కు 16:16; 1 పేతురు 3:21). యేసు, ప్రజలను వారి పాపముల నుండి రక్షించునని దూత ప్రకటించాడు. "రక్షణ"కు మరియు క్షమాపణకు సంబంధమున్నదని ఇది సూచించుచున్నది. బాప్తిస్మము పొందుట ద్వారా రక్షింపబడినవారి పాపములు క్షమింపబడినవి. ఒకడు బాప్తిస్మము పొందినప్పుడు వాని సమస్త అతిక్రమములు క్షమింపబడినవను భావము,

పాపక్షమాపణ నొందునట్లు బాప్తిస్మము ఆవశ్యకమై యున్నదని చూపించు క్రొత్త నిబంధనలోని ఇతర వాక్యభాగములకు అనుగుణ్యముగా నున్నది.

కొలొస్సయుల తప్పటడుగులు **అన్నియును క్షమింపబడినవి**. యేసు అనుగ్రహించు పాపక్షమాపణ పాక్షికమైనది కాదు, అది వారు చేసిన ప్రతి చెడు కార్యమును కలుపుకొని, సంపూర్ణమైనదై యుండినది. ఆయనకు విధేయులైనవారి విషయంలో (హెబ్రీయులకు 5:9) యేసు రక్తము సమస్త పాపములను క్షమించును (1 యోహాను 1:7). పెంతెకొస్తు దినాన పేతురు యూదులకు అవకాశమిచ్చిన విషయము ఇదే (అపొస్తలుల కార్యములు 2:38), మరియు పౌలు, క్రైస్తవులను తీవ్రముగా హింసించుచు వారిని హతమార్చుచుండినవానికి, దమస్కు మార్గములో అనుగ్రహింపబడినది కూడా ఇదే (అపొస్తలుల కార్యములు 22:16). కొలొస్సయుల గత పాపములన్నియు క్షమింపబడినవి అని చెప్పినప్పుడు, వారు నీతిమంతమైన జీవితముతో ఎటువంటి నిమిత్తమైనను లేకుండా గతములో పొందిన పాపక్షమాపణ పైనే ఆధారపడవచ్చునని అర్థంకాదు. బాప్తిస్మము పొందిన తదుపరి చేసిన ఏ పాపము నిమిత్తమైనను క్రైస్తవులు క్షమాపణ కొరకు దేవుని నిరంతరము వేడుకొనుచుండవలెను.

నూతన జీవములో ప్రవేశించినందుకు ఫలితంగా ఒకడు క్రీస్తు కొరకు పరిశుద్ధ జీవితము జీవించుచుండవలెను. వారు దేవుని మహా కృపనుబట్టి ఎలాగైనా క్షమించబడుదురను ధైర్యంతో క్రైస్తవులు పాపములో కొనసాగుచుండకూడదు (రోమీయులకు 6:1-6). పాపములోనే కొనసాగుచుండువారు కృపగల పరిశుద్ధాత్మను (బహుశా "ఆత్మను") అవమానపర్చుచుందురు. క్రైస్తవులకు అపరిమితముగా అందజేయబడుచుండు కృప పాపమును ప్రోత్సాహించుటకు ఉద్దేశింపబడినది కాదు; అది పాపము చేయకుండా జీవించవలెనని ప్రయాసపడువారి కొరకే (1 యోహాను 2:1, 2). నేలకు ఎంతో ఎత్తులో బిగుతుగా నున్న త్రాడుపై నడుచుచు ప్రదర్శనలిచ్చుచుండువాడు వానికి క్రింది భాగంలో ఒక భద్రతా వల ఏర్పాటుచేయబడవలెనని ఎన్నుకొనవచ్చును. వల ఏర్పాటు వాడు క్రిందపడుటకు కాదు, వాడు క్రిందపడవలెనని ఆశించడు కూడ, కానీ ఒక వేళ వాడు తప్పజారి క్రింద పడినట్లయితే, వానిని సురక్షితముగా పట్టుకొనుటకు అందుబాటులో ఉండునని ఆ ఏర్పాటు చేయబడును. అదే విధముగా, పాపరహితముగా జీవించుటకు ప్రయాసపడు క్రైస్తవులమైన మనకు దేవుడు తన మహా కృపను ఒక భద్రతా వలగా సమకూర్చుచున్నాడు, అట్లయినను మనము పాపము చేయుచుందుము.

## ధర్మశాస్త్ర సంబంధమైన ఆజ్ఞ నుండి క్రీస్తునందు గల స్వతంత్రము (2:14)

**14 వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీది చేవ్రాతను తుడిచివేసి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసెను.**

**"వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు**
**విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి,**
**దాని మీది చేవ్రాతను తుడిచివేసెను" (2:14ఎ)**

కొట్టివేయబడినదేమిటో, "మనకు అడ్డములేకుండ ఎత్తివేయబడినది" ఏమిటో మనము గ్రహించగలుగునట్లు, మనము వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను

మనకు విరోధముగాను నుండిన పత్రము అనగా ఏమిటో రూఢిగా తెలిసికొనవలెను. "ఋణ పత్రము" అని అర్థమిచ్చు గ్రీకు పదము *cheirographon* "చేతితో లిఖింపబడిన ఒక దస్తావేజు/ పత్రము, (ప్రత్యేకించి) ఋణపడియున్నామను ఒక ధృవపత్రము, జమాఖర్చుల వర్ణన, ఋణముల వివరణ" అని నిర్వచింపబడినది.[47] "ఆజ్ఞలు" అను పదము "పాటింపబడవలసిన నియమనిబంధనలు లేక కట్టుబాట్లకు సంబంధించిన పద్ధతి ప్రకారమైన ప్రకటన ... పద్ధతి ప్రకారంగా రూపొందింపబడిన నియమనిబంధనలు ... అధికార శాసనము, నిర్ణయము, ఆజ్ఞ" అని అర్థమిచ్చు *dogma* నుండి వచ్చుచున్నది.[48]

"ఋణ పత్రము," అను పదము "అధికార శాసనములను" సూచించుచున్నదని అనేక వ్యాఖ్యానములు మరియు అనువాదములు ఏకీభవించుచున్నవి. ఇదే సరైనదైనట్లయితే, "ఋణ పత్రము" అనునది చేతివ్రాత రూపంలో అగుపించు అధికార శాసనములను లేక ఆజ్ఞలను సూచించును. ఈ సందర్భములో, "ఋణపడియున్నామని అధికార శాసనములు గల ధ్రువపత్రము" అను NASB అనువాదము కచ్చితమైనదై యున్నది.

వ్యాఖ్యానకర్తలు ఈ పదజాలమును వెవ్వేరు రీతులలో వ్యాఖ్యానించుచున్నారు. ఇతర దృష్టికోణముల ప్రకారము, ఐదు ముఖ్యమైన అనువాదములున్నవి: (1) కొలొస్సయులకు విరోధముగా ఉండిన పాప ఋణములు నమోదు చేయబడిన ఒక దస్తావేజును పౌలు ప్రస్తావించుచుండెను. (2) ఒక వాగ్దాన పత్రము, పేర్కొనబడిన ఒప్పందంలోని నిబంధనలు పాటించుటకు చేవ్రాలు చేయబడిన ఒక వాగ్దానము గూర్చి ఆయన ప్రస్తావించుచుండెను. (3) "కొలొస్సయులు ఋణగ్రస్తులైయున్నారని చేవ్రాలు చేయబడి వారికి విరోధముగా ఒక శాశ్వత సాక్షిగా నిలిచి యుండిన ఒప్పుకోలు" గూర్చి ఆయన పరోక్షంగా ఉల్లేఖించి చెప్పుచుండెను.[49] (4) దేవుని చేత సీనాయి పర్వతము యొద్ద ఇశ్రాయేలుకివ్వబడి, సిలువకు కొట్టివేయబడుట ద్వారా అంతమైన – లేక, అలంకార యుక్తముగా, చచ్చిపోయిన – ధర్మశాస్త్రము ఆయన మనస్సులో ఉండినది. (5) ఆయన రెండు వెవ్వేరు భావములను చర్చించుచుండెను.

నాలుగవ అనువాదమునకు సంబంధించినంత మేరకు, హెండ్రిక్సన్ ఇలా వ్రాయుచున్నాడు, "ఈ చేతివ్రాత లేక చేతితో వ్రాయబడిన దస్తావేజు స్పష్టముగా ధర్మశాస్త్రమై యున్నది (ఎఫెసీయులకు 2:15 పోల్చి చూడుము)."[50] ఆయన యింకా ఇలా వివరించుచున్నాడు, "సిలువకు కొట్టివేయబడుట ద్వారా రద్దుచేయబడి, 'ఋణస్తులమైయున్నామని దానిపై మన చేవ్రాలు చేయబడిన ఒక ధృవపత్రము కాదు,' కానీ అది 'అపేక్షింపబడిన అంశాలతో ఆజ్ఞలు కలిగియున్న ధర్మశాస్త్రమై' యున్నది."[51]

కార్సన్ తుది అభిప్రాయము కూడా ఇదే: "ఈ విధంగా నిర్దిష్టమైన ఆజ్ఞలు కలిగియున్న దేవుని ధర్మశాస్త్రము మనము ఆయనకు ఋణపడియున్నామని దేవుని ఘోషణగా నిలబడుచున్నది ... . దేవుని ధర్మశాస్త్రము మన దోషములను బయటపెట్టడము మాత్రమే కాదు, కానీ ఇటువంటి అపరాధిత్వమునకు తగిన దండన గూర్చి బిగ్గరగా కేక కూడ వేసినది. గనుక ఆ ఒప్పంద పత్రమే మన శత్రువై యుండినది."[52]

ఈ క్రింది వచనాలు, అనగా 15 మొదలుకొని 17 వచనముల వరకు, పౌలు ధర్మశాస్త్రము గూర్చి చెప్పుచుండెనని సూచించుచున్నవి. "కాబట్టి" (oun) అని 16వ వచనము ప్రారంభంలో వ్రాయబడియున్న పదము, 13 మొదలుకొని 15 వరకు

వ్రాయబడియున్న విషయములను సూచించుచు, 13-15 వచనములలోని "ఆజ్ఞలు" అను మాటకు పౌలు అర్థమేమిటో వివరించుచున్నవి. "ఆజ్ఞలు" సిలువకు కొట్టివేయబడుట ద్వారా తుడిచివేయబడినవి. పరిపాలకులను మరియు అధికారులను యేసు నిరాయుధులనుజేసాడు. ఈ వాస్తవము ఆధారంగా, చేతివ్రాత మూలకంగా నున్న అధికార శాసనముల ద్వారా జారీ చేయబడిన నిషేధాజ్ఞల గూర్చి వారికి ఎవరైనను తీర్పు తీర్చకుండునట్లు కొలొస్సయులు తగు జాగ్రత్త వహించవలసినవారై యుండిరి. 16వ వచనము ప్రకారము, ఈ నిషేధాజ్ఞలలో ఆహారపానీయములు, పండుగలు, ఉత్సవములు, మరియు సబ్బాతు దినమును పాటించుట మొ॥ విషయములకు సంబంధించిన నిబంధనలుండినవి. దేవుడు మోషే ద్వారా ఇచ్చిన ధర్మశాస్త్రము (అన్యమతారాధికుల నిబంధనలు కాదు) చొప్పున ఇటువంటి నిబంధనలు పాటించవలసి యుండినది.[53] మతసంబంధమైన ఈ అభ్యాసములు కేవలము రాబోవుచున్నవాటి యొక్క ఛాయయే తప్ప మరేమీ కాదని 17వ వచనము సూచించుచున్నది. అన్యమతారాధికుల అభ్యాసములు రాబోవుచున్నవాటి ఛాయలు కావు కానీ క్రొత్త నిబంధన బోధనలు తెలియజేయుచున్నట్లు ధర్మశాస్త్రము రాబోవుచుండిన నైజముల ఛాయయై యుండినది (హెబ్రీయులకు 10:1).

పౌలు, మోషే ధర్మశాస్త్రమును సూచించుచుండెనని అనేక మంది వ్యాఖ్యానకర్తలు నమ్ముదురు. ధర్మశాస్త్రము దేవుడు మోషేకు ఆజ్ఞాపించిన చేతివ్రాత రూపకమైన దస్తావేజై యుండినది (నిర్గమకాండము 34:27, 28). ఇశ్రాయేలీయులు దానిలో లిఖితమై యుండిన విషయములన్నిటిని పాటించవలసినవారై యుండిరి (ద్వితీయోపదేశకాండము 28:58; 30:9, 10; యెహెజ్కేలు 1:8). పాత నిబంధనలోని నిబంధనలకు మాత్రమే ఇది వర్తించును, ఏలయనగా, అప్పటికి క్రొత్త నిబంధన రచింపబడలేదు.

ధర్మశాస్త్రము క్రింద జీవించినవారికి అది ఒక కొలబద్ధవలె ఉండినది. సున్నతిచేయబడినవారందరు ధర్మశాస్త్రమంతటిని పాటించుటకు ఋణపడియుండిరి (గలతీయులకు 5:3). "ఋణము" ధర్మశాస్త్రము క్రింద జీవించుచుండినవారి పాపము కాదు. విశేషంగా, "ఋణము" అనివార్యమైన ఉత్తరదాయిత్వమై పాత నిబంధన ప్రకారము ధర్మశాస్త్రములోని ప్రతి ఆజ్ఞను లోపరహితంగా పాటించవలసిన ఋణగ్రస్తమైన భారమై యుండినది. ధర్మశాస్త్రము క్రింద ఉండినవారందరు దానిని ఉల్లంఘించారు గనుక వారి పాపము వలన మరణించవలసినవారై యుండిరి (రోమీయులకు 6:23; యాకోబు 1:13-15). మరణకారణమగు పరిచర్య వలె (2 కొరింథీయులకు 3:7-9). జీవము నిచ్చుటకు అది సమర్థవంతమైనదైనప్పటికిని, దాని క్రింద నుండిన వారందరి పాపములనుబట్టి ధర్మశాస్త్రము ఖండనను కలుగజేసినది (రోమీయులకు 7:9-11). మోషే ద్వారా ఇవ్వబడిన ధర్మశాస్త్రములోని నిబంధనల ఆధారంగా, ప్రతి ఒక్కరు పాపములో బంధింపబడినవారయ్యారు (గలతీయులకు 3:22). దేవుని ప్రజలు ధర్మశాస్త్రమందలి శాసనములను పాటించునట్లు "ఋణము" వారి మీద మోపబడిన బాధ్యతాయుతమైన కర్తవ్యమై యుండినది.

### "మనకు విరోధముగా నుండినది" (2:14బి)

ధర్మశాస్త్రము మనకు ఎలా విరోధమైనదై యుండినది? "విరోధము" అను పదము (*hupenantios*), "తీవ్రమైన వ్యతిరేకత"ను సూచించుచు, ఇచ్చట మరియు "విరోధులు" అని

అనుదింపబడిన హెబ్రీయులకు 10:27లో మాత్రమే కనిపించును. ధర్మశాస్త్రము మంచిదై యుండినది (రోమీయులకు 7:12 చూడుము); ఏదిఏమైనా, మానవ జాతి పాపిష్ఠియై యున్నది. ఈ హేతువునుబట్టియే, ధర్మశాస్త్రము యొక్క మంచి ప్రమాణము మానవుని పాపిష్టితనమును బట్టబయలు చేసినది (రోమీయులకు 7:8–11). దానిని ఉపేక్షించినవారు కనికరము లేకుండా మరణించిరి (హెబ్రీయులకు 10:28). అది ఇశ్రాయేలీయులు సహింపనలవికానిదై యుండెను ఏలయనగా వారు ఎటువంటి తప్పులు లేకుండా దానికి లోబడవలెనని కోరబడినది (యాకోబు 2:10). కాబట్టి, ధర్మశాస్త్రము క్రింద నుండినవారిని అది శాపగ్రస్తులను చేసినది (గలతీయులకు 3:10). ధర్మశాస్త్రము “మన పితరులైనను మనమైనను మోయలేని కాడి”యై యుండినదని పేతురు యెరూషలేములోని యూదీయ క్రైస్తవులకు అభయమిచ్చాడు (అపొస్తలుల కార్యములు 15:10బి). దాని చేత సమర్థింపబడగోరువారందరు క్రీస్తు నుండి వేరుచేయబడి కృపలో నుండి తొలగిపోయిరి (గలతీయులకు 5:4).

ధర్మశాస్త్రమును ఉల్లంఘించినందుకు వారు చెల్లింపవలసి యుండిన అపరాధ రుసుము, అత్యధిక సందర్భములలో, మరణము. పదింటిలోని ఏడు ఆజ్ఞలను ఉల్లంఘించినవారికి మరణ శిక్షయే విధింపబడింది. ఇతర దేవతలు సేవించిన ఇశ్రాయేలీయులకు, మొదటి మూడు ఆజ్ఞల ద్వారా నిషేధింపబడినట్లుగా, మరణ శిక్ష విధింపబడినది (ద్వితీయోపదేశకాండము 17:2–5). విశ్రాంతి దినమున పనిచేయుట ద్వారా నాలుగవ ఆజ్ఞను (నిర్గమకాండము 31:15), లేక వారి తల్లిదండ్రులను సన్మానించుటకు బదులుగా వారిని కొట్టుట లేక శపించుట ద్వారా ఐదవ ఆజ్ఞను (నిర్గమకాండము 21:15, 17), లేక చావగొట్టుట ద్వారా ఆరవ ఆజ్ఞను (సంఖ్యాకాండము 35:30, 31), లేక వ్యభిచరించుట ద్వారా ఏడవ ఆజ్ఞను ఉల్లంఘించినవారికి (ద్వితీయోపదేశకాండము 22:22–25) సహితము ఇదే శిక్ష నిర్దిష్టముగా విధింపబడినది.

దేవుడు అబ్రాహాము సంతానమునకు వాగ్దానము చేసిన ఆశీర్వాదములను కలుగజేయుటకు బదులుగా (ఆదికాండము 22:18; గలతీయులకు 3:16), దాని క్రింద జీవించినవారిని ధర్మశాస్త్రము శాపగ్రస్తులను చేసినది (గలతీయులకు 3:10). “ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపములేనిదైతే, రెండవ దానికి అవకాశముండనేరదు” (హెబ్రీయులకు 8:7). ధర్మశాస్త్రము యొక్క “బలహీనత మరియు నిష్ప్రయోజకత్వము” అది సాధించలేకపోయిన దానిలో కనపడుచున్నది (హెబ్రీయులకు 7:18, 19). అది ప్రజలను స్వతంత్రులనుగా (అపొస్తలుల కార్యములు 13:39), నీతిమంతులనుగా (రోమీయులకు 3:20; గలతీయులకు 2:16; 3:11) చేయలేకపోయినది, వారికి స్వాస్థ్యము నివ్వలేకపోయినది (గలతీయులకు 3:18; 1 పేతురు 1:3, 4), జీవమునియ్యలేకపోయినది (గలతీయులకు 3:21), ఒకనిని నీతిమంతుని చేయలేకపోయినది (గలతీయులకు 3:21), వారికి కృపను సమకూర్చలేకపోయినది (గలతీయులకు 5:4), ప్రజలను వారసులనుగా చేయలేకపోయినది (రోమీయులకు 4:14), వారిని పరిపూర్ణులను గావింపలేకపోయినది (హెబ్రీయులకు 7:19), వారి పాపములు క్షమింపలేకపోయినది (హెబ్రీయులకు 10:4), లేక వారికి కనికరమును సమకూర్చలేకపోయినది (హెబ్రీయులకు 10:28).

**"మేకులతో సిలువకు కొట్టి, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసెను" (2:14సి)**

ధర్మశాస్త్రము దాని ఉద్దేశమును అది నెరవేర్చినను, అది చేయజాలకపోయినది ఎక్కువగా ఉండినది. గనుక, దేవుని ప్రణాళిక చొప్పున, మేకులతో సిలువకు కొట్టి, ... మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసెను అని పౌలు చెప్పగలిగి యుండెను. ఇచ్చటి "ఆయన" అనునది దేవుని సూచించుచున్నది, మరియు సిలువ ద్వారా ధర్మశాస్త్రములోని వ్రాతరూపకమైన ఆజ్ఞలను తొలగించి ఆయన తన కార్యమును నెరవేర్చాడు. వచనం 12లోని "దేవుడు" వచనాలు 13-15లోని "ఆయన"కు పూర్వాంశమై యున్నది. "ఆయన సిలువ" అని ఆంగ్ల KJVలో కనిపించునది, మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసిన "ఆయన" (NASB) యేసు అయియున్నాడని సూచించుచున్నది. ఏదిఏమైనా, ఇటీవల అత్యధిక అనువాదములలో కనిపించుచున్నట్లుగా, "సిలువ," అను మాట "ఆయన సిలువ" అను దానికంటె శ్రేష్టమైన గ్రీకు చేతివ్రాత ప్రతుల నిదర్శనము కలిగియున్నది.

14 వచనములో పౌలు "ఆయన" అని వాడుచూ దానిని 'దేవుడు' నుండి 'క్రీస్తు'గా మర్చాడని జే. బి. లైట్‌పుట్ నమ్మాడు.[54] కార్సన్ ఈ క్రింది విధంగా చెప్పుచు సరిగా ఆక్షేపించాడు:

> కానీ సంబంధిత వాక్యభాగమందంతటను చర్చింపబడుచున్న అంశము స్పష్టముగా ఒకటే అయియున్నప్పుడు, అంశములో ఇటువంటి మార్పును ప్రతిపాదించుట వలన, అందులోని వ్యాకరణం గూర్చి నిర్హేతుకముగా జోక్యము కలుగజేసుకొనడమే ఔతుంది. గనుక 13 వచనములో "దేవుడు" క్రీస్తుతో కూడ మనలను లేపిన కర్తయై యున్నాడనునది అతి స్పష్టముగా కనిపించుచున్నది. కానీ 13 వచనములలోని అసమాపక క్రియా పదములు 14 వచనముతో సహజంగానే అవి కలిగియుండగల అదే అంశముతో సమాంతరము చేయబడి యున్నవి. అంతమాత్రమేగాక ఎత్తివేసి *erken*, అను పదమునకు ముందున్న మరియు అను పదము అంతకు ముందున్న వచనముతో జోడించుచు రెండు వచనముల అంశము కూడా ఒకటే అయియున్నదను తుది అభిప్రాయమును కలుగజేయుచున్నది.[55]

ధర్మశాస్త్రము మనకు అడ్డములేకుండా ఎత్తివేయబడినదని ఉపదేశించుటలో క్రొత్త నిబంధన పొందికగా కొనసాగుచున్నది. అన్యజనులైయుండిన క్రైస్తవులపై ధర్మశాస్త్రమును బలవంతాన రుద్దుటకు వెదుకుచుండిన కొందరు యూదీయ క్రైస్తవులు, "వారు సున్నతిచేయబడవలసినదే, వారు మోషే ధర్మశాస్త్రమును తప్పనిసరిగా పాటించవలెను" అని చెప్పారు (అపొస్తలుల కార్యములు 15:5). అయితే ఇందుకు యెరూషలేములో నుండిన అపొస్తలులు మరియు సంఘ పెద్దలైనవారు, "వారికి మేము అధికారమిచ్చియుండ లేదు" అని జవాబు చెప్పారు (అపొస్తలుల కార్యములు 15:24). స్పష్టముగా, అన్యజనులైన క్రైస్తవులు వారి పిల్లలకు సున్నతి చేయవలెననిగాని లేదా వారు ధర్మశాస్త్రమును పాటించవలెననిగాని వారు ఎటువంటి ఆదేశములు జారీచేయలేదని వారు భావించియుండిరి.

క్రైస్తవులు ధర్మశాస్త్రము క్రింద లేరని ఇతరమైన వాక్యభాగములు బోధించుచున్నవి:

- "మీరు ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు" (రోమీయులకు 6:14).
- "మనము ధర్మశాస్త్రమునకు లోనగువారము కాము" (రోమీయులకు 6:15).
- "మీరును ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి" (రోమీయులకు 7:4).

- "ఇప్పుడైతే దేనిచేత నిర్బంధింపబడితిమో దాని విషయమై చనిపోయినవారమై ధర్మశాస్త్రము నుండి విడుదల పొందితిమి" (రోమీయులకు 7:6).
- రాళ్ల మీద చెక్కబడిన నిబంధన "మహిమ తగ్గిపోవునదై యున్నది" (2 కొరింథీయులకు 3:7-13).
- "నేనైతే ... ధర్మశాస్త్రము విషయమై చచ్చినవాడనైతిని" (గలతీయులకు 2:19).
- "మనము ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీయులకు 3:25).
- "మనము ... దాసి కుమారులము కాము" (గలతీయులకు 4:31, ఇది "సీనాయి కొండ సంబంధమైన" ప్రస్తావనకు సంబంధించినదై యున్నది; వచనం 24).
- "ఆయన [క్రీస్తు] ... ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టెను ..." (ఎఫెసీయులకు 2:14, 15).
- "... అది [ఆ ధర్మశాస్త్రము] నివారణ చేయబడి యున్నది ... ." (హెబ్రీయులకు 7:18, 19).
- "ఆయన ... మొదటిదానిని [నిబంధన] పాతదిగా చేసియున్నాడు" (హెబ్రీయులకు 8:13; వచనం 7 చూడుము).
- "ఆయన ... మొదటి దానిని కొట్టివేయుచున్నాడు" (హెబ్రీయులకు 10:9).

పాత నిబంధన "మనకు అడ్డములేకుండా ఎత్తివేయబడిన" ధర్మశాస్త్రముకంటే ఎక్కువ విషయములను కలిగియున్నది. ధర్మశాస్త్రము అత్యధికంగా నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము, మరియు ద్వితీయోపదేశకాండములో కలదు. ధర్మశాస్త్రము యొక్క అన్వయము పాత నిబంధనలోని మిగిలిన పుస్తకములలో అర్థవంతముగా తెలియజెప్పబడినది. పాత నిబంధనలో, ధర్మశాస్త్ర సంబంధమైన పుస్తకములతోపాటు, చరిత్ర, కీర్తనలు, జ్ఞానముతో కూడిన నానుడులు, మరియు ప్రవచనము కలవు. ఆ యా పుస్తకములలో క్రైస్తవులకు అవసరమైయున్న విలువైన ఆదేశములు (రోమీయులకు 15:4) మరియు ఉదాహరణములు (1 కొరింథీయులకు 10:6, 11) కలవు. క్రైస్తవుల ప్రయోజనము పొందగల విషయముల యొక్క మూలాధారము లేఖనములలో, మరి ముఖ్యంగా యోబు, కీర్తనలు, సామెతలు, మరియు ప్రవక్తల గ్రంథములలో కలవు. క్రైస్తవులకు అవసరమైయున్న ఆదేశములను జారీ చేయుచు వారిని ప్రోత్సాహించు నిమిత్తము ఈ గ్రంథ పాఠములు తరుచుగా ఉల్లేఖించి చెప్పబడుచు అన్వయింపబడుచుండును. యేసే క్రీస్తని నిరూపించుటకు ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథములు, మరియు కీర్తనలు ఉపయోగకరముగా నుండును (లూకా 24:44; అపొస్తలుల కార్యములు 28:23), ఏలయనగా ప్రవచనములలో అత్యధిక భాగము క్రొత్త నిబంధనలో నెరవేరినవి (1 పేతురు 1:10-12). ఏదిఏమైనా, ధర్మశాస్త్రములోని నియమనిబంధనలు మాత్రమే గాక, దానిలోని మతసంబంధమైన ఆచారకర్మకాండలు మరియు ఆరాధనల అభ్యాసములు కూడ రద్దుచేయబడినవి. ప్రవచనములు సంపూర్తిగా నెరవేరిన తరువాత, అవి కూడ రద్దుచేయబడినవి (మత్తయి 5:17, 18).

ఆది సంఘము ధర్మశాస్త్రమును పాటించుటకు అంకితమై యుండలేదు; విశేషంగా, అది అపొస్తలుల బోధయందు కొనసాగినది (అపొస్తలుల కార్యములు 2:42). యేసు,

పరిశుద్ధాత్మ ద్వారా, అపొస్తలులకు సమస్త విషయములను బోధించి వారికి సర్వసత్యమును సవివరంగా తెలియజెప్పాడు (యోహాను 14:25, 26; 16:12, 13). అటుతరువాత, "ఆయన వారికి ఏ యే సంగతులను ఆజ్ఞాపించాడో వాటినన్నిటిని వారు గైకొనవలెనని" ఇతరులకు వారు నేర్పించవలెనని ఆయన వారికి ఆదేశములనిచ్చాడు (మత్తయి 28:20). ఆయనను వెంబడించువారికి యేసు బోధలు, ధర్మశాస్త్రము కాదు, బోధింపబడవలెను మరియు బోధింపబడినవి వారు పాటించునట్లు చూడవలెను.

క్రైస్తవులు ధర్మశాస్త్రము యొక్క నానావిధములైన కోణములను పాటించవచ్చును, కానీ తద్వారా వారు నీతిమంతులుగా తీర్చబడవలెను, లేదా వారు నీతిమంతులుగా చేయబడవలెనను తాత్పర్యము, తప్పు (అపొస్తలుల కార్యములు 13:39; గలతీయులకు 2:16, 21). అననీయ, అతడు రక్షింపబడుటకు ఏమి చేయవలెనో పౌలుకు తెలియజెప్పుటకు యేసు చేత పంపబడిన ఒక క్రైస్తవుడు, "ధర్మశాస్త్రము చొప్పున" భక్తిపరుడై యుండెను (అపొస్తలుల కార్యములు 9:10, 11; 22:12-16). అతడు "ధర్మశాస్త్రమును గైకొని యథావిధిగా నడుచుకొనుచున్నాడని" నిదర్శనముగా చూపించుటకు పౌలు తననుతాను దేవాలయములో శుద్ధీకరించుకొన్నాడు (అపొస్తలుల కార్యములు 21:24). ఏదిఏమైనా, ధర్మశాస్త్రము అన్యజనులైన క్రైస్తవులతో సహా. ఇతరులెవరిపైనైనను బలవంతముగా రుద్దబడకూడదనుటలో వ్యత్యాసముండినది. దీని గూర్చి అపొస్తలులు మరియు సంఘ పెద్దలు యెరూషలేములో కూడుకొనినప్పుడు ఈ సమస్య పరిష్కరింపబడినది (అపొస్తలుల కార్యములు 15:19, 24).

ధర్మశాస్త్రము యిప్పటికిని అమలులో ఉన్నదని నమ్మువారనేకులు, అది కొట్టివేయబడలేదని ఋజువుపర్చుటకు మత్తయి 5:17, 18ని ఒక ఉల్లేఖనముగా ప్రస్తావించుదురు. ఆ వాక్యభాగములో యేసు ధర్మశాస్త్రము గూర్చి మాత్రమే కాదు, కానీ ప్రవక్తల గూర్చి కూడా ఆయన మాటలాడుచుండెను. ధర్మశాస్త్రములో ఆయనను గూర్చి వ్రాయబడియున్న ఏ ప్రవచనమైనను లేక ప్రవక్తలైనను నెరవేరకమునుపు అవి గతించవని ఆయన సెలవిచ్చాడు. ఆయనకు సంబంధించిన ప్రవచనములను యేసు నెరవేర్చినప్పుడు, వాటిని ఆయన పునఃనెరవేర్చుట ఆయనకు తప్పనిసరైన విషయమేమీ కాదు; ఈ విధంగా అవి గతించిపోయినవి, అవి సంపూర్తియైనవి. ఆయనకు సంబంధించినంత వరకు యేసు సకల ప్రవచనములను నెరవేర్చాడు (లూకా 24:44-48).

యేసు ఏమి చెప్పుచుండెనో ఈ క్రింది వివరము ఉదాహరణంగా వర్ణించును. ఒకడు దుకాణంకి వెళ్లి కొన్ని వస్తువులను అరువు బేరంగా ఖరీదు చేసాడని అనుకొండి. కొద్ది రోజుల తరువాత ఆ బిల్లు మొత్తమును చెల్లించడానికి అతడు అంగడికి వచ్చి, "నేను ఇక్కడికి వచ్చినది ఈ బిల్లు కాగితమును పాడుచేయుటకు కాదు కానీ దానిలోని మొత్తమును చెల్లించుటకే వచ్చాను. నేను బిల్లు మొత్తమును పూర్తిగా చెల్లించేలోగా ప్రతి వస్తువు యొక్క వెల చెల్లింపబడును, ఏ ఒక్క వస్తువైనా వెల చెల్లింపబడక ఉండదు" అని చెప్పాడనుకొనండి. ఇలా చెప్పుట ద్వారా, అతడు బిల్లులోని ప్రతి వస్తువు వెల చెల్లించునని ఒట్టుపెట్టుకొనుచున్నాడు. బిల్లు ఒకసారి పూర్తిగా చెల్లింపబడిన తరువాత, అది నమోదు చేయబడిన దస్తావేజుల్లో అది మునుపటి అప్పు అన్నట్లుగా ఉండిపోవచ్చును, కానీ అది యిక ముందు అమలుచేయబడుటకు ఆస్కారమేమీలేనిదగును; అది పూర్తిగా చెల్లింపబడినది. ఆ మొత్తమును మరలా చెల్లింపవలసిన అవసరంలేదు.

యేసు పలికిన మాటలకు కూడా ఇదే సూత్రము వర్తించును. ఆయన గూర్చి ధర్మశాస్త్రములోగాని ప్రవక్తలలోగాని ప్రవచనముగా పలుకబడినదేదియును ప్రతి ఒక్కటి నెరవేరు వరకు అది గతించదు. ఒకసారి అది క్రీస్తులో నెరవేరిన తరువాత, ఈ ప్రవచనములు యిక అమలులో ఉండవు. అవి దస్తావేజుల్లోని నివేదికగా మాత్రమే నిలిచియుండును; ఆయన వాటిని పలుమారు నెరవేర్చాల్సిన అవసరంలేదు.

ధర్మశాస్త్రము కొట్టివేయబడినదని చూపించుటకు పౌలు మూడు ప్రతిపాదనలు చేసాడు. "తుడిచివేసి," "అడ్డముగాలేకుండ ఎత్తివేసి." మరియు "సిలువకు కొట్టి" అని ఆయన ప్రకటించాడు. ఈ మాటలన్నియు ఒకే సత్యమును వివరించుచున్నవి. "తుడిచివేసి" (*exa-leipsas*) అనగా "రద్దుచేసి, కొట్టివేసి" అని అర్థము. ఈ వచనములో వ్రాయబడియున్నట్లుగా, బఎర్ దీనిని ఇలా నిర్వచించుచున్నాడు, "దాని జాడనే లేకుండా తీసివేయుట, తొలగించుట, నాశనము చేయుట, నామ రూపాలు లేకుండా నాశనము చేయుట."[56] "అడ్డముగాలేకుండా ఎత్తివేసి" (*ērken*, నుండి *airō*) అనగా "దూరముగా తీసివేయుట, తొలగించుట, లేక పైకెత్తకుండా అధీనములోనికి తెచ్చుకొనుట … నాశనము చేయుట (13–15 వచనములకు అన్వయింపజేయబడినప్పుడు)."[57] అనగా, సంపూర్తిగా తొలగించుట. "సిలువకు కొట్టి" – దీనిలో ధర్మశాస్త్రము మరణించినది/అంతమయ్యిందను ధ్వనింపు ఉన్నది. ధర్మశాస్త్రము, యిక అమలులో లేని దస్తావేజు, తుడిచివేయబడినది లేక రద్దుచేయబడినది లేక ప్రక్కకు నెట్టివేయబడినదను వాస్తవమును ఈ మూడు ప్రతిపాదనలు నొక్కివక్కాణించుచున్నవి.

14సి వచనములలోని, "సిలువకు కొట్టి" అను మాటలకు అక్షరార్థము తీసికొనకూడదు. ధర్మశాస్త్రము అడ్డముగా ఉండకుండునట్లు చేయుటకు చేపట్టబడిన ప్రక్రియను సూచించుచు, అది ఎత్తివేయబడిన సమయమును గుర్తించుచున్న ఒక అలంకారమై యున్నది. మేకులతో యేసు సిలువకు కొట్టబడినప్పుడు, ధర్మశాస్త్రము మరణించినది, అది సమాప్తమయ్యింది, అది యిక అమలులో లేనిదయింది. యేసు మరణము ద్వారా నూతన నిబంధన ప్రతిష్ఠింపబడిన అదే సమయంలో అది ఎత్తివేయబడింది (హెబ్రీయులకు 9:16–18; మత్తయి 26:28 కూడ చూడుము). "ఆ రెండవ దానిని స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టివేయుచున్నాడు" (హెబ్రీయులకు 10:9బి).

ఎఫెసీ పత్రికలో, పౌలు తన దృష్టిని ఇదే సిద్ధాంతముపై కేంద్రీకరించాడు. యూదులకును అన్యజనులకును మధ్య నుండిన గోడను పడగొట్టుట ద్వారా, "విధి రూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును" యేసు కొట్టివేశాడు (ఎఫెసీయులకు 2:14, 15). "ఆజ్ఞలు" అను మాటకు గ్రీకులో *dogmata* అను పదమున్నది, ఇదే పదము "అధికార శాసనములు" (ఆజ్ఞలు) అని కొలొస్సయులకు 2:13–15లో అనువదింపబడినది *dogmata* అను పదమును పౌలు ఎఫెసీ పత్రికలోను కొలొస్సీ పత్రకలోను వాడుట వలన ఈ రెండు వాక్యభాగములలో కూడా ఒకే ఆలోచనను తెలియజెప్పవలెనని ఆయన ఉద్దేశించాడను తుది అభిప్రాయము బలపర్చబడుచున్నది. ధర్మశాస్త్రము, సిలువకు కొట్టివేయబడి, తుడిచివేయబడి, ఎత్తివేయబడినందు వలన ఇప్పుడు యిక సజీవంగా లేదు.

ఈ రెండు వాక్యభాగములలో గల సమాంతర అభిప్రాయములను గమనించండి:

| ఎఫెసీయులకు 2:14, 15 | కొలొస్సయులకు 2:13-15 |
|---|---|
| "ఆయనే ... మధ్య గోడను పడగొట్టెను" | "వ్రాతరూపకమైన ... ఋణముగా నుండిన ... పత్రమును ... తుడిచివేసెను" ("అడ్డములేకుండ దానిని ఎత్తివేసెను") |
| "ద్వేషమును ... తన శరీరమందు కొట్టివేయుట చేత ..." | ("మేకులతో సిలువకు కొట్టి") |
| "విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రము [*dogmasin*]" | "వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన [*dogmasin*] మనమీద ఋణముగాను మనకు విరోధముగాను ఉండిన పత్రము" |

(కుండలికరణములలో నున్న పదజాలములు పోలికలను నొక్కివక్కాణించుటకు వాటికి స్థానమార్పు కలుగజేయబడినది.)

"తన శరీరమందు" (ఎఫెసీయులకు 2:15) అను పదజాలము "సిలువకు కొట్టి" (కొలొస్సయులకు 2:113-15) అను పదజాలమునకు ఒక పరోక్షమైన ప్రస్తావనయై యున్నది. ఆయన శరీరము సిలువకు కొట్టబడుచుండగా, ఆయనతో కూడ ధర్మశాస్త్రము సిలువకు కొట్టబడినది. యేసు సిలువ మీద మరణించినప్పుడు పాపపరిహారార్థ బల్యర్పణ నిమిత్తము ధర్మశాస్త్రము కోరుచుండిన విషయములను ఆయన సంపూర్ణము చేసాడు. ఈ విధంగా "తన శరీరమందు" అని చెప్పుకొనవచ్చును – ఆయన సిలువ మీద మరణించినప్పుడు, ధర్మశాస్త్రము నెరవేరినది, అది తుడిచివేయబడినది. మరియు రద్దుచేయబడినది తద్వారా యేసు సిలువ మీద మరణించినప్పుడు ధర్మశాస్త్ర నియమము సమాప్తమయ్యింది.

"మధ్య గోడను పడగొట్టెను," "తన శరీరమందు కొట్టివేసెను," "తుడిచివేసెను," "అడ్డముగాలేకుండ ఎత్తివేసెను," మరియు "దానిని మేకులతో సిలువకు కొట్టెను" అను మాటలు ధర్మశాస్త్రము ప్రక్కకు నెట్టివేయబడినదని ఈ వచనములో సూచించుచున్న పదములై యున్నవి. క్రీస్తు ద్వారా, వారు స్వతంత్రులుగా చేయబడిరి గనుక వారు ధర్మశాస్త్రము క్రింద ఉండకుండా స్వతంత్రులుగా కొనసాగుచుందురని కొలొస్సయులు తెలిసికొనవలెనని పౌలు అతురతతో ఆశించుచుండెను. అందుచేతనే బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు, ధర్మశాస్త్రములో కాదు, ఆయనయందే గుప్తములై యున్నవని ఆయన వారితో చెప్పెను (కొలొస్సయులకు 2:3). ధర్మశాస్త్రమును పాటించవలసినదేయను నిర్బంధమేమియు లేకుండా వారు యేసును అనుసరించవలసినవారై యుండిరి.

క్రైస్తవులు ధర్మశాస్త్రము క్రింద లేరనియు, వారు స్వతంత్రులై యున్నారనియు పౌలు తన తుది అభిప్రాయమును వెలిబుచ్చాడు గనుక, మానవుల చేత వ్యవస్థీకరింపబడిన మతసంబంధమైన ఇతర నియమములకు అధికారము లేదని ఆయన చెప్పాల్సిన అవసరం లేదు. కొలొస్సయుల కాలము నాటి ఎస్సెనీయులు మరియు ఇతరులకు వివాహము మరియు జంతువుల మాంసముతో సహా, కొన్ని ఆహారపదార్థములను నిషేధించిన ఆజ్ఞలుండినవి. క్రీస్తునంగీకరించినవారి నేపథ్యముల విషయంలో మతసంబంధమైన నిబంధనలతో నిమిత్తము లేకుండా, వారు యేసువైపు చూచుట, కొలొస్సయులు నిర్వర్తించవలసిన ఒకే ఒక

అనివార్యమైన కర్తవ్యమై యుండినది. వారు మానవ కల్పిత అధికార శాసనములను లేక ధర్మశాస్త్రమును అనుసరించాల్సిన అవసరంలేదు, ఏలయనగా అట్టి అధికార శాసనముల నుండి ఆయన అనుచరులను యేసు స్వతంత్రులనుగా చేసాడు.

## క్రీస్తు చేత బట్టబయలుచేయబడిన విరోధము (2:15)

**[15]ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి, బాహాటముగా వేడుకకు కనుపరచెను.**

**"ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసెను" (2:15ఎ)**

యేసు "ప్రధానులను అధికారులను" నిరాయుధులనుగా చేసాడు అని అతడు పలికినప్పుడు పౌలు ఒక పదమును క్రొత్తగా కల్పించియుండవచ్చును, ఏలయనగా గ్రీకు సాహిత్యములో ఈ పదము కనిపించుట ఇదే తొలి దర్శనము. ఈ హేతువు మూలమున, దాని అర్థమును నిర్ధారించుటకు తోడ్పడు ఏ సమకాలీన సందర్భము అందుబాటులో లేదు. అపొస్తలుడు ఈ పదమును, "పరిత్యజించి" (3:9) అని అనువదింపబడిన ఒక అసమాపక క్రియాపదముగా మరొక పర్యాయము ఉపయోగించాడు, మరియు ఒకసారి నామవాచక రూపంలో ("తొలగింపు"; 2:11) ఉపయోగించాడు. "నిరాయుధులనుచేయు" (*apekduomai*) అను పదమును, వస్త్రములను తీసివేయుట అను భావముతో "తొలగించు, తీసివేయు, రిక్తునిచేయు" అని అర్థంచేసికొనవచ్చును. ఏది ఏమైనా, ఈ సందర్భములో, దుష్టశక్తులను ఎందుకూ పనికిరాకుండా ప్రభావశున్యము చేయుటలో దేవుడు యేసు ద్వారా చేసిన కార్యమును సూచించుచున్నట్లు, "నిరాయుధులనుచేయు" అనునది శ్రేష్ఠమైన వ్యాఖ్యానమై యున్నది.

ఈ ప్రధానులు మరియు అధికారులు ఎవరు? వారు ఎలా నిరాయుధులుగా చేయబడిరి? వారిని నిరాయుధులనుగా చేసినదేవరు? హెచ్. డెర్మోట్ మెక్‌డోనాల్డ్ ఈ క్రింది సలహా ఇచ్చుచున్నాడు, "భాష్యము చెప్పుటకు కొలొస్సీ పత్రికలోని అత్యంత కష్టమైన వాక్యభాగములలో ఇదొకటి."[58] మరియు మూడు ప్రశ్నలు తలెత్తుచున్నవి. (1) పౌలు భావవాచి ప్రయోగమును (*apekdusamenos*, "నిరాయుధులుగా చేయబడిన") ఎందుకు ఉపయోగించాడు? భావవాచి ప్రయోగము (*middle voice*), "నేను అతనిని కడిగితిని" వంటి కర్త ప్రయోగ (*active voice*) ప్రకటననకు వ్యతిరేకముగా నుండు "నన్ను నేను కడుగుకొన్నాను," వంటి భావమును వ్యక్తము చేయును. అట్లయితే, దేవుడు మరియు యేసు ఏదో ఒకదానిని తమలోనుండియే తీసివేసారని దీని అర్థమా? లేక, వారు ఇతరులను నిరాయుధులనుగా చేసారని అర్థమా? (2) దేవుడు లేదా యేసు "కర్త"యై యున్నారా? (3) ఎటువంటి ప్రధానులు మరియు అధికారులు నిరాయుధులు చేయబడిరి?

మెక్‌డొనాల్డ్ దీని సారాంశమును ఇలా తెలియజేయుచున్నాడు:[59]

1. క్రీస్తు తనను తాను శరీరమును విహీనము చేసికొనుట ద్వారా తనను తానే రిక్తునిగా చేసికొని లోకనాధులు మరియు అధికారులను బహిరంగ ప్రదర్శనగావించాడు.

2. అంతకు మునుపు ఆయనను చుట్టుముట్టి యుండిన వ్యతిరేక దుష్టశక్తుల నుండి క్రీస్తు తననుతానే రిక్తునిగా చేసికొనిన తరువాత, వారిని చిట్టచివరిసారిగాను, శాశ్వతంగాను ఆయన తన సిలువలో వారిని ఆయన నుండి విసరివేసాడు.
3. సిలువ కృత్యము ద్వారా దేవుడు మనలను మనకు విరోధముగా నున్న దుష్టశక్తుల నుండి తొలగించాడు.
4. ప్రధానులను మరియు అధికారులను కొట్టివేసి తద్వారా ఆయన చిత్తమును అంతకు పూర్వము తెలియజేసిన దేవుడు (1 పేతురు 3:22 చూడుము), వారిని బహిరంగముగా ప్రదర్శించుచు, క్రీస్తుకు లోబడజేయుచు, వారిని విజయోత్సవముతో నడిపించాడు.
5. మానవులను దేవుని నుండి కొల్లసొమ్ముగా దోచుకొనుటకు ప్రయత్నించిన ప్రధానులు మరియు దుష్టశక్తుల యొక్క భయంకరమైన అధికారక్రమము వలన తనకుతాను హానిచేసికొని, సిలువ విజయము ద్వారా వారిని క్రీస్తు బట్టబయలు చేయుచు వారికి బహిరంగ అవమానము కలుగజేసాడు.

"నిరాయుధులను చేయు" అను పదము, ఒక అసమాపక క్రియగా, "తానే దేనినో ఒక దానిని తన నుండి (తొలగించుకొని) రిక్తునిగాచేసికొను" అను అర్థము వచ్చునట్లు దానికి భావవాచి ప్రయోగము (*middle voice*) యొక్క ఒత్తిడి ఇవ్వబడవలెనని కొందరు వారి తుది అభిప్రాయమును వెలిబుచ్చుచున్నారు. ఈ హేతువునుబట్టి, మెక్‌డొనాల్డ్ ఇచ్చిన (1) మరియు (2) వివరముల ద్వారా సూచింపబడినట్లు పౌలు ప్రస్తావన, క్రీస్తు తన నుండి తన శరీరమును, విరోధముగా నుండిన దుష్టశక్తులను, లేక దూతలను సహితము, వారి చేత మధ్యవర్తిత్వము వహింపబడిన ధర్మశాస్త్రమును కలుపుకొని (అపొస్తలుల కార్యములు 7:35; గలతీయులకు 3:19బి; హెబ్రీయులకు 2:2 చూడుము), తొలగించుకొనుట ద్వారా చేసిన కార్యమును గూర్చినదై యున్నదని కొందరు అనుకొనుచున్నారు. క్లింటన్ ఈ. ఆర్నాల్డ్ గమనించినట్లుగా, ఈ అభిప్రాయమే తుది అభిప్రాయమై యుండనవసరములేదు:

> దేవునిని కర్తగాను, ప్రధానులు మరియు దుష్టశక్తులను వస్తువులుగాను (వ్యాకరణంలో "కర్మ"గా) ఎంచబడు ప్రాధాన్యతతో దానిని కర్తగా అర్థంచేసికొనుట ఇచ్చుటి అసమాపక క్రియ యొక్క ఉత్తమమైన అనువాదమై యుండును. విజయోత్సవముతో సాగుచున్న ఊరేగింపు, అనగా శత్రువులు ఓటమి పాలయ్యారని మాత్రమేగాక వారు నిరాయుధులుగా చేయబడిరను భావమునిచ్చు విషయము గూర్చి ఈ క్రింది ప్రతిరూపమునకు ఇది ఎక్కువ ఉపయుక్తమైనదై యున్నది. అదే అసమాపక క్రియ 3:9లో … వాడబడుటతో ఇది బహుచక్కగా అంగీకారయోగ్యమైనదై యున్నది మరియు అది ఒక కర్తగా: "ప్రాచీన స్వభావమును పరిత్యజించి"[60] అని ఉత్తమంగా వివరింపబడినది.

పౌలు "కర్తను" మార్చితే తప్ప, ఈ సందర్భములోని కార్యనిర్వాహకుడు దేవుడై యుండవలెను. పౌలు ఆలోచనా ప్రగతిని పరిశీలనగా పరికించుట వలన 13-15 వచనములలోని సర్వనామము "ఆయన" దేవునిని (వచనం 12) సూచించుచున్నదనియు, "ఆయనను" అను పదము యేసును సూచించుచున్నదనియు మనము ఒక తుది

అభిప్రాయమునకు రావలెను:

- “దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా” (వచనం 12).
- “ఆయనతో (యేసుతో) కూడ మిమ్మును జీవింపచేసెను” (వచనం 13).
- “(ఆయన – దేవుడు) అడ్డములేకుండ దానిని ఎత్తివేసెను” (వచనం 14బి).
- “ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువచేత (యేసు ద్వారా) జయోత్సవముతో … కనుపరచెను” (వచనం 15).

“ప్రధానులు” అనునది *archē* అను పదము నుండి అనువదింపబడినది, ఇది కొన్నిపర్యాయములు “ప్రారంభము,” “ప్రముఖత/ప్రాముఖ్యత” లేక “మూలము” అని అర్థమిచ్చును. “అధికారులు” (*exousia*) అను పదము అధికారమును వినియోగించు హక్కును సూచించుచున్నది (1:11ఎ గూర్చిన చర్చను చూడుము). ఈ గ్రీకు పదములు పౌలు రచనలలో మరొకచోట కలిసి కనబడును (1 కొరింథీయులకు 15:24; ఎఫెసీయులకు 1:21; 3:10; 6:12; కొలొస్సయులకు 1:16; 2:10; తీతు 3:1). అది అమలులో ఉండిన అధికారములలో వారి ప్రభావమును మనుష్యుల మధ్య ప్రయోగము చేయునదేదైనను అయియుండవచ్చునని ఈ వాక్యభాగములలో పౌలు భావమై యున్నది. (ఎఫెసీయులకు 6:12లో అవినీతి ప్రభుత్వములు మరియు దుష్టశక్తులు కలుపుకొనబడియున్నవి.) వారు దేవునికి విరోధముగా పనులు చేయుచుందురు, మానవజాతి ఖండింపబడవలెనని వెదకుచుందురు, మరియు రక్షణకే గాక రక్షకునికి సహితము శత్రువులై యున్నారు. వీరు ధర్మశాస్త్రము ఇయ్యబడిన దూతల సంబంధమైన అధికారులని (అపొస్తలుల కార్యములు 7:38; గలతీయులకు 3:19) అనువదించువారు, ఈ పదములను పౌలు సాధారణంగా ఉపయోగించిన దాని కంటె భిన్నమైన విధములలో అన్వయించుదురు.

దేవుడు ఈ అధికారులను ఎలా నిరాయుధులను చేసాడు, వారిపై ఎలా విజయోత్సవము సాధించాడు, మరియు వారిని ఎలా బాహాటముగా ప్రదర్శించాడను విషయములలో మరొక సమస్య తలెత్తుచున్నది. యేసు మరణము మరియు పునరుత్థానము ద్వారా ఆయన వారిని అధిగమించి అపజయము పాలుచేయుట వలన ఈ కార్యములు సాధించాడు. విరోధులపై లేక శత్రువులపై ఇవ్విధముగా విజయము సాధించుట ఎవ్విధంగాను మంచివారిని, తిరుగుబాటుచేయని దూతల సమూహమును నిరాయుధులను చేయుటకు వర్తించదు.

యేసు మరణము మరియు పునరుత్థానము ద్వారా, ఆయన ప్రణాళికలకు ప్రతిపక్షమున నుండిన వారందరిని దేవుడు ఓడించాడు. ఆయన పునరుత్థానము ద్వారా, ఆయనను చంపిన యూదీయ నాయకులు, అపవాది శక్తులు, మరియు ఆయనకు విరోధముగా నుండిన సకల ఇతర బలములపై యేసు విజయం సాధించాడు. ఆయనను పట్టుకొనుటకు వచ్చిన యూదీయ సైనికులకు ఆయనపై ఎటువంటి అధికారము లేదని యేసు పేతురుకు తెలియజెప్పాడు (మత్తయి 26:53). లోకములోని అత్యంత శక్తివంతమైన సామ్రాజ్యవాద దేశాధికారమునకు సహితము ఆయనపై ఎటువంటి అధికారము లేదని యేసు పిలాతుకు బయలుపర్చాడు (యోహాను 19:11). ఆయన మరణము మరియు పునరుత్థానము ద్వారా, మరణమునకు ఆయనపై అధికారము లేదని ఆయన నిరూపించాడు (అపొస్తలుల కార్యములు 2:24). ఆయన మరణము మరియు పునరుత్థానము ద్వారా, దుష్టుని అధికారమును (హెబ్రీయులకు

2:14; 1 కొరింథీయులకు 15:55-57 కూడ చూడుము) మరియు వాని దుష్ట దూతలను (మత్తయి 25:41), పైశాచిక శక్తులను ఆయన సమూల నాశనము చేసాడు.

ఈ వాక్యభాగములోని "అధికారులు," కొలొస్సయులు "... విడుదల చేయబడిన అంధకారసంబధమైన అధికారము [*exousia*, "13-15 వచములలో 'అధికారులు' అని అనువదింపబడిన అదే పదము"] అని ఆయన అంతకు మునుపు చేసిన ప్రకటనలో పౌలు పేర్కొనినవారే అయియున్నారు (1:13ఎ; లూకా 22:53 కూడ చూడుము). ఇట్లు, యేసు ద్వారా, వారిని "నిరాయుధులనుగా చేసి" కొలొస్సయులను వారి బారి నుండి విడుదల చేసి, అంధకారసంబంధమైన "అధికారము"ను దేవుడు ఓడించాడు. ఆయన సిలువ మీద మరణించి మరలా పునరుత్థానుడగుట ద్వారా యేసు, ఆయనకు విరోధముగా నుండిన సమస్త బలములపై ఆయన సాధించిన విజయోత్సవమును బాహాటంగా ప్రదర్శించాడు (యోహాను 12:31). ఆయన విజయము ఆయనను వెంబడించువారికందరికి విజయమును సమకూర్చినది (1 కొరింథీయులకు 15:57; 2 కొరింథీయులకు 2:14).

ప్రజలు యేసును వ్యతిరేకించునట్లు వారిని ప్రోత్సాహించుటకు సాతాను సకల ప్రయత్నములు చేయును. విత్తువాని గూర్చిన ఉపమానములో, దేవుని వాక్యమును వినువారు దానిని విశ్వసించకుండునట్లు వారి హృదయములలో నుండి సాతాను ఆ వాక్యమును యెత్తికొనిపోవునని యేసు బోధించాడు (మత్తయి 13:19; మార్కు 4:15; లూకా 8:12). యేసు గూర్చి పేతురు తప్పుడు ప్రకటన చేయునట్లు సాతాను పేతురును ప్రభావితము చేసి (మత్తయి 16:22, 23), అతనిని గోధుమల వలె జల్లించుటకు ప్రయత్నించాడు (లూకా 22:31). ఇస్కరియోతు యూదా యేసును అప్పగించునట్లు అపవాది యూదా హృదయములో ప్రవేశించి వాని పని వాడు చేసుకొన్నాడు (లూకా 22:3; యోహాను 13:2, 27). వారు వారి తండ్రియైన దుష్టుని సంబంధులనియు, దుష్టుని కోరికలనే నెరవేర్చువారనియు ఆయనను వ్యతిరేకించిన యూదులకు యేసు తెలియజెప్పాడు (యోహాను 8:44). వాని యిష్టము చొప్పున చేయువారిని వాడు చెరగా పట్టుకొని యుంచుకొనును (2 తిమోతి 2:26).

"అపవాది యొక్క క్రియలను లయపర్చుటకే, దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" అని యోహాను రచించాడు (1 యోహాను 3:8బి). ఆసన్నమగుచుండిన ఆయన సిలువమరణము మరియు లోకాధికారులపై ఆయన సాధించు విజయము దిశగా తన దృష్టిని మళ్లించిన యేసు, "ఇప్పుడు ఈ లోకమునకు తీర్పు జరుగుచున్నది; ఇప్పుడు ఈ లోకాధికారి బయటకు త్రోసివేయబడును" అని చెప్పాడు (యోహాను 12:31). సాతాను "ఈ లోకాధికారి" యని యేసు మరొక చోట ప్రస్తావించాడు (యోహాను 16:11; 14:30 చూడుము). సాతాను ఇష్టమును సాధించుటకు వెదకుచుండిన దుష్టుడు మరియు ఈ లోకాధికారుల ప్రతి ప్రయత్నమును యేసు ఓడించాడు.

సాతాను సమస్త దయ్యములు, లేక దురాత్మల పరిపాలకుడై యున్నాడు (మత్తయి 9:34; 12:24; మార్కు 3:22; లూకా 11:15), వీరు "దూతలై యున్నారు"లేక వార్తాహరులై (*angeloi*; మత్తయి 25:41) యున్నారు, వీరి ద్వారా వాడు వాని పనులు కొనసాగించుచుండును. వాడు వాయుమండల అధిపతియై యున్నాడు (ఎఫెసీయులకు 2:2) మరియు ఈ లోకాధికారి లేక దేవతయై యున్నాడు (యోహాను 12:31; 2 కొరింథీయులకు 4:4). సాతాను శక్తులను పౌలు, "ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాథులు, ఆకాశమండలమందున్న దురాత్మల

సమూహము" అని సంబోధించాడు (ఎఫెసీయులకు 6:12బి). దేవుడు యేసు క్రీస్తు ద్వారా వారిపై విజయోత్సవము సాధించిన "ప్రధానులు మరియు అధికారులు" వీరే.

యేసు క్రీస్తు మరణము, పునరుత్థానము, మరియు ఆరోహణము ద్వారా దేవుడు చేసినదానంతటి చేత, ఆయన మరియు వారి ఆధీనములో నుండి ఆయన విడుదలగావించిన వారిపై అధికారము కలిగియున్నట్లు కనిపించుచుండిన సకల బలముల అధికారమును, ఆయన నిరాయుధులనుగా చేసాడు – అనగా, ఆయన "ఎత్తివేసాడు." యేసు ద్వారా వారి బలహీనతలను దేవుడు బట్టబయలుచేసాడు మరియు ఆయన బలమును బయలుపర్చాడు. ఈ కారణమునుబట్టి, క్రైస్తవులు (ఆత్మ) స్థైర్యము కలిగియుండగలరు. యేసు క్రీస్తు ద్వారా, మనము అపవాది అధికారము, సమస్త లోకాధికారులు, మరియు వాని నియంత్రణలో నున్న దుర్మార్గులపై విజయము సాధించగలము.

లోకమును జయించుటకు అవసరమైయున్న విజయము విశ్వాసము ద్వారా సాధింపదగును (1 యోహాను 5:4). కొలొస్సయులు దేవుని ప్రభావమందు కలిగియుండిన వారి విశ్వాసము చేత దుష్ట శక్తులపై విజయీభవులై యుండిరి. బాప్తిస్మములో వారు యేసు పునరుత్థాన విజయమును పంచుకొనిరి. ఆర్నాల్డ్ గమనిక ఇలా వున్నది:

> వారు తొల్దొలుత క్రీస్తులోనికి వ్యవస్థీకరింపబడినప్పుడు, కొలొస్సయులు దేవుని ఫలోత్పాదన శక్తిపై (గ్రీకు *energeias tou theou*; 2:12) – యేసు క్రీస్తును మృతులలో నుండి లేపుటకు చాలిన అధికారముపై – ఉండిన వారి విశ్వాసమును అదివరకే వినియోగించుకొన్నారు … మరియు ప్రధానులు మరియు అధికారుల యొక్క శక్తి యెడల వారికున్న భయమునుబట్టి పాఠకులు నానావిధములైన అభ్యాసములకు తమ్మునుతాము లోపరచుకొనకుండునట్లు, గ్రంథకర్త ఇప్పుడు "అధికారుల" పై దేవుని/క్రీస్తు శక్తిలో గల అదే విధమైన విశ్వాసమును సూచనప్రాయంగా ప్రోత్సాహించుచున్నాడు.[61]

### "సిలువచేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి, బాహాటముగా వేడుకకు కనుపరచెను" (2:15బి)

దేవుడు యేసు క్రీస్తు ద్వారా వారిపై సాధించిన విజయమునుబట్టి, ఆయనకు విరోధముగా నుండిన సకల బలముల బలహీనతను ఆయన బహిరంగముగా బట్టబయలుచేసి ప్రదర్శించాడు. "వేడుక" అనగా, ప్రధానులు మరియు అధికారుల అసలు స్వభావమును, వారి పూర్తి శక్తిమాలినతనమును మరియు వారి నిస్సహాయతను దేవుడు బయలుపర్చాడని పౌలు భావమై యున్నది. ఇలా చేయడంలో, ఆయన శక్తి ఎంత శక్తివంతమైనదో, దాని యెదుట వారు ఎంత బలహీనులై యున్నారో యను విషయమును ఆయన బహిరంగముగా ప్రదర్శించాడు. యేసు చేసిన కార్యము ద్వారా, సాతాను అధికారము క్రింద నున్న శక్తివంతమైన శక్తులను – వాటిని నాశనము చేయుట ద్వారా గాక, వాటిని స్వాధీనము చేసికొని, సర్వశక్తిమంతుడైన దేవుని కార్యములను తట్టుకొనగల సామర్థ్యము వారికి లేదని ప్రదర్శించుచు – దేవుడు వాటిని శక్తిహీనులనుగా చేసాడు.

సాతాను, భవిష్యత్తులోనికి చూడలేదు, సరికదా వాని యెదుట దాసోహమంటూ అణిగిమణిగియుండువారు సహితము చూడలేరు. కొరింథీయులకు వ్రాస్తు, "అది (దేవుని జ్ఞానము) లోకాధికారులలో ఎవనికిని తెలియదు అది వారికి తెలిసియుండిన యెడల మహిమాస్వరూపియగు ప్రభువును సిలువవేయక పోయియుందురు" అని పౌలు గ్రంథం

గావించాడు (1 కొరింథీయులకు 2:8). గతంలో వారు బలమైనవారుగా కనిపించారు, కానీ వారు బలహీనమును లోకములోని నిష్ప్రయోజనమైన విషయముల చేత నియంత్రింపబడుచున్నారని బట్టబయలయ్యింది (గలతీయులకు 4:9). దేవుడు విజయవంతముగా ప్రదర్శించిన, వారి ఓటమిని వారు ముందుగానే ఊహించుకొనలేకపోయారు.

యేసు మరణము ద్వారా వారు దేవుని ఓడించగలరని ఐహిక దుష్ట శక్తులు మరియు సాతాను సంబంధిత అధికారములు అనుకొన్నారు. యేసు సిలువవేయబడునట్లు చేయుట ద్వారా, వారు ఆయనను జయించారని వారు నమ్మారు. యేసు పునరుత్థానుడగునని వారు కలలోనైనా ఊహించుకొనలేదు! వారి సొంత దుర్నీతిమయమైన చర్యల మూలముననే వారు పరాజితులయ్యారు.

ఆయన ద్వారా (*en auto*) అను మాటలు ఈ సందర్భములో, "దాని" (KJV; NKJV; TNIV) కంటే, "సిలువ" కంటే ఎక్కువగా యేసును (RSV; NASB) సూచించుచున్నవి. వ్యాకరణ రీత్యా ఈ రెండు అర్థములు సాధ్యమే అని ఈ అనువాదములలోని అధస్సూచికలు సూచించుచున్నవి. అలాంటప్పుడు, అర్థమును నిర్ధారించుటకు సందర్భము మూలాధారమైనదై యుండవలెను. ముందటి వచనములలో (2:9–11, 12, 13) సమస్తము యేసులో మరియు యేసు ద్వారా సాధింపబడుచున్నందు వలన, యేసు ద్వారా చర్య తీసికొనుటకు దేవుడే కొనసాగుచుండుట ఇచ్చటి సందర్భమునకు సముచితంగా సరిపోతుందనుట సమంజసముగా నున్నది.

కనుపరచుట అని అర్థమిచ్చు గ్రీకు పదము, *deigmatizō,* బైబిలు సంబంధముకాని సాహిత్యములో అది బహిరంగ అవమానమును తెలియజేయు సందర్భములో ఉపయోగింపబడును. క్రొత్త నిబంధనలో ఈ పదము అగుపించు ఇతరమైన ఒకే ఒక చోటు, మరియు అవమానపరచనొల్లక ఆమెను బహిరంగముగా విడిచిపెట్టుటకు యోసేపు సమ్మతించని సందర్భమై యున్నది (మత్తయి 1:19).

యేసు సిలువ మీద మరణించుట ద్వారా ఆయన తలవంపుకు గురిచేయబడి బహిరంగముగా అవమానపర్చబడినప్పటికిని (హెబ్రీయులకు 12:2) పరాజయముగా ప్రతిబింబించుచుండిన పరిస్థితి దేవుడు పునరుత్థానములో మహిమాన్వితమైన విజయముగా మార్చాడు (అపొస్తలుల కార్యములు 2:24). యేసును సజీవునిగా చేయుట ద్వారా, ఆయన మరణమునకు ప్రోద్బలమిచ్చిన దుష్టశక్తుల నిరర్థకతను దేవుడు బట్టబయలు చేసాడు.

"జయోత్సవము" (*thriambeuō*) అను అలంకారము, మరొక చోట 2 కొరింథీయులకు 2:14లో మాత్రమే కనిపించుచున్నది, విజయిాభవులైన రోమా సైనికాధికారుల అభ్యాసమునకు పరోక్షముగా పేర్కొనబడుచున్న సాదృశ్యమై యున్నది.

> ఒక రోమా విజయోత్సవము కళ్ల ముందు విశదముగా నున్న ప్రతిరూపమును తానుపయోగించుకొనుట ద్వారా ఇప్పుడు పౌలు అధికారుల బహిరంగ ప్రదర్శన గూర్చిన అభిప్రాయమును అభివృద్ధిచేయుచున్నాడు. ఒక సైన్యాధికారి తన సైన్యమునకు ముందు నడుచుచు రణరంగములో దానిని విజయ పథంలో ముందుకు నడిపించునప్పుడు, తిరిగి వచ్చుచుండు సైన్యము వారి విజయమును ఒక "విజయోత్సవ ఊరేగింపుగా" (*thriambeuo*) వేడుకచేసికొనును. సఫలత సాధించిన సైన్యాధికారి వీధుల గుండా వెళ్లుచుండు కోలాహలంతో కూడిన ఊరేగింపునకు నాయకత్వము వహించును, అతని వెనుక

> వచ్చుచుండు సైన్యము విజయ గీతికలు గాన ప్రతిగానములు చేయుచు అట్టహాసంగా ఉల్లసించుచు ఊరేగింపులో పాల్గొందురు. పరాజయము పాలైన రాజు, బ్రతికి బయటపడిన సైనికులందరు మరియు కొల్లగొట్టబడిన సొమ్ముతో కూడ గుమికూడిన జనమంతా ఒక వినోద దృశ్యముగా వీక్షించునట్లు ఊరేగింపబడుదురు.[62]

దుష్ట శక్తుల ఓటమి గూర్చి చెప్పిన తరువాత, వారు పరాజితులై పరాభవము పాలైన సైన్యముగా ప్రదర్శింపబడుచున్నట్లు పౌలు వారిని చిత్రీకరించాడు. రోమా సైనికాధికారులు, విజయవంతమైన సైనిక మహోద్యమముల తరువాత, చెరగా పట్టబడినవారందరిని వస్త్రహీనులనుగా చేసి నగ్నతతో వారిని వీదుల గుండా కూడుకొనియున్న జనసమూహము ముందర ఊరేగించుదురు. ఓటమిపాలైన శత్రువులను చూచుచుండు ప్రజలు, వారికమీదట వీరికి భయపడాల్సిన అవసరం లేదని అర్థంచేసికొందురు.

దేవుడు యేసు క్రీస్తు ద్వారా దుష్టశక్తులను జయించినట్లుగా చిత్రీకరింపబడియున్నాడు. ఒక విజయోత్సవ ఊరేగింపులో, ఆయన – విజయీభవుడైనవాడు – వారంతా పరాజితులైనవారే యని ప్రేక్షకులందరికి చూపించుటకు వారిని బహిరంగముగా ప్రదర్శించును. ఓటమిపాలైనవారు వీధుల గుండా కాళ్లకు బొండములు బిగింపబడి ఒక గొప్ప గెలుపును సాధించిన ఊరేగింపుగా తీసికొనివెళ్లబడుచున్నట్లు, ఈ సాదృశ్యమును అక్షరార్థముగా తీసికొనకూడదు. అలా కాకుండా, ఓటమిపాలైందువలన స్వాధీనం చేసికొనబడిన దుష్టశక్తుల బట్టబయలు చేయబడుచున్నవని ఈ అలంకారము సూచించుచున్నది. "కానీ ఈ వాక్యభాగములో చేరియున్న అలంకారిక వాడకము దృష్ట్యా, వ్యక్తముచేయబడిన దానిని ఒక ఉపమానాలంకారముగా గుర్తించుట మరలా అవసరమై యుండును, ఉదా॥ 'సైనికుల కవాతులో వలె విజయోత్సవముతో నడిచి వెళ్లుచున్నట్లుగా.' "[63]

పైకి కనబడుచున్నట్లుగా, ఎఫెసీయులకు 4:8లో, వెవ్వేరు పదములను ఉపయోగించుచు, దుష్ట శక్తుల అదే ఓటమిని పౌలు వర్ణించుచున్నాడు. క్రీస్తు దేవుని కుడిపార్శ్వమునకు ఆరోహణమైనప్పుడు, సమస్త అధికారములు – మంచివి మరియు చెడ్డవి – ఆయన క్రింద ఉంచబడినవి (ఎఫెసీయులకు 1:20–22). ఆయన పునరుత్థానము మరియు ఆరోహణము ద్వారా దుష్ట శక్తులు జయింపబడినవి!

## అదనపు అధ్యయనము కొరకు

### 2:11:13లో బాప్తిస్మము, సున్నతికి సంపూర్ణముగా సమాంతరమైనదై యున్నదా?

2:11:13లో పౌలు సున్నతిని మరియు బాప్తిస్మమును పోల్చినప్పుడు బాప్తిస్మము, సున్నతికి సంపూర్ణముగా సమాంతరమైనదై యున్నదని ఆయన చెప్పుచుండెనా? లేదు, చెప్పుచుండలేదు. ఆయన ఒకే ఒక దృక్పథంతో ఈ రెండింటిని పోల్చుచుండెను: ఎలాగైతే భౌతిక సున్నతి కొంత మాంసమును తొలగించునో, అలాగే ఆధ్యాత్మిక సున్నతి ఆత్మకు అంటుకొనిన మలినమును తీసివేయును. (2:13బి గూర్చిన చర్చను చూడుము.)

ఈ రెండు అభ్యాసములు సంపూర్తిగా సమాంతరమైనవని వీటి మధ్య గల సారూప్యము అర్థమీయదు. బాప్తిస్మము ఉద్దేశము వేరు, సున్నతి ఉద్దేశము వేరు. సున్నతి యూదుల ఒడంబడిక ముద్రయై యుండినది, దేవుడు వారికి దేవుడైయున్నాడనియు, కనాను దేశమును

ఆయన వారికిచ్చుననియు అది గుర్తుచేయుచుండినది (ఆదికాండము 17:7, 8). బాప్తిస్మము, దానిని పొందినవారిని దేవుని పిల్లలుగా, అబ్రాహాము యొక్క ఆధ్యాత్మిక సంతానముగా చేయును, గనుక వారు అబ్రాహామునకు వాగ్దానము చేయబడిన పరలోక ఆశీర్వాదములను స్వాస్థ్యముగా స్వతంత్రించుకొందురు (గలతీయులకు 3:16, 29; 1 పేతురు 1:3, 4). పాత నిబంధన ఎక్కువ భౌతిక నైజములతో వ్యవహరించినది, క్రొత్త నిబంధన అనేక సందర్భములలో సంబంధితమైన ఆధ్యాత్మిక నైజములను నివేదించును.

ఈ పోలిక ఈ క్రింది విషయములను బయలుపర్చుచున్నది: భౌతిక జననము ద్వారా పిల్లలు ఒక హెబ్రీ కుటుంబము లోనికి జన్మించారు. మగ శిశువు దేవుని నిబంధన ప్రజలలో ఒకడని వానికి ముద్రవేయుటకు సున్నతి చేయబడినది. బాప్తిస్మము ఒకనిని దేవుని ఆధ్యాత్మిక కుటుంబ సభ్యునిగా చేయు ఆధ్యాత్మిక జననమై యున్నది. క్రైస్తవులు పరిశుద్ధాత్మ ద్వారా ముద్రింపబడియున్నారు ఏలయనగా వారు దేవుని పిల్లలై యున్నారు (గలతీయులకు 4:6).

| అభిప్రాయము | పాత నిబంధన (భౌతికము) | క్రొత్త నిబంధన (ఆధ్యాత్మికము) |
|---|---|---|
| 1. దేవుని పిల్లలలో ఒకరగుటకు జన్మము: | హెబ్రీ కుటుంబములోనికి భౌతిక జననము (లేవీయులకు 12:1, 2) | ఆధ్యాత్మిక జననము, దేవుని ఆధ్యాత్మిక కుటుంబములోనికి బాప్తిస్మము (యోహాను 3:5) |
| 2. పుట్టిన తరువాత వేయబడిన ముద్ర: | మానవుని చేత చేయబడిన సున్నతి ముద్రయై యుండినది, పుట్టిన మగ శిశువు దేవుని కుటుంబములో ఒక సభ్యుడని ముద్రవేసినది (రోమీయులకు 4:11 చూడుము). | పరిశుద్ధాత్మ దేవుని చేత వేయబడిన ముద్రయై యుండెను, నూతన విశ్వాసిని అది దేవుని కుటుంబ సభ్యునిగా ముద్రించినది (2 కొరింథీయులకు 1:22). |
| | అది అబ్రాహాము సంతానమునకు ఒక నిబంధన చిహ్నమై యుండినది (ఆదికాండము 17:11). | బాప్తిస్మము ద్వారా దేవుని పిల్లలైనవారికి పరిశుద్ధాత్మ ఒక ముద్రయై యున్నాడు (అపొస్తలుల కార్యములు 2:38; గలతీయులకు 3:26, 27; 4:6). |

సమాంతరము భౌతిక జన్మము, దాని వెనువెంట మానవుని చేత చేయబడిన సున్నతి ద్వారా వేయబడు ముద్రకును, ఆధ్యాత్మిక జన్మము, బాప్తిస్మము ద్వారా పొందుకొనబడి, దాని వెనువెంట దేవుని చేత వేయబడు పరిశుద్ధాత్మ వరమను ముద్రకును మధ్య నున్నది. సమాంతరము బాప్తిస్మమునకును సున్నతికిని మధ్య లేదు. దానికి బదులుగా, ఒక సమాంతరము భౌతిక జన్మము మరియు బాప్తిస్మము మధ్య చూడనగును, రెండవ సమాంతరము సున్నతి ముద్రకును పరిశుద్ధాత్మ ముద్రకును మధ్య ఉన్నది.

బాప్తిస్మము సంపూర్ణముగా సున్నతికి సమాంతరమైనదై యున్నట్లయితే, సున్నతి చేయబడినవారికి సంబందించిన దేవుని ఉపదేశములు బాప్తిస్మము పొందినవారికి సరిసమానంగా వర్తించును. ఈ ప్రకారమైతే, ఈ క్రింది విషయములు నిజమైనవై యుండును:

1. బాప్తిస్మము మగ వారికి మాత్రమే అవసరమగును (ఆదికాండము 17:10).
2. మగ శిశువులకియ్యబడు బాప్తిస్మము శిశువు పుట్టిన తరువాత ఎనిమిదవ దినమున ఇవ్వబడవలెను (ఆదికాండము 17:12).
3. అపేక్షింపబడు ఆశీర్వాదము కనాను దేశమై యుండును (ఆదికాండము 17:8), పరలోకము కాదు.
4. తత్ఫలితమైన ఒక భౌతిక "నిబంధన సంకేతము" ఉండవలెను, అది శాశ్వతమైనది మరియు దృశ్యమానమైనది (ఆదికాండము 17:11).
5. వారి నమ్మకములు మరియు జీవిత విధానముతో నిమిత్తము లేకుండా డబ్బులు చెల్లింపబడి కొనబడిన దాసులు బాప్తిస్మము పొందవలసినవారై యున్నారు (ఆదికాండము 17:13).
6. బాప్తిస్మము పొందనివారు సమాజములో నుండి వెలివేయబడవలెను (ఆదికాండము 17:14).
7. శిశువు వయస్సు దాటిన పురుషులకు వారు అబ్రాహాము సంతతివారై లేదా ఒక యూదుని చేత డబ్బు చెల్లింపబడి కొనబడిన బానిసయై యుండుట తప్ప, ముందుగానే కావలసినవి ఏవియును లేకుండా బాప్తిస్మమియ్యబడును (ఆదికాండము 17:27).

సున్నతి చేయబడుటకు వర్తించు అవే షరత్తుల ఆధారంగా బాప్తిస్మము ఇవ్వబడవలసి యున్నట్లయితే, బాప్తిస్మము పొందుచున్నవారికి ముందుగానే కావలసియున్నవని బైబిలు చెప్పుచున్న విషయములు వారికి అవసరమై యుండవు. ఏదిఏమైనా, బాప్తిస్మము ద్వారా నేడు ఆయన పిల్లలగుచున్నవారు ఈ క్రింది పనులు చేయవలసి యుండునని నూతన నిబంధన బోధించుచున్నది:

1. దేవుని వాక్యమును అంగీకరించవలెను (అపొస్తలుల కార్యములు 2:41; 18:8).
2. క్రీస్తునందు విశ్వసించవలెను (మార్కు 16:15, 16; అపొస్తలుల కార్యములు 8:12; 18:8).
3. బాప్తిస్మము పొందక మునుపు మారుమనస్సు నొందవలెను (అపొస్తలుల కార్యములు 2:38).
4. నూతన జీవముతో నడుచుకొనునట్లు లేపబడవలెను (రోమీయులకు 6:4).

**మనము పాపిష్ఠి స్వభావము కలిగియున్నామా?**

"పాపిష్ఠి స్వభావము" గూర్చిన భావము, ఆదాము హవ్వ నుండి సంక్రమించిన భ్రష్టుపట్టిన స్వభావముతో మానవజాతి జన్మించినదను వేదాంతపరమైన ప్రతిపాదనయై యున్నది. మంచి చెడుల తెలివినిచ్చు చెట్టు నుండి ఫలములు తినుట ద్వారా వారు పాపిష్ఠి స్వభావమును పొందుకొన్నారను తుది అభిప్రాయము మీద అది కట్టబడినది (ఆదికాండము 3:6). ఏదిఏమైనా, వారి స్వభావము భ్రష్టుపట్టినదిగా అయ్యిందని, బైబిలు సంబంధమైన

గ్రంథపాఠములోనిది ఏదియు బోధించదు. వారు మంచి చెడుల తెలివినిచ్చు చెట్టు ఫలములను తినినట్లయితే, వారు మరణించుదురని దేవుడు వారికి తెలియజెప్పాడేగాని, వారు అపవాది కలిగియున్నటువంటి చెడు స్వభావమును అభివృద్ధి చేసికొందురని చెప్పలేదు (ఆదికాండము 2:17).

ఆదాము మరియు హవ్వ వారి స్వభావములో భ్రష్టుపట్టినవారు కాలేదని బైబిలు సంబంధమైన రెండు ఘోషణలు సూచించుచున్నవి. (1) *ఆదికాండము 3:7-10.* వారు నిషేధింపబడిన ఫలమును తినక మునుపు, వారు దిగంబరులై యుండిరి కానీ సిగ్గునెరుగరైరి (ఆదికాండము 2:25). వారు ఆ ఫలమును తినిన తరువాత, వారు దిగంబరులై యున్నారని గ్రహించారు. గనుక స్వభావము భ్రష్టుపట్టిన ప్రజలు చేసియుండునట్లు, వారు దిగంబరత్వమును ప్రదర్శించుటకు బదులుగా, సిగ్గునొందారు: వారు దాగుకొని అందుబాటులో నుండిన వస్త్రములతో తమ్మునుతాము కప్పుకొనుటకు ప్రయత్నించారు. వారి స్వభావము భ్రష్టుపట్టినదై యుండినట్లయితే వారు సిగ్గునొందునట్లుగాని లేదా ఏదైన వస్త్రములను వెదకునట్లుగాని వారి మనస్సాక్షి వారిని ప్రోత్సాహించి యుండవు. (2) *ఆదికాండము 3:22ఎ.* దేవుడు "ఇదిగో, మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము [మానవుడు] మనలో ఒకనివంటివాడాయెను" అని సెలవిచ్చాడు. మంచి మరియు చెడులనగా ఏమిటో దేవుడు ఎరుగును గనుక ఆయన భ్రష్టుపట్టిన స్వభావముగలవాడు కాదు. ఆదాము మరియు హవ్వ మంచి చెడులను తెలిసికొనిన తరువాత, ఇప్పుడు వారు నైతిక ఎంపికలు ఎదుర్కొనవలసి వచ్చినది. ఫలము తినినప్పుడు, వారు నైతిక అమాయకత్వ పరిస్థితిని పరిత్యజించినందువలన వారికి నైతిక గ్రాహ్యము కలుగు పరిస్థితి వారిలో ఏర్పడినది. గనుక ఆనాటి నుంచి, వారు మంచి చెడుల మధ్య ఎంపిక చేసికొనక తప్పలేదు. దాదాపుగా, వెనువెంటనే వారు ఒక మంచి ఎంపిక చేసికొన్నారు – తమ్మునుతాము అందుబాటులో నుండిన వస్త్రములతో కప్పుకొన్నారు, అనగా వారు చెడును కాదు, కానీ మంచిని చేయవలెనని ఆశించారని అర్థమగుచున్నది.

ఆదాము మరియు హవ్వ చెడ్డవారయ్యారని చెప్పుటకు బదులుగా, వారు మంచి స్వభావమును అలవర్చుకొన్నారని మనము తర్కబద్ధంగా అభిప్రాయపడవచ్చును ఏలయనగా వారు మంచి మరియు చెడు గూర్చిన తెలివిని సంపాదించుకొన్నారు. అట్లయినప్పటికిని, వారు నిషేధింపబడిన చెట్టు ఫలము తినుట వలన పర్యవసానముగా, వారి సంతానము – సమస్త మానవులు – మంచి చెడుల గూర్చిన ఎరుకను యుక్త వయస్సులో అభివృద్ధిచేసికొని (ద్వితీయోపదేశకాండము 1:39) ఎట్టకేలకు భౌతిక మరణము పాలగుదురు. ఆదాము మరియు హవ్వ చేసిన పాపము యొక్క ఫలితములను మనము అనుభవించుదుము, కానీ మనము వారి అపరాధిత్వమును భరించము. అయితే మనము అనుభవించు పర్యవసానము – మరణము (1 కొరింథీయులకు 15:22) మరియు మనము నైతిక ఎంపికలు చేసికొనవలెను (యెషయా 7:16).

కొలొస్సయులకు 2:11లో పేర్కొనబడిన "క్రీస్తునందలి సున్నతి" స్వతస్సిద్ధమైన పాపిష్ఠి స్వభావమును తీసివేయదు ఏలయనగా తీసివేయుటకు స్వతస్సిద్ధమైన పాపిష్ఠి స్వభావము మానవాళికి లేదు. విశేషంగా, తప్పుడు నైతిక మరియు ఆధ్యాత్మిక ఎంపికలనుబట్టి, శరీరేచ్ఛలు మరియు పాపిష్ఠి పనులకు లోబడుట ద్వారా అభివృద్ధి చేసికొనబడి పోగైన మలినమును ఆధ్యాత్మిక సున్నతి తొలగించును.

అందరు పాపము చేసారు, కానీ రోమీయులకు 3:9, 19, 23లోని "అందరు" అను పదము ఆనాడు, ఆ సందర్భములో చర్చింపబడుచుండినవారందరి గూర్చి ప్రస్తావించుచున్నదని అర్థంచేసికొనవలెను. పాపము చేయుటకు సామర్థ్యము కలిగియున్న వారు "అందరు" పాపము చేసారు, కానీ పాపము చేయు సామర్థ్యము "అందరికి" లేదు (యోహాను 9:41). తప్పొప్పులను గ్రహించుటకు పసిపాపలు మరియు కొందరు వయస్సు వచ్చినవారికి మానసిక సామర్థ్యము కొదువగా నుండును. పరలోక రాజ్యము చిన్నపిల్లలదే (మత్తయి 19:14); గనుక వారు పరలోక రాజ్యములో ప్రవేశించుటకు తిరిగి జన్మించవలసిన అవసరంలేదు (యోహాను 3:5).

జీవితంలో నైతిక పరిపూర్ణతకు చేరుకొనువారందరు పాపము చేసారని పౌలు ప్రస్తావించాడు (రోమీయులకు 3:23) గనుక వారికి "క్రీస్తునందలి సున్నతి" అవసరమై యున్నది. శరీరేచ్ఛలు మరియు తత్ఫలితంగా చేయబడు పాపములు, "క్రీస్తునందలి సున్నతి"ని అర్థంచేసికొని దానిని ఆధ్యాత్మికముగా అమలుచేయువారికి మాత్రమే తీసివేయబడును.

మానవ జాతి స్వతస్సిద్ధముగా పాపిష్ఠి స్వభావము కలిగియున్నదని బోధించువారు రోమీయులకు 7:18-23లో గల వాక్యభాగమునకు తప్పుడర్థము చెప్పుచున్నారు. ఆయన పాపము చేయునట్లు ఆయనలోని పాపిష్ఠి స్వభావము ఆయనను ప్రేరేపించుచుండినదని పౌలు చెప్పలేదు. విశేషంగా, "కావున, ఇకను దాని చేయునది నాయందు నివసించు పాపమే, గాని నేను కాదు" అని చెప్పాడు (రోమీయులకు 7:17). ఈ వాక్యము వ్రాయబడిన గ్రీకు నిర్మాణములో "కాదు ... కానీ" అను పదములు వాడబడినవి. ఈ విధమైన వాక్యనిర్మాణ (*mē ... alla* లేక *ou ... alla*) క్రొత్త నిబంధనలో అనేక పర్యాయములు చూడదగును (యోహాను 6:27; 1 తిమోతి 5:23; 1 పేతురు 3:3, 4). ఆ యా వాక్యములలో రెండవ భాగము నొక్కిచెప్పబడుచున్నది, అలాగని మొదటి భాగము మినహాయింపబడినదని అర్థము కాదు. "చేయుచుండినది కేవలము నేను కాదు, కానీ నాలో నివసించు పాపమే" అని పౌలు చెప్పుచుండెను.

ఆయన పాపము చేసాడని పౌలు అంగీకరించుచుండెను; ఏదిఏమైనా, పాపము చేయవలెనని ఆయన కోరలేదు (రోమీయులకు 7:15-21). ఆయనలో భ్రష్టుపట్టిన స్వభావము ఉండియున్నట్లయితే, ఆయన చేయవలెనని ఆశించేవాడు. ఆయన పాపము చేయునట్లు ఆయనను ప్రోత్సాహించుచుండినది పాపిష్ఠి స్వభావము కాదు కానీ పాపమే. యేసు విశదము చేసినట్లే (యోహాను 8:34), పేతురు వర్ణించినట్లే (2 పేతురు 2:19), పౌలు అంతకు మునుపు రోమీయులకు 6:16లో, పాపము ఒకనిని దానికి బానిసగా చేసికొనుటకు కలిగియుండిన స్వభావము గూర్చి చర్చించాడు. అందరు వారి జీవితములలో పాపమును అనుమతించినందువలన, ప్రతి వాడు పాపముతో పోరాడుచున్నాడు - కానీ పాపిష్ఠి స్వభావముతో కాదు.

## "శరీరము" (*SARX*) అనగా "పాపిష్ఠి స్వభావము" అని అర్థమా?

*Sarx* అను పదము యొక్క నానావిధ రూపములు గ్రీకు క్రొత్త నిబంధనలో దాదాపుగా 150 సార్లు కనిపించును. ఈ వాక్యభాగములలోని అత్యధిక శాతము "పాపిష్ఠి స్వభావము" అని అర్థమై యుండదు. ఉదా॥ యేసు *sarx* "శరీరము" అయ్యాడు (యోహాను 1:14);

ఆయన "శరీరము" మనకు జీవాహారమై యున్నది (యోహాను 6:51), మనము జీవము కలిగియుండుటకు దానిని మనము (ఆధ్యాత్మికముగా) భుజింపవలసి యున్నది (యోహాను 6:53-56). యేసు "శరీరము" కుళ్లిపోలేదు (అపొస్తలుల కార్యములు 2:31). ఆయన "శరీరము"నుబట్టి దావీదు మరియు మన పితరుల సంతతివాడై యుండెను (రోమీయులకు 1:3; 9:5). యేసు "సశరీరుడు"గా బయలుపరచబడిన దేవుడై యుండెను (1 తిమోతి 3:16) మరియు "శరీర విషయములో" చంపబడెను (1 పేతురు 3:18). "పాపిష్ఠి స్వభావము" పేర్కొనబడిన ఈ సందర్భములకు సరిపడదు.

ఒకరు పవిత్రమైన లేదా అపవిత్రమైన ఉద్దేశములకు ఉపయోగింపబడగల శరీరము కలిగియున్న వ్యక్తియై యున్నాడని సూచించుటకు *sarx* అను పదము వాడబడినప్పుడు, అది మంచి లేక చెడు "శరీరేచ్ఛలు" అని అర్థమిచ్చును. సందర్భమునుబట్టి మాత్రమే అర్థము నిర్ధారింపబడగలదు (అపొస్తలుల కార్యములు 2:26; రోమీయులకు 8:7). మానవులు నైతిక నిర్ణయములు తీసికొనవలసి వచ్చినప్పుడు, ఇటువంటి ఇచ్ఛలు సాధారణంగా చెడ్డవై యుండును. ఇటు దాని అర్థము నిశ్చయాత్మకమైనదై యుండుట కంటే అతి తరుచుగా వ్యతిరేకార్థమైనదై యుండును.

ప్రధానమైన గ్రీకు పదకోశము, నిఘంటువు, లేక విజ్ఞాన సర్వస్వము, వీటిలో ఒక్కటైనను *sarx* అను పదమును "పాపిష్ఠి స్వభావము" అని నిర్వచించుట లేదు. "పాపిష్ఠి స్వభావము" నకు అతి సమీపంగా నున్న ప్రస్తావన రోమీయులకు 7:5లోని "పాపేచ్ఛలు" అయియున్నది. ఈ సంధర్భములో సహితము, పౌలు పాపిష్ఠి "శరీరము"ను (*sarx*) సూచించలేదు, కానీ పాపిష్ఠి "ఇచ్ఛలను (*pathēmata*) సూచించాడు. శరీరావయముల ద్వారా పనిచేయుచు పాపేచ్ఛలను రెచ్చగొట్టినది "శరీరము" కాదు, "ధర్మశాస్త్రమే."

పాపమునకు మానవుని ఇచ్ఛలతో సంబంధమును జోడించుచు, పదకోశములు ఈ క్రింద ఈయబడినటువంటి నిర్వచనముల నిచ్చుచున్నవి: "శరీరమున్న ప్రతి చోట, (అదే రీతిగా) సమస్త విధములైన పాపములుండునంతగా (శరీరము) పాపము చేత చెలాయింపబడుచున్నదై యున్నది, గనుక *sarx*లో ఏ మంచి విషయమైనను నివసింపనేరదు.[64] "పాపిష్ఠి శరీరము" అనునది సాధ్యమగు అనువాదమని సలహా ఇవ్వబడినది, కానీ ఎక్కడైనను "పాపిష్ఠి స్వభావము" అని వాడబడలేదు.

*Sarx* గూర్చిన తన చర్చ యొక్క సారాంశముగా, ఎడుఅర్డ్ స్క్వీజర్ ఇలా వ్రాయుచున్నాడు, "ఇందు మూలమున శరీరము ఇతరమైన ఐహిక విషయములకు భిన్నమైనదనియు, అది స్వతస్సిద్ధముగా, చెడ్డదై లేక ముఖ్యముగా అపాయకరమైనదై యున్నదనియు భావింపవలసిన ఒక పరిధి కాదు. మానవుడు వాని జీవితమును దానిని ఆధారంగా చేసుకొని కట్టుకొన్నప్పుడు మాత్రమే అది చెడ్డదౌతుంది."[65]

మెక్‌డొనాల్డ్ ఇలా చెప్పుచున్నాడు,

> అట్లయినప్పటికిని, "శరీరము" - *sarx* - మానవుడు దేవుడు సృజించిన ఒక జీవియై యున్నందువలన అది మానవుని బలహీనతలకు కేవలము ఒక పేరు కాదు. నిజమే, శరీరము భ్రష్టుపట్టినదై యున్నది (1 కొరింథీయులకు 15:53, KJV) గనుక అది మరణించుటకు ఆస్పదములున్నవి (2 కొరింథీయులకు 10:2). అట్లయినప్పటికిని, *sarx* గూర్చి ఆయన కలిగియున్న అభిప్రాయమునకు అధిక నిర్మాణాత్మకమైన ఒక నైతిక

అంశమును చేర్చుచున్నాడు. ఇట్లు, శరీరమే పాపిష్ఠిది కానప్పుడు, మానవుని స్వభావములోని ఆ భాగమే పాపమునకు తావిచ్చుచున్నది. పాపము దాని పని అది చేసుకొనుటకు సంసిద్ధం చేయబడిన మూలాధారమును అది సమకూర్చును. దేనితోనైతే పాపము సంఘర్షణ పడుతుంతో, దేనికైతే అది తననుతాను అనుబంధంగా అతికిపోతుందో, *sarx* [శరీరము] మానవునిలోని ఆ మూలకము [ధాతువు] విషయమై యున్నది. విశాస దృక్పథంతో చూచినట్లయితే, పదార్థము యొక్క అనివార్యమైన చెడుకు సంబంధించిన ఆత్మజ్ఞానముతో కూడిన ఏ అభిప్రాయమును పౌలు బోధించుటలేదు కానీ, శరీరమనునది దాని లోనికి ఏదో ఒక విధంగా చెడు చొచ్చుకొనిపోయి వ్యాపించిన సాధనమై యున్నదనియు, అది "శరీర సంబంధమైన కార్యముల" ద్వారా బయలుపర్చబడుననియు ఆయన పరిగణించుచున్నాడు (పోల్చి చూడు గలతీయులకు 5:19; మొ.).[66]

మానవులు బలహీనులై యున్నారు గనుక వారు పాపము చేయుటకు ఉన్ముఖులై యున్నారు కాబట్టి, చెడు చేయుటకు మనము పాపిష్ఠి స్వభావము చేత బలవంతము చేయబడము. ఎన్నో యేళ్ళ క్రితం యెహోషువ సవాలు చేసినట్లుగా (యెహోషువ 24:15), మనము ఎవరిని సేవింపగోరుదుమో తప్పనిసరిగా ఎంపికచేసికొనవలసి యున్నది.

**శిశువులకు బాప్తిస్మమియ్యవలెనా?**

శిశువులకు బాప్తిస్మమియ్యవలెనని చెప్పుటకు కొలొస్సయులకు 2:11, 12 ఒక "ఋజువు"గా ఉయోగింపబడుచున్నది. విల్యమ్ హెండ్రిక్సన్ ఇలా వ్రాయుచున్నాడు,

> శిశువులకు బాప్తిస్మమియ్యవలెనని ఆయన అనుకొనుటకు గల హేతువేమిటో విరించుటకు ఆయన ప్రయత్నించుచు ఒక స్పష్టమైన అంతర్భావము గూర్చి నేనిక్కడ మాటలాడుచున్నాను. వివరింపబడి యున్నట్లుగా, అక్షరార్థం అనగా, చేతులతో చేయబడిన సున్నతికిని చేతుల జోక్యము లేకుండా చేయబడిన సున్నతికిని, అనగా హృదయమందు చేయబడిన సున్నతికిని, మధ్య గల భేదము వాటి పైపై తారతమ్యమై యున్నది. అయితే వాటి అంతర్భావము సహితము విషదముగా నున్నది. అందుచేత, ఈ క్రింది ప్రకటన సరైనదై యున్నది: "అలాంట ప్పుడు, సున్నతి స్థానములో బాప్తిస్మము అమలుచేయబడినది (కొలొస్సయులకు 2:11-13) గనుక, దేవుని రాజ్యమునకు మరియు ఆయన నిబంధనకు వారసులుగా, చిన్న పిల్లలకు బాప్తిస్మమియ్యబడవలెను" (*Form for the Baptism of Infants in Psalter Hymnal of the Christian Reformed Church*, పేజీ 86 యొక్క భక్తి కీర్తన పుస్తకములోని శిశు బాప్తిస్మ పత్రము). దేవుడు అబ్రాహాముతో నిబంధన చేసినప్పుడు ఆ నిబంధనలో పిల్లలు సహితము చేర్చబడియుండిరి (ఆదికాండము 17:1-14). ఈ నిబంధన, దాని ఆధ్యాత్మిక కోణాల్లో, క్రొత్త దైవపరిపాలనా విధానములో కొనసాగినది (అపొస్తలుల కార్యములు 2:38, 39; రోమీయులకు 4:9-12; గలతీయులకు 3:7, 8, 29). కాబట్టి ఎలాగైనా పిల్లలు కలుపుకొనబడి యున్నారు గనుక ఈ సంకేతమును వారు నేటికినిపొందుచున్నారు, ఇది వర్తమానకుల దైవపరిపాలనా విధానములో, పౌలు కొలొస్సయులకు 2:11, 12లో విషదము చేయుచున్నట్లుగా, బాప్తిస్మమై యున్నది.[67]

అపొస్తలుల కార్యములు 2:39లో పేర్కొనబడిన "పిల్లలు," శిశువులు కాదు కానీ సంతానమై యున్నారు. పేతురు భావము శిశువులు అయియున్నట్లయితే, *brephos* ("శిశువు")కు లేక *paidion* ("చిన్న బిడ్డకు")కు సంబంధించిన ఒక రూపము ఉపయోగింపబడి యుండేది. పేతురు, "వంశస్థుడు" లేక "సంతానము" అని అర్థమిచ్చు *teknon* అను

పదమును ఉపయోగించాడు. పాపక్షమాపణ మరియు పరిశుద్ధాత్మ వరము ఇశ్రాయేలు సంతానము కొరకు నియుక్తమైనవై యుండినవి. ఈ ఆశీర్వాదములు బాప్తిస్మము పొందక మునుపే పశ్చాత్తాపపడువారికి మాత్రమే (అపొస్తలుల కార్యములు 2:38). పరిశుద్ధాత్మ, శిశువులకు వాగ్దానము చేయబడలేదు.

కొలొస్సయులకు 2:11-13 శిశు బాప్తిస్మమునకు ప్రోత్సాహమునియ్యదు. దీనికి ప్రతికూలంగా, ఈ వాక్యభాగము శిశు బాప్తిస్మమును మినహాయించుచున్నది. శరీరేచ్ఛలు బాప్తిస్మమను ఆధ్యాత్మిక సున్నతి ద్వారా తొలగింపబడును; కానీ శిశువులకు అప్పుడే శరీరేచ్ఛలనునవి లేవు/కలుగవు, సరికదా వారు శరీరకార్యములేవియు చేయలేరు (గలతీయులకు 5:19-21). అమాయకంగా గడిచిపోవుచుండు వారి బాల్య దినములయందు, మంచి చెడుల ఎరుక ఏమియు ఉండదు (ద్వితీయోపదేశకాండము 1:39). ఈ నైతిక అంధత్వమునుబట్టియే, క్షమింపబడుటకు వారు ఏ పాపము చేయరు (యోహాను 9:41). ఈ హేతువు మూలమున, వారు "పాపమువలన చచ్చినవారు" కారు. పాపము వలన మరణము చెడు కోరికలకు లోబడుట వలన కలుగును (యాకోబు 1:13-15). వారు పాపములో చచ్చినవారు కారు, గనుక వారు మరలా జీవింపజేయబడవలసిన అవసరం లేదు (కొలొస్సయులకు 2:13). అంతమాత్రమేగాక, వారు బాప్తిస్మముతో జోడింపబడవలసియున్న విశ్వాసము కొరకు (కొలొస్సయులకు 2:12) "దేవుని ప్రభావమందు విశ్వాసముంచలేదు."

బాప్తిస్మము పొందుటకు ముందుగా కావలసియున్న విషయములలో చిన్నపిల్లలు నెరవేర్చని ఆవశ్యకతలున్నవి. బాప్తిస్మము పొందగోరువారికి మొదట సువార్త బోధింపబడవలెను (మార్కు 16:15, 16); వారు దేవుని వాక్యమును విని దానిని అంగీకరింపవలెను (అపొస్తలుల కార్యములు 2:41; 18:8); విశ్వాసముంచవలెను (మార్కు 16:15, 16; అపొస్తలుల కార్యములు 8:12; 18:8); మారుమనస్సు పొందవలెను (అపొస్తలుల కార్యములు 2:38); మరియు యేసు దేవుని కుమారుడని ఆయనయందు వారికున్న విశ్వాసమును ఒప్పుకొనవలెను (రోమీయులకు 10:9, 10; 1 తిమోతి 6:12).

బాప్తిస్మము పొందినవారిని గూర్చి నమోదు చేయబడిన ఉదాహరణములలో వయస్సు వచ్చినవారైన స్త్రీపురుషులున్నారు, కానీ శిశువులు లేరు (అపొస్తలుల కార్యములు 8:12). దేవుడు వారికి మంచి మనస్సాక్షి నియ్యవలెనని వారు ఆయనకు మొరపెట్టుచుండినవారై యుండిరి (1 పేతురు 3:21). శిశువులు ఈ విషయాలన్నిటిని నెరవేర్చలేరు గనుక, వారు బాప్తిస్మమీయబడుటకు తగిన అభ్యర్థులు కారు.

శిశు బాప్తిస్మమును సమర్థించుచు చేయబడు మరొక తర్కము "ఇంటివారందరు" బాప్తిస్మము పొందిరి అను మాటల్లో పిల్లలు కూడ కలుపుకొనబడియున్నారను ప్రకటనపై ఆధారపడియున్నది. అనగా ప్రతి "ఇంటివారందరు"లో శిశువులుంటారని ఇది ముందుగానే భావించుకొనుచున్నది. కానీ నమోదు చేయబడిన "ఇంటివారందరు" బాప్తిస్మ సందర్భములు శిశువులకు సహితము బాప్తిస్మమియ్యబడినదని చూపించుటలేదు.

(1) అపొస్తలుల కార్యములు 2:36-41. ఇశ్రాయేలు వంశమునకు చెందినవారు *మారుమనస్సు నొందిన తరువాత బాప్తిస్మము* పొందవలెనని ఆదేశింపబడ్డారు. మేమేమి చేయవలెను? అని వారడిగారు. బాప్తిస్మము పొందుకొనినవారు దేవుని వాక్యమును అంగీకరించారు. శిశువులు ఈ పనులు చేయలేరు గనుక బాప్తిస్మమియ్యబడిన వారిలో

కలుపబడి యుండరు.

(2) అపొస్తలుల కార్యములు 10. కొర్నేలీ ఇంటివారు దేవునియందు భయభక్తులు కలిగినవారై పేతురు సందేశమను ఆలకించుటకు ఆతురపడ్డారు. వారు క్షమింపబడునట్లు, విశ్వసించవలెనని బోధింపబడిరి. వారు దేవునివాక్యము విని దానిని అంగీకరించారు (11:1). అప్పుడు వారు పరిశుద్ధాత్మను పొందుకొని అన్యభాషల్లో మాటలాడారు. చివరకు, పేతురు వారితోకూడ కొంత కాలము ఉండవలెనని వారు మనవిచేసారు. ఈ ప్రకటనలనుబట్టి ఆ ఇంటిలో శిశువులు లేరని అర్థమగుచున్నది.

(3) అపొస్తలుల కార్యములు 16:14, 15. లూదియ ఇంటివారిలో బహుశా శిశువులు ఉండియుండరు, ఏలయనగా లూదియ "మా ఇంటికి"/"ఇంటివారు" అని పలుకుటకు బదులుగా, "ఆమె యింటివారు," అనియు "నా యింటికి" అనియు పలుకుచున్న విషయమును లూకా ప్రస్తావించుచున్నాడు. ఆమెకు భర్త లేడను భావము స్పష్టమగుచున్నది. ఏది ఏమైనా, ఆమె ఇంటివారిలో దాసులు లేక బానిసలు కలుబడియుందురు.

(4) అపొస్తలుల కార్యములు 16:23–34. ఆయన మరియు తన ఇంటివారందరు రక్షణ పొందునట్లు వారు విశ్వాసముంచవలెనని పౌలు మరియు సీల ఫిలిప్పీ చెరసాల అధికారికి తెలియజెప్పారు. అప్పుడు పౌలు మరియు సీల, ఇంటివారికందరికి, దేవుని వాక్యమును – స్పష్టముగా, రక్షణ పొందుటకుచేయవలెనని యేసు చెప్పిన ఉపదేశములను (మార్కు 16:15, 16) – బోధించారు. దీని వెనువెంట, చెరసాల అధికారి మరియు అతని ఇంటివారందరు విశ్వాసముంచారు, బాప్తిస్మము పొందుకొన్నారు. గనుక వారందరు ఆనందించారు. పౌలు దేవుని వాక్యమును శిశువులకు బోధించియుండడు, సరికదా బోధించినా కూడ వారు విశ్వసించలేరు – అట్లయినను పౌలు "అతనికి అతని ఇంటనున్నవారికందరికని" దేవుని వాక్యము బోధించాడు.

(5) అపొస్తలుల కార్యములు 18:8. క్రీస్తు (ఆయనకు పౌలు వ్యక్తిగతముగా బాప్తిస్మమిచ్చాడు; 1 కొరింథీయులకు 1:14) వాక్యము విని, తన ఇంటివారందరితోకూడ ప్రభువునందు విశ్వసించాడు. విశ్వసించగల సామర్థ్యము శిశువులకు లేదు.

(6) 1 కొరింథీయులకు 1:16. ఆయన స్తెఫను ఇంటివారికి బాప్తిస్మమిచ్చాడని పౌలు రచించాడు. ఇందులో చేర్చబడలేదు, ఏలయనగా స్తెఫను ఇంటివారు "పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు తమ్మునుతాము అప్పగించుకొని యున్నారు" (1 కొరింథీయులకు 16:15).

ఆది సంఘములో శిశులు బాప్తిస్మమియ్యబడిరని బైబిలులో ఎక్కడను ఒక ఉదాహరణము వ్రాయబడలేదు. శిశువులకు బాప్తిస్మము అవసరమనిగాని లేక వారు బాప్తిస్మము పొందుకొనవలెననిగాని బాప్తిస్మము పొందుకొనక పూర్వము అవసరమై యున్న విషయములు వారిని వారించుచున్నవి.

## అన్వయము

**మనయందున్న క్రీస్తు**

క్రైస్తవుల జీవితములలో కనబడవలసిన క్రీస్తు ప్రాముఖ్యతలో గల పరిజ్ఞానము ఇవి ఒకదానితో మరొకటి కలిగియున్న సంబంధములో చూడనగును. క్రైస్తవులమైన మనము,

దేవుని ప్రణాళికలో గల పరిజ్ఞానమును క్రీస్తు ద్వారా సంపాదించుకొనవలసి యున్నది (2:2). మనము ఆయనతో కూడ జీవింపబడినవారివలె (2:6) మరియు మనము వృద్ధిపొందునట్లు మన శిరస్సు వలె ఆయనను హత్తుకొన్నవారమై (2:13) క్రీస్తు నందు నడుచుకొనవలెను (2:19). యేసు మాటలు మనయందు నివసించుచుండవలెను (3:16). మనము ఇతరులతో కలిగియుండు సంబంధములు మనము క్రీస్తుతో కలిగియుండు సంబంధముపై ఆధారపడవలెను: భార్యలు తమ భర్తలతో "ప్రభువునుబట్టి యుక్తమైన" సంబంధము కలిగి యుండవలెను (3:18); పిల్లలు వారి తల్లిదండ్రులకు "ప్రభువునుబట్టి మెచ్చుకొనదగినట్లుగా" లోబడవలెను (3:20); బానిసలు వారి యజమానులకు "ప్రభువునకు భయపడుచు" లోబడవలెను (3:22); మరియు వారికిని "పరలోకములో యజమానుడున్నాడు" అని ఎరిగినవారై, యజమానులు వారి బానిసలను బాగుగా చూచుకొనవలెను (4:1). ప్రతి పరిచర్య ప్రభువునిమిత్తమని, హృదయపూర్వకముగా చేయబడవలెను (3:23).

**మానవ కల్పిత నియమములను అనుసరించుటకు తృణీకరించుట (2:8)**

జ్ఞానమునకు తెలివికిని యేసే మూలాధారమై యున్నాడని మనము జ్ఞాపకముంచుకొనవలెను. మానవ సాంప్రదాయములు మోసకరమైనవి. మానవ జ్ఞానము మరియు తెలివిపై ఆధారపడు క్రైస్తవుడు, ఆత్మ తృష్ణను తీర్చు నిజమైన జీవజలములను విడిచిపెట్టి మలినమైన, మురికి ఆలోచనలను నీటి వైపునకు మళ్లుచున్నాడాని అర్థము. ఇశ్రాయేలీయులు ఆయనను, జీవజలముల ఊటయైనవానిని, విడిచిపెట్టి నీళ్లు నిలవని బద్దలైన తొట్లవైపు మళ్లారని దేవుడు బయలుపర్చాడు (యిర్మీయా 2:13).

విశ్వాస సూత్రములు, అధికారములో నున్నవారు అమలుపర్చు ఆదేశములు, మరియు మానవ సాంప్రదాయములు విస్తారమైన కోత ఫలించునట్లు తీసివేయబడవలసియున్న పొలములోని ముండ్ల తుప్పలు మరియు కలుపు మొక్కల వలె ఉన్నవి. అవి నిర్మలమైన నీటిలోనికి ప్రవేశించిన కాలుష్యము వలె లేక స్వస్థతను కలుగజేయు ఔషధమునకు కలుపబడిన విషము వలె ఉన్నవి. క్రైస్తవులు యేసు బోధించిన యథార్థమైన బోధలు మాత్రమే అంగీకరించవలెను. రక్షించగలది, అదొక్కటే.

**యేసు సంపూర్ణ దైవత్వమును కలిగియున్నాడు (2:9)**

స్వభావములో యేసు తండ్రికి తక్కువైనవాడేమీ కాదు. ఆయన సమస్త మానవజాతిని అత్యధికంగా మించి యున్నాడు. ఈ కారణమునుబట్టియే, ఆయన యెడల అత్యున్నతమైన ఆదరణ మరియు గౌరవము ప్రదర్శింపబడవలెను. ఆయన ఆరాధింపదగినవాడై యున్నాడు. ఇరువది నలుగురు పెద్దలు యేసు, గొఱ్ఱెపిల్ల (ప్రకటన 5:8) యెదుట సాగిలపడ్డారు, మరియు వారితోపాటు పరలోక సైన్యసమూహము ఆయనకును తండ్రికిని ఘనమైన గౌరవమును ఇచ్చారు (ప్రకటన 5:11-14). వారు ఆయన ఆరాధింపవలెనని దేవదూతలు హెచ్చరింపబడిరి (హెబ్రీయులకు 1:6).

దేవత్వముగలవాడుగా, ఆయనకు మానవత్వ పరిమితులులేవు. ఆయనకు సమస్త శక్తియు అధికారమును కలవు (మత్తయి 28:18), మరియు ఆయనను అనుసరించువారు ఎచ్చోట యున్నను వారందరితోను ఆయన ఉండునట్లు ఆయన సన్నిధి విశాల విశ్వమందంతటను

చొచ్చుకొని వ్యాపించి యున్నది (మత్తయి 28:20; కీర్తనలు 139:7-12 చూడుము).

**యేసు మన సమస్త అక్కరలకు చాలినవాడై యున్నాడు (2:10)**

సంపూర్ణుడైయున్నవాడుగా, యేసు మన సమస్త అక్కరలను తీర్చగలడు. దీనిని సాధ్యము చేసిన చిట్టచివరి చర్య - ఆయన సిలువ మరణమే (హెబ్రీయులకు 5:8, 9). ఆయన జీవము, మరణము, మరియు పునరుత్థానము ద్వారా, సకల మానవులు ఆశీర్వదింపబడునట్లు ఆయన సాధ్యము చేసాడు. ఈ ఆశీర్వాదములలో దేవునితో సమాధానము (2 కొరింథీయులకు 5:18-20; కొలొస్సయులకు 1:20-22). పాపక్షమాపణ (మత్తయి 26:28), మరియు నీతి (2 కొరింథీయులకు 5:21), వీటన్నిటితోపాటు భౌతిక మరియు ఆధ్యాత్మిక అక్కరలు (ఫిలిప్పీయులకు 4:19) కూడ కలిసియున్నవి. "**ప్రభువు** నాకు సహాయకుడు" (హెబ్రీయులకు 13:6ఎ) అని క్రైస్తవులు దృఢమైన (ఆత్మ) విశ్వాసంతో చెప్పవచ్చును. "నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను" అని ఆయన వాగ్దానం చేసాడు (హెబ్రీయులకు 13:5బి).

ఆయన అనుచరుల గూర్చి తగు శ్రద్ధ వహించుటకు ఆయన అత్యంత సమర్ధవంతుడై యున్నందునుబట్టి, క్రైస్తవులు ఆయన యందు సంపూర్ణులు గావింపబడియున్నారు. ఆయన మానవుల యెడల కనుపర్చు శ్రద్ధ షరతులతో కూడినదై యున్నది. ఆయన రాజ్యమును మరియు నీతిని మొదట వెదకువారికి వారి సమస్త అక్కరలు తీర్చబడునని యేసు చెప్పాడు (మత్తయి 6:33). దేవుడు నీతిమంతులుగా జీవించువారికి ఏ మంచి విషయమైనను అనుగ్రహింపకమానడు (కీర్తనలు 84:11).

**యేసు మనకొరకు సమకూర్చియున్నాడు (2:11-13)**

క్రైస్తవులు యేసునందు సంపూర్ణులై యున్నారు ఏలయనగా ఆయన మనకు అవసరమైయున్న సమస్తమును సమకూర్చాడు. మనము ఆధ్యాత్మిక సున్నతి, నూతన జీవము, మరియు క్షమాపణ పొందునట్లు మన కొరకు ఆయన సాధ్యము చేయును.

(1) *ఆధ్యాత్మిక సున్నతి.* అందరు పాపము చేసియున్నారు (రోమీయులకు 3:23), కాబట్టి ప్రతి ఒక్కడు క్రైస్తవుడు కాకమునుపు పాపముతో మలినమైనవాడై యుండెను. ఒకని విధేయతాపూర్వక ప్రతిస్పందననుబట్టి, యేసు వాని సమస్త ఆధ్యాత్మిక మలినము నుండి వానిని శుద్ధిచేయును. సున్నతి చేయబడినప్పుడు శరీరములో నుండి మాంసము తొలగింపబడినట్లే, పాపిష్ఠి అభ్యాసములు క్రైస్తవుని జీవితంలో భాగమై యుండనేరవు. వాడు క్రైస్తవుడైనప్పుడు, యావత్తు మార్పు కలుగును; వాడు యిక పాపమునకు దాసుడైయుండక యేసును సేవించుచున్న జీవితము జీవించుటకు ఆరంభించును.

(2) *నూతన జీవము.* ఒకడు క్రైస్తవుడు కాకమునుపు, వాడు ఆధ్యాత్మికముగా పాపములో చచ్చినవాడై యున్నాడు. దేవుని కార్య ప్రభావమందు విశ్వసించుట ద్వారా, వాడు బాప్తిస్మము పొందునప్పుడు ఆధ్యాత్మికగా జీవింపజేయబడును. గత జీవితంలోని చెడు అలవాట్లను మరియు అభ్యాసములు ఇప్పుడు అంతమై, ఒక నూతన జీవితము ప్రారంభమౌతుంది (రోమీయులకు 6:4). యేసుకు అంకితమైన ఒక నూతన జీవం ఫలించినట్లయితే యేసు మరణము మరియు పునరుత్థానములో పాల్గొనుట జరుగుతుంది. అసహ్యంగా కనిపించు

గొంగళిపురుగు అందమైన సీతాకోకచిలుకగా మారినట్లు క్రైస్తవుడైనవాడు జీవితములో రూపాంతరము పొందాలి (రోమీయులకు 12:2).

(3) *క్షమాపణ.* ఒకడు నూతన జీవం పొందునప్పుడు, దేవుడు వాని అతిక్రమములన్నిటిని క్షమిస్తాడు, వాటినెన్నటికిని ఆయన జ్ఞాపకంచేసికొనడు (హెబ్రీయులకు 8:12). గత పాపములనుబట్టి ఆత్మనింద చేసికొనవలెను వేదన క్షమాపణ పొందినవాని హృదయంలో ఒక భారంగా యిక ఉండనవసరములేదు, అది వానికి అనుతాపం కలుగజేసి వానిని నీరసింపజేసి నిరుత్సాహపరచ కూడదు. ఈ విషయాన్ని పౌలు ఇలా ప్రకటిస్తున్నాడు: "అయితే ఒకటి చేయుచున్నాను, వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తుయేసునందు దేవుని ఉన్నత పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీయులకు 3:13బి, 14). క్షమాపణ పొందుకొన్నానను అవగాహన, వాడు తనను తాను మరి ఎక్కువ గొప్పగా యేసుకు అంకితం చేసికొనునట్లు అది వానిని ఉసిగొల్పుతుంది. ఎడతెరపిలేని క్షమాపణ పొందునట్లు, క్రైస్తవుడు వెలుగులో నడుచుకొనవలెను (1 యోహాను 1:7). వాడు మారుమనస్సు నొంది, చేసిన పాపములను దేవుని యెదుట ఒప్పుకొనవలెను (అపొస్తలుల కార్యములు 8:22; 1 యోహాను 1:9).

యేసు మనకవసరమైన సమస్తమునకు చాలినవాడై యున్నాడు. ఆయన దైవమై యున్నాడు. మనము ఆయనయందు సంపూర్ణులముగా చేయబడుదుము, ఏలయనగా ఆయన మన సమస్త ఆధ్యాత్మిక అక్కరలు సమకూర్చును.

**ధర్మశాస్త్రము మనకు అడ్డములేకుండునట్లు యేసు దానిని ఎత్తివేసాడు (2:14, 15)**

ధర్మశాస్త్రము మనకు అడ్డములేకుండునట్లు యేసు దానిని ఎత్తివేసాడు (2:14) ఏలయనగా మన పాపములను తీసివేయుటకు అది చాలనిదై బలహీనమైనదిగాను నిష్ప్రయోజనమైనదిగాను ఉండినది (రోమీయులకు 8:3; హెబ్రీయులకు 7:18, 19). ధర్మశాస్త్రమును అతిక్రమించినవారికి అది శాపము కలుగజేసినది (గలతీయులకు 3:10). అందరు పాపము చేసారు. కాబట్టి అందరు శాపగ్రస్తులయ్యారు (రోమీయులకు 3:23). ధర్మశాస్త్రము వలన కలిగిన శాపము నుండి క్రీస్తు మనలను విమోచించాడు (గలతీయులకు 3:13).

ధర్మశాస్త్రము కనికరము లేనిదై యుండినది (హెబ్రీయులకు 10:28), కనికరము నూతన ఒడంబడిక క్రింద సమకూర్చబడినది (హెబ్రీయులకు 8:12). కృప, ధర్మశాస్త్రము ద్వారా కలుగలేదు (గలతీయులకు 5:4), కానీ కృపను మరియు సత్యమును యేసు కలుగజేసాడు (యోహాను 1:14, 16, 17). ధర్మశాస్త్రము దానిక్రింద నుండినవారికి మరణము కలుగజేసినది (2 కొరింథీయులకు 3:7). యేసు ద్వారానే ఆధ్యాత్మిక జీవము కలుగును (యోహాను 14:6; 1 యోహాను 5:11, 12).

ధర్మశాస్త్రము క్రింద జీవించుటకు ప్రయత్నించువారు శిక్షావిధికి కారణమై (2 కొరింథీయులకు 3:9 చూడుము) నీతిలేనివారగుదురు (గలతీయులకు 2:21; 3:21). యేసునందున్నవారు ఆయన ద్వారా నీతిగా చేయబడుదురు (రోమీయులకు 5:21; 2 కొరింథీయలకు 5:21).

సాతాను వారి పాపములనుబట్టి పాపులపై అధికారము కలుగియున్నాడు (హెబ్రీయులకు

2:14). క్షమాపణ సమకూర్చి ధర్మశాస్త్రమును తీసివేయుట ద్వారా, యేసు సాతానును మరియు వాని సంబంధిత సమస్త దుష్టశక్తులను ఓడించాడు. క్రైస్తవులు యేసు ద్వారానే విజయము సాధించగలరు (1 కొరింథీయులకు 15:56, 57).

---

సూచనలు

[1]ఈ ఆశీర్వాదముల పేర్లు, వరుసగా, రోమీయులకు 3:24; 8:1, 38, 39; 1 కొరింథీయులకు 1:2, 4 (2 తిమోతి 1:9,10 చూడుము); 2 కొరింథీయులకు 5:17, 19, 21; ఎఫెసీయులకు 1:7; 2:13; కొలొస్సయులకు 1:14; 2 తిమోతి 2:10; 1 యోహాను 5:11లో వ్రాయబడియున్నవి. [2]1 కొరింథీయులకు 11:3; ఎఫెసీయులకు 1:22; 4:15; 5:23; కొలొస్సయులకు 1:18. [3]Ralph P. Martin, *Colossians and Philemon*, New Century Bible Commentary (Gand Rapids, Mich.: Wm. B Eerdmans Publishing Co., 1973), 82. [4]Ibid., 81. [5]*Sarx* అను పదమును KJV (భాషారూపము) "శరీరము" అని 147 సార్లు, "శారీరక" అని రెండు సార్లు, "శారీరికముగా" అని ఒక్కసారి, మరియు "మాంసముగా" అని ఒక్కసారి అనువదించబడినది. [6]H. C. G. Moule, *The Epistles to the Colossians and to Philemon*, The Cambridge Bible for Schools and Colleges (Cambridge: University Press, 1893; reprint, 1902), 103. [7]Ibid. [8]R. C. Lucas, *The Message of Colossians and Philemon: Fullness and Freedom*, The Bible Speaks Today (Downers Grove, Ill.: InterVarsity Press, 1980), 102. [9]Hay, 94-95. [10]Carson, *Colossians*, 67.

[11]These words are *sunthaptō* ("buried with"; v. 12a); *sunegeirō* ("raised with"; v. 12b); and *suzōopoieō* ("made alive with"; v. 13b). రోమీయులకు 6:5, 8; ఫిలిప్పీయులకు 3:10; కొలొస్సయులకు 3:1; 2 తిమోతి 2:11తో పోల్చి చూడుము. [12]John E. Burkhart, *Worship* (Philadelphia: Westminster Press, 1982), 131. [13]Willam Hendriksen, *Exposition of Colossians and Philemon,* New Testament Commentary (Grand Rapids, Mich.: Baker Book House, 1964), 117, n. 87. [14]*American Heritage Dictionary,* 3d ed. (2001), s.v. "baptize." [15]Ernest Klein, *A Comprehensive Etymological Dictionary of the English Language* (Amsterdam: Elsevier Publishing Co., 1966), 1:147. [16]Lars Hartman, "Baptism," in *The Anchor Bible Dictionary,* ed. David Noel Freeman (New York: Doubleday, 1992), 1:583. [17]Massey H. Shepherd, Jr., *Encyclopedia International* (Danbury, Conn.: Lexicon Publications, 1981), 378. [18]J. B. Lightfoot, *Notes on the Epistles of St. Paul: 1 and 2 Thessalonians, 1 Corinthians 1-7, Romans 1-7, Ephesians 1:1-14,* Thornapple Commentaries (London: MacMillan & Co., 1895; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1980), 296. [19]Robert G. Bratcher and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letters to the Colossians and to Philemon,* Helps for Translators (New York: United Bible Societies, 1977), 57. [20]Warren W. Wiersbe, *The Bible Exposition Commentary* (Colorado Springs, Colo.: Chariot Victor Publishing, Cook Communications, 1989), 2:127.

[21]James D. G. Dunn, *The Epistles to the Colossians and to Philemon,* The New International Greek Commentry (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1996), 156. [22]Albrecht Oepke, "*baptō*," in *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Kittel, trans. and ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 1:539. [23]Barclay M. Newman and Eugene A. Nida, *A Translators Handbook on Paul's Letter to the Romans* (New York: United Bible Societies, 1973), 53. [24]A. S. Peake, *Epistle to the Colossians,* The Expositor's Greek Testament, ed. W. Robertson Nicoll (New York: George H. Doran Co., 1897), 526. [25]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph H. Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 513. [26]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 2d ed., trans. William F. Arndt and F. Wilbur Gingrich,

rev. and aug. F. Wilbur Gingrich and Fredrick W. Danker (Chicago: University of Chicago Press, 1979), 663. [27]Bauer (2000), 819. [28]See J. B. Lightfoot, *St. Paul's Epistles to the Colossians and to Philemon,* rev. (London: Macmillan & Co., 1916), 185; and Carson, *Colossians*, 67. See other passages where the objective genitive appears: Mk. 11:22; Rom. 3:22, 26; Gal. 2:16, 20; 3:22; Eph. 3:12; Phil. 1:27; 3:9; 2 Thess. 2:13. [29]Marvin R. Vincent, *Word Studies in the New Testament* (Grand Rapid, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1946), 3:168. [30]The same word appears in Ephesians 1:19; 3:7; 4:16; Philippians 3:21; Colossians 1:29; 2 Thessalonians 2:9, 11.

[31]J. Ithel Jones, *The New Bible Commentary* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 1048. [32]William Barclay, *The Letters to the Philippians, Colossians, and Thessalonians,* rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1975), 140. [33]Herbert M. Carson, *Stand Perfect in Wisdom* (Grand Rapids, Mich.: Baker Book House, 1981), 110. [34]Lewis B. Radford, *The Epistle to the Colossians and the Epistle to Philemon*, Westminister Commentaries (London: Methuen and Co., 1931), 232. [35]Ralph P. Martin, *Colossians: The Church's Lord and the Christian's Liberty* (Exeter, England: Paternoster Press, 1972), 87. [36]Bratcher and Nida, 58. [37]G. R. Beasley-Murray, *Baptism in the New Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1962), 154. [38]Karl Braune, "The Epistle of Paul to the Colossians" in *A Commentary on the Holy Scriptures: Critical, Doctrinal, and Homiletical, with Special Reference to Ministers and Students*, trans. M. B. Riddle, ed. John Peter Lange (Edinburgh: T. & T. Clark, 1870), 7:46. [39]Eduard Schweizer, *The Letter to the Colossians: A Commentary,* trans. Andrew Chester (Zürich: Benziger Verlag, 1976; reprint, Minneapolis: Augsburg Publishing House, 1982), 146. [40]J. Gresham Machen, *New Testament Greek for Beginners* (Toronto: Collier-Macmillan, 1951), 12.

[41]See Rom. 5:15-18, 20; 11:11, 12; 2 Cor. 5:19; Gal. 6:1; Eph. 1:7; 2:1, 5. [42]Bauer (2000), 770. [43]Ibid., 954. [44]Peter T. O'Brien, *Colossians, Philemon,* Word Biblical Commentary, vol. 44 (Waco, Tex.: Word Books, 1982), 119. [45]Bratcher and Nida, 60. [46]Bauer (2000), 290. [47]Ibid., 1083. [48]Ibid., 254. [49]E. K. Simpson and F. F. Bruce, *Commentary on the Epistles to the Ephesians and the Colossians,* The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1957), 238. [50]Hendriksen, 120-21.

[51]Ibid., 121, n. 90. [52]Carson, *Colossians,* 69. [53]See Ex. 34:22-25; Lev. 10:9; 11:1-40; Num. 10:10; 29:6; Deut. 5:12-15; 2 Chron. 8:13. [54]Lightfoot, *Colossians*, 189. [55]Carson, *Colossians*, 69 [56]Bauer (2000), 344. [57]Ibid., 28-29. [58]H. Dermot McDonald, *Commentary on Colossians & Philemon* (Waco, Tex.: Word Books, 1980), 86. [59]Ibid. [60]Clinton E. Arnold, *The Colossian Syncretism* (Grand Rapids, Mich.: Baker Books, 1996), 279.

[61]Ibid., 302. [62]Ibid., 281. [63]Bratcher and Nida, 63. [64]Bauer (2000), 915. [65]Eduard Schweizer, "*sarx*," in *Theological Dictionary of the New Testament,* ed. Gerhard Friedrich, trans. and ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1971), 7:135. [66]McDonald, 102. [67]Hendriksen, 116, n. 86.

# NIVలోని *SARX* (“రక్తమాంసము”)

ది న్యూ ఇంటర్‌నేషనల్ వర్షన్ (మరియు టుడేస్ న్యూ ఇంటర్‌నేషనల్ వర్షన్ యొక్క 2001 నాటి సవరింపు), సమర్థణ లేకుండా, బైబిలు వాక్యభాగము లోనికి “పాపిష్ఠి స్వభావము”ను మధ్యలో చేర్చుచున్నది. “శరీరము”/“రక్తమాంసము” అని అర్థమిచ్చునది, *sarx* అను గ్రీకు పదము, కొన్ని పర్యాయములు NIVలో వలె “పాపిష్ఠి స్వభావము” అని వ్యాఖ్యానింపబడుచున్నది, కానీ అత్యధికమైన ఇతర అనువాదములలో ఆ విధంగా లేదు.

NIVలో మరియు TNIV అనువాదకులు *sarx* అను పదమును “పాపిష్ఠి స్వభావము” అని కొలొస్సీ పత్రికలో రెండు పర్యాయములు (2:11, 13) వ్యాఖ్యానించారు. ఒక అధస్సూచికలో “లేక శరీరము” అని వ్రాయబడియున్నది. వారి పరపతికి తగినట్టుగా, *sarx* అను పదము NIV అనువాదం ప్రకారము కొలొస్సీ పత్రికలోని ఇతర వాక్యభాగములలో భిన్నముగా అనువదింపబడియున్నది: “మాంసయుక్తమైన దేహము” (1:22); “శరీరము” (1:24); “శరీర రీతిగా” (2:1); “శరీర విషయములో” (2:5); “శరీర సంబంధమైన మనస్సు” (2:18); “దేహము” (2:23); “శరీరము” (3:22). ఏది ఏమైనా, “పాపిష్ఠి స్వభావము” అని వాడబడినప్పుడు, అది *sarx* అను పదమునకు అనుచితమైన ప్రతినిధిగా ఉండుట మాత్రమే గాక, మానవుని స్వభావము గూర్చి బైబిలు సంబంధమైన భావమును సహితము నిరాకరించుచున్నది. ఈ క్రింది వాక్యభాగములను పోల్చిచూడుము:

| | | KJV | NASB | NIV |
|---|---|---|---|---|
| రోమా | 7:5 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | 7:18 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | 7:25 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | 8:3 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | | “పాపిష్ఠి శరీరము” | “పాపిష్ఠి శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 8:4 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | 8:5 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | | “శరీరము” | “శరీరము” | “స్వభావము కోరుకొనునది” |
| | 8:6 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | 8:7 | “శరీరము మనస్సు” | “శరీరముపై దృష్టినుంచు మనస్సు” | “పాపిష్ఠి మనస్సు” |
| | 8:8 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | 8:9 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |

| | | KJV | NASB | NIV |
|---|---|---|---|---|
| | 8:12 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి స్వభావము” |
| | | “శరీరము” | “శరీరము” | (“అది”) |
| | 8:13 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 13:14 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| 1 కొరింథీయులకు | 5:5 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| గలతీయులకు | 5:13 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 5:16 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 5:17 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 5:19 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 5:24 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 6:8 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | | “శరీరము” | “శరీరము” | “ఆ స్వభావము” |
| ఎఫెసీయులకు | 2:3 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | | “శరీరము” | “శరీరము” | (“దాని యొక్క”) |
| ఎఫెసీయులకు | 2:11 | “శరీరము” | “శరీరము” | “పుట్టుక తోనే” |
| | | “శరీరము” | “శరీరము” | “శరీరములో” |
| కొలొస్సయులకు | 2:11 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 2:13 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| 2 పేతురు | 2:10 | “శరీరము” | “శరీరము” | “పాపిష్ఠి మానవుడు” |
| | 2:18 | “శరీరము” | “శారీరకకోరికలు” | “పాపిష్ఠి మానవ స్వభావము” |